అన్నీ ఆయనకు తెలియకుండానే జరిగాయా!?

కాకాణిపై ఎమ్మెల్యే సోమిరెడ్డి ఫైర్

- వివరాలు 8లో..





కామాక్షితాయి సన్నిధిలో వివిధ రకాల పూలు, పండ్లతో అలంకరించిన అంతరాలయం

కల్యాణ వైభోగమే!

సంప్రదాయంగా కామాక్షితాయి వివాహం

భక్తజనంతో కిటకిటలాడిన జొన్నవాడ

తెప్పపై విహరించిన ఆదిదంపతులు

బుచ్చిరెడ్డిపాళెం, మే 26 (ఆంధ్రజ్యోతి) : వేద పండితుల మంత్రోచ్ఛరణ, మంగళవాయిద్యాల నడుమ భక్తులే పెళ్లిపెద్దలుగా జొన్నవాడలో సోమవారం గంగా, కామాక్షితాయి సమేత శ్రీ మల్లికార్జునస్వామి వారి కల్యాణం సోమవారం కనులపండువగా జరిగింది. ఇక్కడ జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా జరిగిన ఈ వేడుకకు ముందుగా స్వామి, అమ్మవారి ఎదురుకోలు భక్తులను అలరించింది. అనంతరం ఉత్సవర్లను కల్యాణవేదికపై కొలువుదీర్చి, ఉభయదాతలు వల్లూరు రవీంద్రకుమార్ రెడ్డి,పెద్ద కామాక్షమ్మ దంపతులు, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, సేవా కమిటీ ఈఓ, వేర్వేరుగా పట్టువస్త్రాలు, పీతాంబరాలు సమర్పించారు. అనంతరం జరిగిన కల్యాణ మహోత్సవాన్ని తరలివచ్చిన భక్తజనం తిలకించి పులకించి పులకించింది. పలువురు దాతలు భక్తులకు మజ్జిగ, మంచి నీరు సరఫరా చేశారు. ఆలయ నిత్యాన్నదాన సదనంతోపాటు స్థానిక కాశీ అన్నపూర్ణేశ్వరి నిత్యాన్నదాన సదనం, టీటీడీ సత్రం ఆవరణం, స్థానిక బ్రాహ్మణ సామాజిక వర్గం ఇంకా పలుచోట్ల పలు సామాజిక వర్గాల వారు భక్తుల కోసం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలను ఆలయ ఈఓ శ్రీనివాసులురెడ్డి, సేవా కమిటీ ఛైర్మన్ తిరుమూరు. అశోక్ రెడ్డి, సభ్యులు, సర్పంచు పెంచలయ్య పర్యవేక్షించారు.

● వైభవంగా తెప్పోత్సవం

రాత్రి పెన్నానదిలో గంగా, కామాక్షితాయి సమేత మల్లికార్జునస్వామి వారు తెప్పపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. తెప్పోత్సవాన్ని తిలకించేందుకు వచ్చిన భక్తజనంతో పెన్నానదికి ఇరువైపులా కిటకిటలాడింది. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఉత్సవర్లకు గ్రామోత్సవం జరిగింది. కాగా, అంతరాలయం, గర్భాలయంతోపాటు ఆలయ ప్రాకారానికి చేసిన విశేష పుష్పాలంకరణ భక్తులను ఆకట్టుకుంది.

యోగా ప్రాముఖ్యతను తెలియజేయండి!

అధికారుల సమీక్షలో కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(విద్య), మే 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ప్రజలకు యోగాపై ఆసక్తి కల్పించేందుకు, యోగా ప్రాముఖ్యతను తెలియచేసేందుకు అధికారులంతా కృషి చేయాలని కలెక్టర్ ఓ ఆనంద్ సూచించారు. కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో సోమవారం అధికారులతో ఆయన సమీక్షించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పిలుపు మేరకు అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని చేపడుతున్న యోగాంధ్ర అవగాహన కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహించాలని ఆదేశించారు. ప్రతీ ఇంటికి వెళ్లి యోగా ప్రాధాన్యతను, ఆరోగ్య ప్రయోజనాలను ప్రజలకు వివరించేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. మండలస్థాయిలో నిర్వహించే అన్నీ కార్యక్రమాల్లో అధికారులు పాల్గొని యోగాలో ప్రజలను భాగస్వాములను చేయాలని దిశానిర్దేశం చేశారు. సుమారు 200 మంది మాస్టర్ ట్రైనర్స్ యోగాసనాలపై శిక్షణ పూర్తి చేశారని, వీరిని సమన్వయం చేసుకుంటూ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. యోగాంధ్ర కార్యక్రమాల అమలుకు జిల్లాస్థాయిలో డీఎస్‌డీవో యతిరాజ్‌ను నోడల్ అధికారిగా నియమించామని, ఏదైనా సందేహాలుంటే ఆయనను సంప్రదించాలని సూచించారు.

● 4 పర్యాటక కేంద్రాల్లో కార్యక్రమాలు

జిల్లాలో నిర్వహించే యోగాంధ్ర కార్యక్రమాల్లో భాగంగా పర్యాటకశాఖ ఆధ్వర్యంలో నాలుగు ప్రముఖ కేంద్రాల్లో యోగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని కలెక్టర్ చెప్పారు. బుధవారం నగరంలోని స్వర్ణాల చెరువు వద్ద, జూన్ 6న మైపాడు బీచ్ వద్ద, జూన్ 10న ఉదయగిరి ఆలయం ఎదుట, జూన్ 16న పెంచలకోనలో ఉదయం 7 నుంచి 8 గంటల వరకు యోగాసనాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రతీ పర్యాటక కేంద్రంలో కూడా సుమారు వెయ్యిమంది యోగా కార్యక్రమంలో పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, స్థానికుల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

● ప్రతి శుక్రవారం చెత్త నిర్మూలన కార్యక్రమం

నెల్లూరు (హరనాథపురం) : గ్రామాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించేందుకు ప్రతి శుక్రవారం ప్రత్యేక చెత్త నిర్మూలన కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పీజీఆర్ఎస్‌లో పరిష్కరించిన అర్జీలపై అర్జీదారుల నుంచి అభిప్రాయాలు తెలుసుకోవాలని సూచించారు. అర్జీల ఆడిటింగ్‌ను పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని ఆదేశించారు. ఉపాధి హామీ పనుల వేగం పెంచాలని, ప్రతివారం కనీసం 70 శాతం తగ్గకుండా పనులు జరిగేలా ప్రత్యేక దృష్టి సారించాలని దిశానిర్దేశం చేశారు. ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసేందుకు ఎంపీడీవోలు ప్రతివారం సమీక్షలు నిర్వహించాలన్నారు. జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం నాడు ప్లాస్టిక్ కాలుష్యాన్ని నివారించడానికి చర్యలు చేపట్టాలన్నారు. సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్ల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ కార్తీక్, డీఆర్వో ఉదయభాస్కర్, నెల్లూరు నగర కమిషనర్ నందన్, జడ్పీ సీఈవో విద్యారమ, డీపీవో శ్రీధర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్ల పరిశీలన చేయించుకుంటున్న ఉపాధ్యాయులు

టీచర్ల బదిలీలకు 5,808 దరఖాస్తులు

పూర్తయిన ఎస్ఏల దరఖాస్తు ప్రక్రియ

నేటితో పూర్తికానున్న ఎస్‌జీటీల గడువు

హెచ్ఎంలకు సర్టిఫికెట్ల పరిశీలన

ఉపాధ్యాయ బదిలీలకు సంబంధించి సోమవారం నాటికి 5,808 దరఖాస్తులు వచ్చాయి. ఇప్పటికే గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయుల దరఖాస్తు గడువు పూర్తవగా, ప్రాథమిక పాఠశాలల హెచ్ఎం, స్కూల్ అసిస్టెంట్లకు ఆదివారం రాత్రితో దరఖాస్తుల స్వీకరణ పూర్తయింది. సెకండరీ గ్రేడ్ టీచర్లకు మంగళవారం రాత్రికి దరఖాస్తుల స్వీకరణ పూర్తికానుంది. సాఫ్ట్‌వేర్ లోపాలు, సాంకేతిక సమస్యలతో ఆదివారం రాత్రి వరకు కూడా దరఖాస్తులు స్వీకరించాల్సి వచ్చిందని అధికారులు తెలిపారు.

నెల్లూరు (విద్య), మే 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఉపాధ్యాయ బదిలీల ప్రక్రియ వేగవంతంగా కొనసాగుతోంది. ప్రధానోపాధ్యాయుల నుంచి 139 దరఖాస్తులు స్వీకరించడంతోపాటు 9 అభ్యంతరాల సమస్యలను కూడా పరిష్కరించారు. మొత్తం 92 పోస్టులకు గాను 1:3 చొప్పున సర్టిఫికెట్ల పరిశీలన చేసి తుది జాబితాను విడుదల చేయనున్నారు. స్కూల్ అసిస్టెంట్ల దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం కాగా సాంకేతిక లోపాలతో ఆలస్యం కావడంతో మరో రోజు గడువు పొడిగించారు. దరఖాస్తులు భారీగా వస్తుండటంతో జిల్లా విద్యాశాఖ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి వీటిని పరిశీలిస్తున్నారు. తొలిదశ పరిశీలన ఎంఈఓలు చేస్తుండగా రెండో దశ పరిశీలన జిల్లాస్థాయిలో డీఈఓ కార్యాలయంలో నిర్వహిస్తున్నారు. తొలిదశ పరిశీలనలో దరఖాస్తు చేసిన ఉపాధ్యాయుడి పూర్తి వివరాలను జతచేసి రెండోదశ పరిశీలనకు పంపిస్తున్నారు. ఆ తరువాత తుది జాబితాను సిద్ధం చేస్తున్నారు. ఈ ప్రక్రియ కోసం సిబ్బంది అర్ధరాత్రి వరకు శ్రమించాల్సి వస్తుంది. దీనికి తోడు సాఫ్ట్‌వేర్ సమస్యలు ఉత్పన్నవవుతుండటంతో బదిలీల ప్రక్రియలో జాప్యం జరుగుతోందని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

● భారీగా దరఖాస్తులు

టీచర్ల బదిలీలకు సంబంధించి భారీగానే దరఖాస్తులు అందుతున్నాయి. సోమవారం రాత్రి వరకు 5,808 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. వీరిలో ఇప్పటికే హెచ్ఎంలకు సంబంధించి 139 దరఖాస్తులు ప్రక్రియ పూర్తి కాగా ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంలు 82 మంది, స్కూల్ అసిస్టెంట్ లాంగ్వేజ్ (తెలుగు, ఇంగ్లీష్, హిందీ) సబ్జెక్ట్‌లకు 1096 మంది, స్కూల్ అసిస్టెంట్ నాన్ లాంగ్వేజ్ (గణితం, ఫిజికల్ సైన్స్, బయలాజికల్ సైన్స్, సోషల్)కు 1752 మంది, సెకండరీ గ్రేడ్ టీచర్లు 2,739 మంది దరఖాస్తులు చేసుకున్నారు. ఎస్‌జీటీలకు సంబంధించి మంగళవారం రాత్రితో గడువు ముగియనుండటంతో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

● నేడు హెచ్ఎంల సర్టిఫికెట్ల పరిశీలన

జిల్లాలోని జడ్పీ, మునిసిపల్ మేనేజ్‌మెంట్ పాఠశాలల్లోని స్కూల్ అసిస్టెంట్స్, తత్సమాన కేటగిరి ఉపాధ్యాయులకు ప్రధానోపాధ్యాయులుగా ఉద్యోగోన్నతి కల్పించేందుకు మంగళవారం సర్టిఫికెట్లు పరిశీలించనున్నట్లు డీఈఓ బాలాజీరావు తెలిపారు. ఇప్పటికే తుది జాబితాను జిల్లా విద్యాశాఖ వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు చెప్పారు.



ఈ జాబితాలోని అభ్యర్థులంతా నగరంలోని దర్గామిట్ట జడ్పీ బాలికోన్నత పాఠశాలకు మంగళవారం ఉదయం 9 గంటలకు సేవా పుస్తకాలు, అర్హత ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలన్నారు. పరిశీలన పూర్తయ్యాక అర్హులైన వారి తుది జాబితాను ఎంపిక చేసి హెచ్ఎంలుగా ఉద్యోగోన్నతి కల్పిస్తామని తెలిపారు.



నర్రవాడ పర్యాటక హబ్‌గా మారేనా!?

● 50 ఎకరాలు కేటాయించినా ముందుకు పడని అడుగులు

● అన్నీ అనుకూలిస్తే భక్తులు, పర్యాటకులకు ఎంతో సౌలభ్యం

వివరాలు 8లో..

ఉష్ణోగ్రత వివరాలు		
కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
నెల్లూరు	35.3	27.3
కావలి	33	28
ఆత్మకూరు	36	24
ఉదయగిరి	36	25
కందుకూరు	36	26



మినీ బైపా‌స్‌కు తూర్పు వైపున రామిరెడ్డి కాలువ స్థలంలో చదును చేసిన దృశ్యం

కాలువ భూముల కబ్జా

● రామిరెడ్డి కాలువపై కబ్జాదారుల కన్ను

● జీప్‌ట్రాక్‌ను ఆక్రమిస్తూ నిర్మాణాలు

● ఇప్పటికే రూ.కోట్లు విలువ చేసే స్థలం ఆక్రమణ

● కన్నెత్తిచూడని ఇరిగేషన్ శాఖ

నెల్లూరు, మే 26 (ఆంధ్రజ్యోతి) : కళ్ల ముందు కాలువను కబ్జా చేస్తున్నా ఇరిగేషన్ అధికారులకు పట్టడం లేదు. నెల్లూరు నగర నడిబొడ్డున రూ.కోట్లు విలువ చేసే రామిరెడ్డి కాలువ ఆక్రమణల చెరలోకి వెళుతోంది. ఇప్పటికే పలువురు కాలువ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. నెల్లూరు చెరువు నుంచి ప్రారంభమయ్యే రామిరెడ్డి కాలువ ఇస్కాన్ సిటీ వద్ద సర్వేపల్లి కాలువలో కలుస్తుంది. జెండావీధి, మూలాపేట, అరవింద్‌నగర్, శ్రీహరినగర్ మీదుగా ఈ కాలువ ప్రయాణిస్తుంటుంది. నగరంలో ఉన్న ప్రధాన డ్రెయిన్లలో ఇది ఒకటి. ఒకప్పుడు పంట కాలువ అయినప్పటికీ ఇప్పుడు నగరంలో ప్రధానమైన డ్రెయిన్‌గా ఉపయోగపడుతోంది. నగరంలో పడ్డ వర్షపు నీరు ఈ కాలువ మీదుగా సర్వేపల్లి కాలువలోకి చేరి నగరం బయటకు వెళుతుంటాయి. ఈ కాలువ ప్రాధాన్యతను గుర్తించి గత తెలుగుదేశం ప్రభుత్వంలో లైనింగ్ పనులు చేశారు. కాలువకు రెండు వైపులా కాంక్రీట్ వాల్స్ నిర్మించారు. అయితే కాలువ వెడల్పును తగ్గించి వాల్స్ నిర్మించడంతో ఒక్కో వైపు కాలువ స్థలంతోపాటు జీప్‌ట్రాక్‌ను కలుపుకుంటే 30 అడుగుల వరకూ స్థలం మిగులుతోంది. వాల్స్ నిర్మించడంతో ఆక్రమణదారులకు కలిసొచ్చింది. జీప్‌ట్రాక్‌ను కాపాడుకోవడంలో ఇరిగేషన్ అధికారులు విఫలమవడంతో కబ్జాదారులు ఆక్రమించేస్తున్నారు.

● రాళ్లు తొలగించి మరీ ఆక్రమణలు

మాగుంటలేఅవుట్ ఎన్టీఆర్ పార్కు సమీపంలో మినీబైపా‌స్‌కు తూర్పు, పడమర వైపు రామిరెడ్డి కాలువ ప్రవహిస్తుంది. కాలువ జీప్ ట్రాక్ స్థలం వరకూ గతంలో ఇరిగేషన్ అధికారులు ఫెన్సింగ్ రాళ్లు నాటారు. అయితే కొన్నాళ్ల తర్వాత ఆక్రమణదారులు ఆ రాళ్లను తొలగించారు. అయినా ఇరిగేషన్ అధికారులు పట్టించుకోలేదు. ఇప్పుడు ఒక్కొక్కరుగా కాలువ భూమిలోకి చొచ్చుకొని వస్తున్నారు. మినీబైపా‌స్‌కు పడమర వైపు అయితే కాలువ ఆక్రమణ స్పష్టంగా కనిపిస్తుంది. ఇక్కడే దాదాపు వంద అంకణాలకుపైగా స్థలం కబ్జాకు గురైంది. తాజాగా తూర్పు వైపు కొందరు కాలువను ఆక్రమించి ఏకంగా గోడలు నిర్మిస్తున్నారు. మరికొందరు డస్ట్‌తో కాలువ స్థలాన్ని చదును చేస్తున్నారు. ఇక్కడ నిర్మాణాలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఈ ప్రాంతంలో అంకణం విలువ రూ.10 లక్షలకు పైగానే ఉంది. మినీబైపా‌స్‌కు తూర్పు, పడమరన కాలువకు ఇరువైపులా సుమారు ఎకరం భూమి వరకూ ఇరిగేషన్ శాఖకు చెందినది ఉంటుంది. దీని విలువ రూ.60 కోట్ల వరకూ ఉంటుంది. ఇప్పటికే ఇందులో కొంత ఆక్రమణదారుల చేతుల్లోకి వెళ్లిపోయింది. మరికొన్ని రోజులు గడిస్తే కాలువ జీప్‌ట్రాక్ కనిపించకుండా పోయే ప్రమాదం కనిపిస్తోంది. ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు స్పందించి కాలువ స్థలాన్ని కాపాడుకోకపోతే భవిష్యత్‌లో ఇబ్బందులు ఎదుర్కోకతప్పదు.

'ప్రభుత్వ భూములు కాపాడండి'

కొడవలూరు, మే 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలో అక్రమార్కుల నుంచి ప్రభుత్వ భూములు కాపాడాలని టీడీపీ ఎస్సీ సెల్ మండల మాజీ అధ్యక్షుడు తువ్వర ప్రవీణ్ కోరారు. కొడవలూరులో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూములు అక్రమణకు గురై ఉన్నాయన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఇళ్ల స్థలాలు పేదలకు అందేలా కృషి చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో పత్రా శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9218
వెండి కిలో ధర	రూ. 1,00,600
వెండి ఒక గ్రాము	రూ. 103.60

సచివాలయాల కన్నా మీ సేవే మిన్న!

- ప్రభుత్వ పథకాల నమోదులో సిబ్బంది నిర్లక్ష్యం
- కార్యాలయంలో అందుబాటులో ఉండని ఉద్యోగులు
- ప్రజలకు తప్పని అవస్థలు



ఇందుకూరుపేట, మే 26(ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వంలో ప్రవేశ పెట్టిన సచివాలయ వ్యవస్థ ప్రజలకు సేవ చేయాల్సిన సచివాలయ సిబ్బంది ఏ ఒక్కరోజు ప్రజలకు అందుబాటులో ఉండడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో సచివాలయాల కన్నా మీసేవే మిన్న అని ప్రజలు అంటున్నారు. మండలతంలో 18 సచివాలయాలు ఉండగా ఒకటి, రెండు చోట్ల తప్ప మిగిలిన అన్ని సచివాలయాల్లో సిబ్బంది ఎప్పుడు అందుబాటులో ఉండడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం సామాన్య ప్రజలు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలంటే సచివాలయం చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తుందని ప్రజలు వాపోతున్నారు. ఒకవేళ అందుబాటులో ఉన్నా ప్రజలను దోచేస్తున్నారన్న విమర్శలు లేకపోలేదు. ముడుపులు చెల్లించినదే పనులు కావని నిర్మొహమాటంగానే చెబుతున్నారని లబ్ధిదారులు వాపోతున్నారు. గ్రామ సర్వేయర్‌లు రీసర్వే పేరుతో రైతులను నిలువునా దోచేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గ్రామ మహిళ సంరక్షణ కార్యదర్శి, మహిళా ఆరోగ్య సహాయకులు ఏ సచివాలయంలోనూ అందుబాటులో ఉండడం లేదని ఆయా గ్రామాల ప్రజలు అంటున్నారు. సచివాలయ సిబ్బంది పెడుతున్న ఇబ్బందులు ఎవరికి చెప్పుకోవాలో తెలియక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు మీసేవ ద్వారా సంక్షేమ పథకాలు నమోదు చేసుకునే అవకాశం ఉండేదని, ఇప్పుడు కూడా కూటమి ప్రభుత్వంలో మీసేవ ద్వారా నమోదు చేసుకునే అవకాశం కల్పించాలని మండల ప్రజలు కోరుతున్నారు.



రేషన్ బియ్యం అక్రమ రవాణాను అడ్డుకుంటాం

- తహసీల్దారు స్ఫూర్తిరెడ్డి

కొడవలూరు, మే 26(ఆంధ్రజ్యోతి) : పేదలకు ప్రభుత్వం సరఫరా చేసే రేషన్ బియ్యం చట్టవిరుద్ధంగా అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం. రేషన్ బియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నట్లు ఎవరు గుర్తించినా తమకు సమాచారం ఇవ్వాలని తహసీల్దారు స్ఫూర్తిరెడ్డి తెలిపారు.

? రేషన్ బియ్యం అక్రమ రవాణాను అడ్డుకుంటారా..

! జూన్ నెల నుంచి రేషన్‌షాపుల ద్వారా బియ్యం పంపిణీ జరగనుంది. రేషన్ డీలర్లు సక్రమంగా ప్రజలకు అందచేయాలని హెచ్చరించాం. రేషన్ బియ్యం అక్రమ రవాణా జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటాం.

? వీఆర్‌వోలు ప్రజలకు అందుబాటులో ఉండడం లేదని రైతులు వాపోతున్నారు.

! వీఆర్వోలు గ్రామాల్లో కచ్చితంగా నివాసం ఉండాలి. బదిలీల ప్రక్రియ అనంతరం దానిపై చర్యలు తీసుకుంటాం.

? గ్రామ సభల్లో రైతుల సమస్యలు పరిష్కారం కావడం లేదన్న ఆరోపణలున్నాయి.

! గ్రామ సభల్లో ప్రజా సమస్యలు పరిష్కరిస్తున్నాం. ఫిర్యాదుదారుడుని కార్యాలయానికి పిలిచి సమస్యను పరిష్కరిస్తున్నాం.

? నివాస స్థలాల సమస్య ఎలా పరిష్కరిస్తారు.

! మండల పరిధిలోని గ్రామాల్లో నివేశిత స్థలాలు లేనివారు దరఖాస్తు చేసుకోమని తెలిపాం. ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి ఈ సమస్యను పరిష్కరిస్తాం.

కండలేరులో 41.598 టీఎంసీల నీరు

రాపూరు, మే 26 (ఆంధ్రజ్యోతి) : కండలేరు పూర్తిస్థాయి నీటి మట్టం 68 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి మట్టం 41.598 టీఎంసీలు ఉందని కండలేరు డ్యామ్ ఏఈ కట్ట తిరుమలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఇన్‌ఫ్లో నీరు ఆగిపోగా, అవుట్‌ఫ్లో హెడ్ రెగ్యులేటర్ నుంచి 1990 క్యూసెక్కులు, లోలెవల్ స్లూయిస్ నుంచి 60 క్యూసెక్కులు, హైలెవల్ కెనాల్ నుంచి 20 క్యూసెక్కులు మొత్తం 2070 క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లో అవుతోందని ఏఈ తెలిపారు.

గ్రంథాలయంలో నీతి కథలు

కోవూరు, మే 26(ఆంధ్రజ్యోతి): స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా సోమవారం నీతి కథలు, వాటి ప్రాముఖ్యతను పూర్వ ఎంపీడీవో ఎస్ జయరామయ్య వివరించారు. బాలలు నీతి కథలు వినడం, చదవడం వల్ల భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోగలుగుతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పూర్వ తహసీల్దారు సురేంద్ర, ఉపాధ్యాయుడు జే కృష్ణమూర్తి, లైబ్రేరియన్ సురేంద్రరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

తోటపల్లిగూడూరు, మే 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నపల్లిపాలెం జడ్పీ హైస్కూల్‌లో 25 ఏళ్ల క్రితం చదువుకున్న విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం జరిగింది. కోడూరుకు చెందిన షేక్ అబూబకర్, చెన్నపల్లిపాలెంకు చెందిన ఊటుకూరు శ్రీనివాసులు, కొత్తకోడూరుకు చెందిన కావల్‌రెడ్డి రంగారెడ్డి ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థులు క్రికెట్ ఆడి ఉల్లాసంగా గడిపారు. ఈ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు ఐలావజ్జల శేషు, భక్తవత్సలరెడ్డి, రావూరు గోవర్ధన్ రెడ్డి, సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు

మనుబోలు, మే 26 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి సప్లమెంటరీ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. మనుబోలులో రెండు పరీక్షా కేంద్రాలను కావలి డిప్యూటీ డీఈవో హరిప్రసాద్ తనిఖీ చేశారు. కేంద్రంలో ఎంతమంది పరీక్షలు రాశారు, ఎంతమంది గైర్హాజరయ్యారన్న వివరాలను డిపార్టుమెంటల్, చీఫ్ ఎగ్జామినర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

మనుబోలు, మే 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అక్కంపేట, వీరంపల్లి, కొండుపాళెం, లింగారెడ్డిపల్లి, మడమనూరు గ్రామాల్లో సోమవారం త్రైత సిద్ధాంత భగవద్గీతపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. త్రైత సిద్ధాంత భగవద్గీతపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో త్రైత సిద్ధాంత, ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞానవేదిక పొదలకూరు కమిటీ అధ్యక్షుడు జీ పెంచల నరసయ్య, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సర్వేపల్లి సమగ్రాభివృద్ధే లక్ష్యం

- ఎమ్మెల్యే సోమిరెడ్డి



కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సోమిరెడ్డి

పొదలకూరు, మే 26 (ఆంధ్రజ్యోతి): సర్వేపల్లి నియోజకవర్గ సమగ్రాభివృద్ధే లక్ష్యం అని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. స్థానిక సచివాలయంలో ఏర్పాటుచేసిన కుట్టు శిక్షణ కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నప్పటికీ ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలోనే సర్వేపల్లి నియోజకవర్గంలో రూ.111.52 కోట్లతో 685 అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. రోడ్లు, మంచినీటి పథకాలు, కాలువల పూడికతీత, వైద్యశాలల అభివృద్ధి తదితర పనులు చేయడం జరిగిందన్నారు. గత వైసీపీ పాలనలో పంచాయతీలకు వచ్చే నిధులు కూడా దారి మళ్లించి నిర్వీర్యం చేశారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వంలో పవన్‌కల్యాణ్ పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా కేంద్రం నిధులను నేరుగా పంచాయతీలకే జమ చేస్తూ స్థానిక సంస్థలను బలోపేతం చేయడం జరుగుతోందన్నారు. పొదలకూరు మండలంలో 120 మందికి కుట్టుశిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. నియోజకవర్గంలో మొత్తం 583 మందికి శిక్షణ ఇచ్చి కుట్టుమిషన్‌లు ఉచితంగా అందచేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నరసింహారావు, తహసీల్దారు శివకృష్ణయ్య, పొదలకూరు మండల టీడీపీ అధ్యక్షుడు తలచీరు మస్తాన్ బాబు, పట్టణ అధ్యక్షుడు బొద్దులూరు మల్లికార్జున్‌నాయుడు, ఏఎంసీ వైస్ ఛైర్మన్ వెంపులూరి అరుణ, తెలుగు యువత మండల అధ్యక్షుడు వెన్నపూస రాజశేఖర్‌రెడ్డి, రైతు నాయకులు కోడూరు పెంచలభాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇంట్లోకి దూరిన నాగుపాము

- భయాందోళనకు గురైన కుటుంబసభ్యులు



పామును చూపుతున్న హోంగార్డు మోహన్

కోవూరు, మే 26(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పోతిరెడ్డిపాళెంలో ఆదివారం రాత్రి ఓ నాగుపాము ఇంట్లోకి దూరడంతో ఆ కుటుంబ సభ్యులు భయభ్రాంతులకు గుర య్యారు. వివరాల మేరకు.. స్థానిక పంచాయతీ కార్యాలయం ఎదురు ఇంట్లోకి అర్ధరాత్రి సమయంలో 5 అడుగుల నాగుపాము వచ్చింది. ఇంట్లో అటూ ఇటూ తిరుగుతూ కటుంబసభ్యులను భయభ్రాంతులకు గురి చేసింది. గ్రామస్థులు పోలీసులకు ఫోన్ చేయడంతో గస్తీ తిరుగుతున్న హోమ్ గార్డు విడవలూరు మోహన్ హుటాహుటిన అక్కడికి చేరుకుని ఇంట్లో గాలించాడు. ఆ పాము కన్పించకుండాపోయింది. రెండు గంటలకుపైగా వెతికిన తర్వాత మరుగులో దాగిన పామును గుర్తించి చంపేశారు. దీంతో కుటుంబసభ్యులు ఊపిరి పీల్చుకున్నారు.

మహానాడును విజయవంతం చేయాలి



సమావేశంలో పాల్గొన్న తెలుగుదేశం పార్టీ నాయకులు

సైదాపురం, మే 26 (ఆంధ్రజ్యోతి): కడపలో మూడు రోజులపాటు జరగనున్న టీడీపీ మహానాడు సభను విజయవంతం చేయాలని క్లస్టర్ ఇన్‌చార్జి పెమ్మసాని దిలీప్ చౌదరి తెలిపారు. సోమవారం స్థానిక పీఏసీఎస్ కార్యాలయం ఆవరణలో టీడీపీ మండల నాయకుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆదేశాల మేరకు పది బస్సులు ఏర్పాటుచేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల నాయకులు అమ్మినేని సుబ్రహ్మణ్యం నాయుడు, వరిగొండ సురేంద్ర, కేపీ రాజు, కందాటి విజయ్‌రాఘవరెడ్డి, దశయ్య నాయుడు, రాజశేఖర్‌రాజు పాల్గొన్నారు.

నాగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

కొడవలూరు, మే 26(ఆంధ్రజ్యోతి) : కొడవలూరులో వెలసివున్న నాగేశ్వర స్వామికి సోమవారం ప్రత్యేక పూజలు న్విహించారు. ఈ పూజా కార్యక్రమంలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

చాముండేశ్వరి బ్రహ్మోత్సవాల గోడపత్రిక ఆవిష్కరణ

ఇందుకూరుపేట, మే 26(ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంగపట్నంలో వెలసి ఉన్న చాముండేశ్వరి బ్రహ్మోత్సవాల గోడపత్రికను నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి నెల్లూరులోని వారి నివాసంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగాత వారు మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవో తాతా శ్రీనివాసులు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రావెళ్ల వీరేంద్రనాయుడు, మండల అధ్యక్షుడు పవన్‌కుమార్ రెడ్డి, నాయకులు గుండాల కృష్ణారెడ్డి, కొండూరు వెంకటరమణారెడ్డి, దుగ్గా శంకర్‌రెడ్డి, ముంగర కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న వేమిరెడ్డి దంపతులు

మోడేగుంటలో అభివృద్ధి జాడేది?

- అధ్వానంగా పారిశుధ్యం
- బస్సు సౌకర్యం లేక ఇబ్బందులు



మోడేగుంట గ్రామ ప్రధాన వీధి

కోవూరు, మే 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని మోడేగుంట గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామాలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయి. కాలనీల్లో డ్రైనేజీ వసతి లేకపోవడంతో పారిశుధ్యం లోపించింది. గ్రామంలోని ప్రధానవీధి మినహా మిగతా వీధులు మెరకచేయకపోవడంతో వర్షాకాలంలో నీరు నిలుస్తోంది. వీధులకు ఇరువైపులా పేడదిబ్బలు పెద్ద సంఖ్యలో ఉన్నాయి. చవిటి కాలువల్లో మురికి తొలగించకపోవడంతో దళితకాలనీలో వీధుల్లో మురుగునీరు ప్రవహిస్తోంది. వర్షాకాలంలో అదే మురుగు నీరు ఇళ్లల్లోకి చేరుతున్నట్లు స్థానికులు వాపోతున్నారు. ఎక్కడకక్కడ మురుగు పేరుకుపోవడంతో దోమల బెడద అధికంగా ఉంది. దీంతో ఎక్కడ అంటువ్యాధులు ప్రబలుతాయేనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల ఎక్కువ మంది జ్వరాలతో బాధపడుతూ చికిత్స కోసం నెల్లూరు నగరానికి పరుగులు తీస్తున్నారు. ఇదిలా ఉండగా ఈ గ్రామ ప్రజలు ప్రయాణానికి అవస్థలు పడుతున్నారు. మోడేగుంట మండల కేంద్రం కోవూరుకు దూరంగా మారు మూల ఉంది. నెల్లూరు నగరం నుంచి ప్రతి దినం ఒకే బస్సును ఆర్టీసీ నడుపుతోంది. విడవలూరు నుంచి బస్సు సౌకర్యం కల్పించాలని ఎప్పటి నుంచో స్థానికులు కోరుతున్నారు. మారుమూల గ్రామం కావడంతో మోడేగుంట గ్రామం వైపు అధికారులు కన్నెత్తి చూడటం లేదని స్థానికులు వాపోతున్నారు.

పారిశుధ్య సమస్య పరిష్కారానికి చర్యలు

మోడేగుంటలో పారిశుధ్య సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నాం. గ్రామం నుంచి ఎవ్వరు ఫోన్ చేసినప్పటికీ స్పందిస్తున్నాం. నిత్యం మోడేగుంటలో పర్యటిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నాము.

- సీహెచ్ శ్రీహరిరెడ్డి, ఎంపీడీవో



దళిత కాలనీలో డ్రైనేజీ కాలువ దుస్థితి

పశు వైద్యశాలకు శిథిలావస్థ

- పట్టించుకోని అధికారులు, పాలకులు

కొడవలూరు, మే 26(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వాలు మారుతున్నాయి... అధికారులు మారుతున్నారు... అయినా పశు వైద్యశాల పరిస్థితి మాత్రం మారడం లేదు. పశువైద్యశాల భవనం శిథిలావస్థకు చేరి అధ్వానంగా ఉంది. వర్షం వస్తే లోపల మడుగులా మారుతోంది. సామగ్రి, మందులు పెట్టడానికి ఖాళీ లేదు. ఏడాదిలో రెండుసార్లు ప్రతిపాదనలు పంపుతూ అనుమతులు కోసం ఎదురు చూస్తూనే ఉన్నారు. ఇంతకీ ఇది ఎక్కడ అనుకుంటున్నారా.. మండల కేంద్రమైన కొడవలూరు పశు వైద్యశాల దుస్థితి. ఈ పశు వైద్యశాల నుంచి సుమారు 10 నుంచి 12 గ్రామాల పరిధిలో పశువులకు దాదాపు 30 ఏళ్లకుపైగా ఇక్కడ నుంచే వైద్య సేవలు అందిస్తున్నారు. ప్రస్తుతం ఈ భవనాన్ని అధికారులు, పాలకులు పట్టించుకున్న దాఖలాలులేవు. మరమ్మతులు కూడా చేయలేదు. శిథిల గదుల్లో మందులు అట్టపెట్టెలో పెట్టి ఉంచుతున్నారు. వర్షం పడితే మందులు నిల్వ ఉంచిన గదిలో పట్టలు కప్పాల్సిన దుస్థితి. మరోవైపు భవనంపై చెట్లు పెరిగి గోడలు పగుళ్లతో కూలేందుకు సిద్ధంగా ఉంది. ప్రభుత్వం ఇకనైనా స్పందించి నూతన భవనం మంజూరు చేసి నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.



రోడ్డు గుంతలమయం

కొడవలూరు, మే 26(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెయ్యలపాలెం నుంచి గండవరం వెళ్లే రోడ్డు అధ్వానంగా మారడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులుపడుతున్నారు. ఎప్పుడో వేసిన రోడ్లు గుంతలమయంగా మారాయి. దీంతో రెండు రోజులు కురిసిన వర్షాలకు రోడ్డుపై గుంతల్లో నీరు నిల్వ చేరడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న వారు, గర్భిణులు ఈ రోడ్డులో వెళ్లాలంటే నరకయాతన పడుతున్నారు. ప్రభుత్వం ఇకనైనా రోడ్డును నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.



C.R.I.M.E N.E.W.S

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

నెల్లూరు(రూరల్, మే 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సౌత్ మోపూరులో సోమవారం పేకాట రాయుళ్లను అరెస్ట్ చేసినట్లు సీఐ గుంజి వేణు తెలిపారు. గ్రామంలోని పొలాల్లో పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు ఆకస్మిక దాడి చేసి అదుపులోకి తీసుకున్నామన్నారు. ఆరుగురు జూదరుల నుంచి రూ. 17 వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. వీరిపై కేసు నమోదు చేస్తున్నట్లు తెలిపారు.

ఆటో ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

ఉదయగిరి, మే 26 (ఆంధ్రజ్యోతి): ఆటో ఢీకొని ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డ సంఘటన స్థానిక బస్టాండ్ సెంటర్‌లో సోమవారం చోటుచేసుకొంది. వివరాల మేరకు.. మండలంలోని వీరారెడ్డిపల్లికి చెందిన వీరారెడ్డి పని నిమిత్తం ఉదయగిరికి వచ్చి పంచాయతీ బస్టాండ్‌లో నిలబడి ఉండగా దుర్గంపల్లెకు చెందిన ఓ ఆటోడ్రైవర్ వేగంగా వచ్చి వీరారెడ్డిని ఢీకొట్టాడు. దీంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి చేరుకుని ఆటోను, డ్రైవర్‌ను స్టేషన్‌కు తరలించారు. గాయపడ్డ వీరారెడ్డిని చికిత్స నిమిత్తం వైద్యశాలకు తరలించారు.

చికెన్ వ్యర్థాలు తరలిస్తున్న వాహనం పట్టివేత

సంగం, మే 26 (ఆంధ్రజ్యోతి): చికెన్ వ్యర్థాలు తరలిస్తున్న వాహనాన్ని మండల పరిధిలోని ముంబాయి జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారుజామున పోలీసులు పట్టుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. బెంగళూరు నుంచి ఓ లారీలో సుమారు 80 డ్రమ్ముల చికెన్ వ్యర్థాలను చేపల చెరువులకు మేతగా తరలిస్తుండగా గస్తీలో ఉన్న పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం మత్స్య, రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో పంచనామా నిర్వహించి సంగం పంపింగ్ స్కీమ్ పక్కన పోరంబోకు భూముల్లో గుంతలు తీసి పూడ్చివేశారు. లారీని స్వాధీనం చేసుకుని డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

వెంకటాచలం, మే 26 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడిన సంఘటన మండలంలోని పాలిచెర్లపాడు సమీపంలో సోమవారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. పొదలకూరు పట్టణానికి చెందిన వెంకటేశ్వర్లు తన ఆటోలో మరో ఇద్దరితో కలిసి పని నిమిత్తం కసుమూరుకు వచ్చి తిరిగి వెళ్తుండగా పాలిచెర్లపాడు దాటిన తర్వాత కల్వర్టు వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను తప్పించే క్రమంలో ఆటో కల్వర్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న ముగ్గురు స్వల్పంగా గాయపడ్డారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అదుపుతప్పి బోల్తా పడిన బైక్


- విద్యుత్ శాఖ ఏఈకి తీవ్రగాయాలు

పొదలకూరు, మే 26 (ఆంధ్రజ్యోతి): పొదలకూరు సమీపంలోని చిట్టేపల్లి తిప్ప వద్ద సోమవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో పొదలకూరు విద్యుత్ శాఖ ఏఈ శ్రీకాంత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. విధి నిర్వహణలో భాగంగా పొదలకూరు నుంచి చేజర్లకు మోటారుబైక్‌పై వెళుతుండగా చిట్టేపల్లి తిప్ప వద్ద బైక్ అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శ్రీకాంత్‌కు పొదలకూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రాథమిక చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తల్లి, కుమార్తె అదృశ్యంపై కేసు నమోదు

నెల్లూరు(క్రైం), మే 26 (ఆంధ్రజ్యోతి) : తల్లి, కుమార్తె అదృశ్యంపై నగరంలోని సంతపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు వివరాలు.నగరంలోని ఆచారివీధిలో కిశోర్ కుమార్ నివాసం ఉంటున్నారు. ఆయనకు భార్య, కుమార్తె(7) ఉన్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలో భార్య అప్పుడప్పుడు హుబ్లీలోని పుట్టింటికి వెళ్లి కొద్ది రోజులు ఉండివచ్చేది. ఈనెల 23న కిశోర్ కుమార్ పనికి వెళ్లారు. ఈ క్రమంలో భర్తకు ఫోన్‌చేసి నెల్లూరు రైల్వే స్టేషన్‌లో ఉన్నానని, కుమార్తెను తీసుకుని పుట్టింటికి వెళుతున్నానని చెప్పి, ఫోన్ పెట్టేసింది. దీంతో భర్త, బంధువులు రైల్వేస్టేషన్‌కు వెళ్లి చూడగా తల్లి, కుమార్తె కనిపించలేదు. హుబ్లీకి ఫోన్‌చేయగా అక్కడకు రాలేదని చెప్పారు. ఈ మేరకు కిషోర్‌కుమార్ సోమవారం సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రయాణికుడిపై ట్రావెల్స్ బస్ క్లీనర్ దాడి



గాయపడ్డ రమేష్‌తో భార్యాపిల్లలు

కావలి రూరల్, మే 26(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుడిపై వినాయక ట్రావెల్స్ బస్ క్లీనర్ గణేష్ దాడి చేసిన ఘటన కావలి ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఆదివారం అర్ధరాత్రి జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. బాపట్ల నుంచి బెంగళూరుకు వెళుతున్న వినాయక ట్రావెల్స్ బస్‌లో బెంగళూరు వెళ్లేందుకు జలదంకి మండలం ఆదిరెడ్డిపాలెంకు చెందిన నేలపాటి రమేష్, భార్య, పిల్లలతో ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతంలో ట్రావెల్ ఏజెన్సీ వద్దకు వచ్చారు. కావలి చేరుకున్న బస్‌లో రమేష్ లగేజీ పెట్టె విషయంలో బస్ సిబ్బంది దురుసుగా ప్రవర్తించటంతో వారి మధ్య వాగ్వివాదం జరిగింది. దీంతో బస్ క్లీనర్ గణేష్ ప్రయాణికుడు రమేష్‌పై దాడి చేశాడు. రమేష్ తలకు గాయాలు కావటంతో క్లీనర్ అక్కడ నుంచి పరారయ్యాడు. రమేష్ భార్య పిల్లలతో బస్ దగ్గర ఆందోళన చేయడంతో బస్సు నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని బస్సును పంపించి గాయపడిన రమేష్‌ను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. పరారైన బస్ క్లీనర్ గణేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. రెండవ పట్టణ ఎస్ఐ గౌస్‌బాషా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంగిరెడ్డిపాలెంలో బెల్టుషాపుల వివాదం

కలిగిరి, మే 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగిరెడ్డిపాలెంలో బెల్టుషాపుల నిర్వాహకుల మధ్య సోమవారం రాత్రి వివాదం జరిగింది. గ్రామంలో ఒక వ్యక్తి బెల్టుషాపు నిర్వహిస్తూ మద్యం విక్రయాలు సాగిస్తున్నాడని పలువురు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్ఐ ఉమాశంకర్ తన సిబ్బందిని గ్రామంలోకి పంపారు. ఆ వ్యక్తి వద్దకు పోలీసులు వెళ్లగా తానే కాదు గ్రామంలో మరి కొంతమంది కూడా బెల్టుషాపులు నిర్వహిస్తున్నారని, తన వద్దకే ఎందుకు వచ్చారని పోలీసులను ప్రశ్నించాడు. ఈ వివాదం సద్దుమణగక పోవడంతో ఎస్ఐ గ్రామానికి చేరుకొని బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పానీపూరి బండిని ఢీకొన్న వ్యాను

- చిరువ్యాపారికి తీవ్రగాయాలు

కావలి రూరల్, మే26(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణం ముసునూరు ఆటోస్టాండ్ వద్ద సోమవారం రాత్రి పానీపూరీ బండిని బొలెరో వ్యాను ఢీ కొంది. బాధితుని, బంధువుల వివరాల మేరకు... ఉత్తరప్రదేశ్‌కు చెందిన షెహజాద్ ఐదేళ్లుగా ముసునూరులో పానీపూరి బండి నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం రాత్రి వ్యాపారం అనంతరం బండి నెట్టుకుని ఇంటికి వెళ్తుండగా బొలెరో వ్యాను ఢీకొంది. దీంతో బండి ధ్వంసంకాగా షెహజాద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మద్యం మత్తులో ఉన్న వ్యాను డ్రైవర్‌ను స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. బాధితుడిని కావలి ఏరియా వైద్యశాలకు తరలించి మెరుగైన చికిత్స కోసం 108 వాహనంలో నెల్లూరుకు తరలించారు. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	130
స్కిన్ చికెన్	234
స్కిన్‌లెస్	260

కోడిగుడ్ల ధర (100): 510

పంపిణీకి సిద్ధంగా పుష్ కాట్స్, డస్ట్‌బిన్‌లు

నెల్లూరు(సిటీ), మే 26(ఆంధ్రజ్యోతి): నగరంలో ఇంటింటా చెత్త సేకరణను విస్తరిస్తున్న అధికారులు, వాహనాలు వెళ్లలేని ప్రాంతాల్లో పుష్‌కాట్స్ ద్వారా చెత్తను సమీకరించేందుకు బిన్నులు సిద్ధ చేశారు. వీటి తయారీ కంపెనీల నుంచి కొనుగోలు చేసిన కార్పొరేషన్ అధికారులు డివిజన్లకు పంపేందుకు సిద్ధమయ్యారు. ఒక్కో పుష్‌కాట్స్ పై నాలుగేసి బిన్నులను ఉంచి ఇంటింటా చెత్తను సేకరించనున్నారు. త్వరలో వీటిని సచివాలయాల వారీగా డివిజన్లకు అందచేయనున్నారు.



నేడు చర్చావేదిక

నెల్లూరు (హరనాథపురం) మే 26 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని కూరగాయల మార్కెట్ వద్ద ఉన్న గుర్రం జాషువా గ్రంథాలయంలో మంగళవారం ఉదయం 8గంటలకు చర్చావేదిక నిర్వహించనున్నట్లు ఆ గ్రంథాలయ కార్యనిర్వాహక అధ్యక్షుడు షేక్.ఖాసిం ఒక ప్రకటనలో తెలిపారు. జాషువా గ్రంథాలయం అసంపూర్తిగా నిలిచిపోయిందని, ఈ విషయమై కార్పొరేషన్ కమిషనర్ నందన్‌తో మాట్లాడడం జరిగిందన్నారు. మంగళవారం ఆయన గ్రంథాలయాన్ని సందర్శించి చర్చా వేదికలో పాల్గొంటారని తెలిపారు. గ్రంథాలయం పనులు పూర్తి చేసే విషయమై వేదికలో చర్చిస్తామన్నారు.

కాలుష్య కోరల్లో పచ్చని పల్లెసీమలు

● గ్రామస్థుల అవస్థలు
● పట్టించుకోని విద్యుత్ కంపెనీల యాజమాన్యాలు

తోటపల్లిగూడూరు, మే 26 (ఆంధ్రజ్యోతి): థర్మల్ విద్యుత్ ప్రాజెక్టుల కారణంగా పచ్చని పల్లెలు కాలుష్యం కోరల్లో చిక్కుకున్నాయి. వాటి నుంచి బూడిద రూపంలో వెలువడుతున్న కాలుష్యంతో ఆయా గ్రామాల్లో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మొక్కలు, చెట్లు మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. మండలంలోని వరకవిపూడి, మండపం, ఈదూరు పంచాయతీ పరిధిలో విద్యుత్ పవర్ ప్రాజెక్టు ఉంది. 1300 మెగావాట్ల విద్యుదుత్పత్తి లక్ష్యంతో ఏర్పాటు చేశారు. ఇందులో పరిశ్రమల నుంచి బూడిద రూపంలో వెలువడుతున్న విష వాయువులు ఈ పంచాయతీలను చుట్టుముడుతున్నాయి. దీంతో సహజ సిద్ధమైన వాతావరణం కనుమరుగవుతోంది. స్థానికులు అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. థర్మల్ విద్యుత్ ప్రాజెక్టుల కారణంగా వరకవిపూడి పంచాయతీలోని అనంతపురం, శివరామపురం, మండపం పంచాయతీలోని కాటేపల్లి, సీఎస్.పురం, గొల్లపాలెం, ఈదూరు పంచాయతీ గ్రామాల్లో పెద్ద పెద్ద చెట్లతోపాటు ఇళ్లల్లో పెంచుకుంటున్న పూలమొక్కలు సైతం ఎండుముఖం పడుతున్నాయి. పచ్చని చెట్లు కళ్లెదుట ఎండిపోవడంతో స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేగాక పంటలు కూడా సక్రమంగా పండని పరిస్థితులు నెలకొనడంతో రైతులు నష్టాలను చవిచూస్తున్నారు. విద్యుత్ పరిశ్రమల యాజమాన్యం స్పందించి కాలుష్య నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

గిరిజన కాలనీలో చేతిపంపు ఏర్పాటు

పొదలకూరు, మే 26 (ఆంధ్రజ్యోతి): పొదలకూరు మండలం నరసింహ కండ్రిక గిరిజన కాలనీలో చేతిపంపును అధికారులు ఏర్పాటుచేశారు. నీటి కోసం పడుతున్న ఇబ్బందులను కాలనీవాసులు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన సోమిరెడ్డి వెంటనే బోరు మంజూరు చేయించి చేతిపంపు బిగించాలని అధికారులను ఆదేశించారు. ఈమేరకు అధికారులు యుద్ధప్రాతిపదికన బోరు ఏర్పాటు చేసి చేతిపంపు అమర్చారు.

చిత్తడి నేల అథారిటీకి నలుగురు అధికారేతర సభ్యుల నియామకం

అమరావతి, మే26(ఆంధ్రజ్యోతి): స్టేట్ వెట్‌ల్యాండ్(చిత్తడి నేలల) అథారిటీకి నలుగురు అధికారేతర సభ్యులను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులిచ్చింది. స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్‌కు చెందిన చిత్తడి నేలల జీవావరణ శాస్త్ర నిపుణుడు ఆర్ రామ సుబ్రహ్మణియన్, ప్రపంచవ్యాప్త ప్రకృతి నిధి(డబ్ల్యూడబ్ల్యూఎఫ్-ఇండియా) రాష్ట్ర సంచాలకుడు ఫరీదా తంపాల్, కోయంబత్తూర్‌లోని తడి భూముల జీవావరణ విభాగం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ గోల్డిన్ క్వాడ్రోస్, డెహ్రాడూన్‌లోని అంతరించిపోతున్న జాతుల నిర్వహణ సంస్థ శాస్త్రవేత్త ఆర్ సురేష్‌కుమార్ సభ్యులుగా నియమితులయ్యారు. కాగా రాష్ట్రంలో చిత్తడి నేలల పరిరక్షణ కోసం స్టీరింగ్ కమిటీ స్థానంలో ఈ అథారిటీ ముఖ్యమంత్రి అధ్యక్షతన ఏర్పాటైంది. అధికారులతో పాటు మూడేళ్ల పదవీ కాలానికి అధికారేతర సభ్యులను ప్రభుత్వం నామినేట్ చేసింది.

బకాయిలు చెల్లించకపోతే సంక్షోభంలోకి విద్యా సంస్థలు

అమరావతి, మే 26 (ఆంధ్రజ్యోతి): విద్యాహక్కు చట్టం కింద చేరిన విద్యార్థుల ఫీజుల బకాయిలు విడుదల చేయాలని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సమాఖ్య ప్రభుత్వాన్ని కోరింది. లేనిపక్షంలో విద్యా సంస్థలు సంక్షోభంలో పడతాయని సోమవారం ఓ ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేసింది. విద్యా హక్కు చట్టం కింద ప్రభుత్వం ప్రతిపాదించిన ఫీజులపై అభ్యంతరం వ్యక్తంచేసినట్లు తెలిపింది. ప్రైవేటు పాఠశాలలకు ఇబ్బందికరంగా ఫీజులు నిర్ణయించడం సరికాదని పేర్కొంది. ఫీజులపై అధికారుల నుంచి సరైన సమాధానం రాకపోవడంతో ప్రతిపాదిత ఫీజులను తాము ఆమోదించలేదని తెలిపింది.

గుర్తుకొచ్చినప్పుడే నిషేధం !

● మిగతా సమయంలో విచ్చలవిడిగా ప్లాస్టిక్ వాడకం ● కార్పొరేషన్‌లో శాశ్వత నివారణ చర్యలేవీ?
● నామమాత్రంగా ఆకస్మిక దాడులు ● జరిమానాల పేరుతో శానిటరీ సెక్రటరీల పంచాయితీలు

నెల్లూరు(సిటీ), మే 26(ఆంధ్రజ్యోతి) : 'ప్లాస్టిక్‌ను నివారించాలి, పర్యావరణాన్ని కాపాడాలి... ప్లాస్టిక్ వాడకం, భవిష్యత్ తరాలకు ప్రమాదం... సింగల్ యూజ్ ప్లాస్టిక్‌ను అరికడదాం, ఆరోగ్యంగా జీవిద్దాం'... అంటూ కార్పొరేషన్ అధికారులు గుర్తుకొచ్చినప్పుడల్లా నిర్వహించే దాడుల్లో చెప్పే మాటలివి. అవగాహన ర్యాలీలు, సదస్సుల్లో ఇంకా ఎక్కువే చెప్తారు. కానీ ఆచరణలో మాత్రం చర్యలు శూన్యం. ప్లాస్టిక్ వస్తువులను అమ్మితే కఠినచర్యలు తీసుకుంటాం.. షాపుల్లో కవర్లు కనిపిస్తే భారీగా జరిమానాలు విధిస్తాం... అని ఇటీవల ఎన్ఎంసీ ఉన్నతాధికారులు ప్రకటించారు. అయితే ఆదిశగా ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదు. గత కమిషనర్ సూర్యతేజ ఒకటి రెండు రోజులు హడావుడి చేసి చేతులు దులుపుకున్నారు. చివరికి శానిటేషన్ సెక్రటరీలకు తనిఖీలు, జరిమానాలు విధించే బాధ్యత అప్పగించి సరిపెట్టుకున్నారు. వారేమో జరిమానాల పేరిట పంచాయితీలు చేస్తు పబ్బంగడుపుతున్నారు.

● కార్పొరేషన్‌పై కీలక బాధ్యత

ప్లాస్టిక్ తయారీ, క్రయ, విక్రయాలను అడ్డుకోవడంతో పాటు ప్రజల్లో అవగాహన తీసుకురావడం కార్పొరేషన్ పై కీలక బాధ్యత ఉంది. ఆ దిశగా అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. దస్త్రాలు తయారు చేస్తున్నారు. ఒకటి రెండు రోజులు హడావుడి చేసి చేతులు దులిపేసుకుంటున్నారు. ప్లాస్టిక్ వాడకంపై చర్యలు తీసుకుంటామని అధికారులు ప్రకటించినా, లేదా దాడులకు వెళ్లినా అటు ప్రజల్లోకానీ ఇటు వ్యాపారుల్లో కానీ పెద్దగా స్పందన ఉండటం లేదు. ప్రస్తుతం వీటి వాడకం నగరంలో విచ్చలవిడి అయింది.



వినియోగంలో ప్లాస్టిక్ కవర్లు

● యథేచ్ఛగా వాడకం

జిల్లాలో అధికారులు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా అరికట్టారు. కానీ నగరంలో అవే ఎక్కువగా వాడకలో ఉన్నాయి. వాటర్‌బాటిళ్లు, డిస్పోజబుల్ గ్లాసులు, 175 కంటే తక్కువ మైక్రాన్ల కవర్లు, ప్లేట్లు, కప్పులు, ఇతర వస్తువులు నిషేధంలో ఉన్నా, బహిరంగ మార్కెట్లోలోనే వీటి వాడకం కనిపిస్తోంది. ఆత్మకూరు బస్టాండ్ వద్ద పూల మార్కెట్లో ప్లాస్టిక్ కవర్ల వాడకం ఎక్కువగా ఉంది. అలాగే ఏసీ కూరగాయల మార్కెట్, రోడ్ల వెంబడున్న చిరువ్యాపారులు, టిఫిన్, టీ దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్లను బహిరంగంగానే ఉపయోగిస్తున్నారు. ఇక చిల్లర దుకాణాల్లోనూ వీటి వాడకం కనిపిస్తుంది. స్టోన్‌హౌస్‌పేట, ఆచారివీధి, పప్పులవీధి, రేబాలవారివీధి, పెద్దపోస్టాఫీసు, చిన్న, పెద్దబజార్లు, ట్రంకురోడ్డు, గాంధీబొమ్మ సెంటర్ ప్రాంతాలలో సింగిల్ యూజ్ ప్లాసిక్ అమ్మే వ్యాపారులున్నారు. వీరిపై అధికారులు ఎలాంటి దాడులు నిర్వహించకపోవడం గమనార్హం. ప్లాస్టిక్ నిషేధంపై యుద్ధం ప్రకటించి చేతులెత్తేసిన ఎన్ఎంసీ ఉన్నతాధికారులు ఆ బాధ్యతలను సచివాలయాలోని శానిటేషన్ సెక్రటరీలకు అప్పగించారు. వీరితో కొందరు ఆకస్మిక తనిఖీల పేరిట సదరు యజమానులపై జరిమానాలతో పంచాయితీలు చేస్తుకుంటున్నట్లు విమర్శలు గుప్పుమంటున్నాయి. నిషేధిత ప్లాస్టిక్ తయారీ కేంద్రాలకు వెళ్తున్న కొందరు ఆరోగ్య విభాగం అధికారులు అక్కడ వ్యాపారులతో లాలూచీ పడి భారీగా సొమ్ము చేసుకుంటున్నట్లు వినికిడి.

దాడులు చేస్తూనే ఉన్నాం



ప్లాస్టిక్ వాడకంపై ప్రతిరోజు దాడులు నిర్వహిస్తూనే ఉన్నాం. రోజువారి డేటా తీస్తున్నాం. సచివాలయ సెక్రటరీలకు ఆ బాధ్యతలను అప్పగించాం. వారు ఎక్కడెక్కడ తనిఖీలు చేశారు. ఎంత జరిమానాలు విధించారన్నది రోజువారి రిపోర్టులో ఉంటుంది.

- డాక్టర్ చైతన్య, ఎంహెచ్‌వో, ఎన్ఎంసీ

మహానాడును జయప్రదం చేయండి



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరురూరల్, మే 26 (ఆంధ్రజ్యోతి): కడపలో జరిగే మహానాడులో అందరం పాల్గొని విజయవంతం చేద్దామని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సోమవారం నెల్లూరులోని తన కార్యాలయంలో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. మహానాడు సభలో నెల్లూరురూరల్ నుంచి భారీగా పాల్గొని సత్తా చాటాలని చెప్పారు. మున్సిపల్ డివిజన్లు, గ్రామాల నుంచి ప్రతీకార్యకర్త, నాయకుడు విధిగా తరలిరావాలన్నారు. వచ్చేవారికి ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్నీ ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. అందరిపై ఎమ్మెల్యే కార్యాలయ పర్యవేక్షణ ఉంటుందని స్పష్టం చేశారు.

● ఏర్పాట్లలో రూరల్ నేత

ఎమ్మెల్సీ బీద రవిచంద్రతో కలిసి మహానాడు ప్రాంగణంలోని భోజన ఏర్పాట్లను టీడీపీ రూరల్ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పర్యవేక్షించారు. భోజన ఏర్పాట్ల కమిటీ కన్వీనర్‌గా వ్యవహరిస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డితో కలిసి ఆహార ఏర్పాట్లను పరిశీలించారు.

ప్రతి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపండి



నగర కమిషనర్‌కు సమస్యలు వివరిస్తున్న నగర వాసులు

నెల్లూరు(సిటీ), మే 26(ఆంధ్రజ్యోతి) : నగర వాసుల నుంచి వచ్చే ప్రతి సమస్యకు నిర్ణీత కాలవ్యవధిలో శాశ్వత పరిష్కారం చూపాలని ఎన్ఎంసీ కమిషనర్ వైవో నందన్ ఆదేశించారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ఆయన పాల్గొన్నారు. నగర వాసుల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ సమస్యలపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి పరిష్కారం చూపాలన్నారు. ఒకసారి వచ్చిన వినతి మరో సారి రాకుండా చూడాలని స్పష్టం చేశారు. ఒకటో డివిజన్ నారాయణరెడ్డిపేటలో రోడ్లు, మురుగు కాలువలు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారని సీపీఐ నాయకులు సిరాజ్, షాన్‌వాజ్ ఫిర్యాదు చేశారు. అనంతరం 8వ డివిజన్ నవాబుపేట, కుసుమ హరిజనవాడ, యనమలపాళెం ప్రాంతాల్లో పర్యటించిన కమిషనర్ యూజీడీ పనులను పర్యవేక్షించారు. 1,2 డివిజన్లలోని కల్తీకాలనీ, అల్లీపురం ప్రాంతాల్లో పారిశుధ్య పనులను తనిఖీ చేశారు.

1న యాదవ విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు



విలేకరులతో మాట్లాడుతున్న మాదాల వెంకటేశ్వరరావు తదితరులు

నెల్లూరు (హరనాథపురం), మే 26 (ఆంధ్రజ్యోతి): జూన్ 1న ఉదయం 8 గంటలకు యాదవ విద్యార్థులకు నగరంలోని గొలగమూడి రోడ్డులోగల యాదవ భవన్‌లో ప్రతిభ పురస్కారాలు అందచేయనున్నట్లు యాదవ ఎంప్లాయీస్, ప్రొఫెషనల్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ మాదాల వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం నగరంలోని ఓ నర్సింగ్ హోంలో అసోసియేషన్ కార్యవర్గ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఇటీవల పది పరీక్ష ఫలితాల్లో ఉమ్మడి నెల్లూరుజిల్లా, కందుకూరు డివిజన్లలో 470 మార్కులకు పైన సాధించిన యాదవ విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందచేయనున్నట్లు చెప్పారు.అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గుర్రం నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు పెరుమాళ్ల కొండయ్య మాట్లాడుతూ 97058 00794, 95731 05305 నెంబర్ల ద్వారా అర్హులయిన యాదవ విద్యార్థులు తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పురస్కార కార్యక్రమంలో పౌర సరఫరాలశాఖ మంత్రి కొల్లు పార్థసారథి, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, తదితరులు పాల్గొంటారని తెలిపారు. విలేకరుల సమావేశంలో అసోసియేషన్ నాయకులు డాక్టర్ మాదాల వెంకటరాజేష్, చెవుల రామచంద్రయ్య, గంగుల మధుసూదన్‌రావు, బొమ్మి నాగకిషోర్, ఒంటేరు హరిబాబు, పీలం సురేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

మహానాడు ఏర్పాట్లపై

నేతలతో ఎంపీ వేమిరెడ్డి భేటీ



మంత్రి నారాయణ, ఇతర నేతలతో చర్చిస్తున్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు (హరనాథపురం) మే 26 (ఆంధ్రజ్యోతి) : కడప మహానాడు ఏర్పాట్లపై నెల్లూరు పార్లమెంటు సభ్యులు, సమన్వయ కమిటీ సభ్యులు, ఆర్థిక కమిటీ సభ్యులు, ఇతర నేతలతో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి భేటీ అయ్యారు. సోమవారం కడపలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో పురపాలకశాఖ మంత్రి పొంగూరు నారాయణ, మంత్రి మండిపల్లి రాంప్రసాద్, నెల్లూరు నగర డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, టీడీపీ నేత విజయభాస్కర్‌రెడితోపాటు ఇతర నాయకులతో కలిసి మహానాడు ఏర్పాట్లపై సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చే పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు కల్పించాల్సిన వసతులు, ఏర్పాట్లు, ఇతర అంశాలపై మాట్లాడారు. అలాగే నెల్లూరు జిల్లా నుంచి వచ్చే వారి కోసం చేయాల్సిన ఏర్పాట్లపై చర్చించారు. ఎక్కడా ఇబ్బందులు కలగకుండా తీసుకోవాల్సిన చర్యలపై కూడా మాట్లాడారు. రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తో కూడా ప్రత్యేకంగా మాట్లాడి ఏర్పాట్ల వివరాలపై ఆరా తీశారు. ఆయన సలహాలు తీసుకున్నారు.

ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను సేకరించాలి

సీతారామపురం,మే26 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్త సేకరించాలని ఆత్మకూరు డివిజినల్ పంచాయతీ అధికారి షేక్ నయీంహసన్ తాజ్ గ్రీన్ అంబాసిడర్‌లకు సూచించారు. సోమవారం మండల కేంద్రమైన సీతారామపురం, గుండుపల్లి గ్రామ పంచాయతీలను ఆయన తనిఖీచేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం పంచాయతీలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలకు ప్లాస్టిక్ వాడకం వల్ల కలుగు నష్టాలను వివరించి ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని, గ్రామంలో సేకరించిన తడి, పొడి చెత్తను వేరు చేసి వర్మీకంపోస్ట్ తయారుచేయాలన్నారు.. గ్రామంలోని దుకాణదారులు చెత్తను బయట వేయకుండా చెత్తబుట్టలో వేసి పంచాయతీ పారిశుధ్య సిబ్బందికి అందచేయాలన్నారు.

నూర్‌బాషా జిల్లా కమిటీని రద్దు చేశాం



విలేకరులతో మాట్లాడుతున్న ఖాదర్‌బాషా

నెల్లూరు (హరనాథపురం) మే 26 (ఆంధ్రజ్యోతి) : నూర్‌బాషా (దూదేకుల) సంక్షేమ సంఘం జిల్లా కమిటీని రద్దు చేశామని ఆ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు షేక్.ఖాదర్ బాషా తెలిపారు. సోమవారం నగరంలోని ఒక సమావేశ మందిరంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో నూర్‌బాషాలకు తాను ఒక్కడినే నాయకుడినని చెప్పుకుంటూ, ఇప్పటివరకు ఉన్న జిల్లా అధ్యక్షుడు షేక్.సలీంను బాధ్యతల నుంచి తొలగించామన్నారు. అలాగే కమిటీని కూడా రద్దు చేశామన్నారు. జిల్లాలోని మండల నాయకులతో చర్చించాక నూతన కమిటీని ఎన్నుకుంటామని తెలిపారు. సమావేశంలో షేక్.బాబర్‌ఖాన్, షేక్.సుభాన్‌బాషా, షేక్.అల్తాఫ్, షేక్.ఖాజా మస్తాన్, షేక్.హ జరత్‌అలీ, షేక్.ఖాజారహమతుల్లా, షేక్.హబీబ్, షేక్.నాయబ్‌రసూల్, షేక్.ఖాదర్‌బాషా, షేక్.జ హీర్, షేక్.నజీర్, షేక్.ఖాజారహమతుల్లా, షేక్.సలీం, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు పౌష్టికాహారం పంపిణీ



పౌష్టికాహారం పంపిణీలో భానుశ్రీ, తదితరులు

నెల్లూరు(విద్య), మే 26 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో సోమవారం మాజీ మేయర్ ఎన్.భానుశ్రీ క్రీడాకారులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, గూడూరు స్ఫూర్తి సేవా సమితి సహకారంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. దాత నందిమండలం సుబ్బరాజు, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతల అమరేంద్రరెడ్డి, కార్యదర్శి పొన్నం రవిచంద్ర, కోశాధికారి జీకే గోపీనాథ్, సభ్యులు చంద్రమౌళి, డీవీ. సుబ్బరాజు, విజయమోహన్ నాయుడు, రాజారమేష్, నాగేశ్వరరావు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సహకారంతో రెండోపంట సాగు

బుచ్చిరెడ్డిపాళెం, మే 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రామచంద్రాపురం గ్రామంలో 150 ఎకరాలకుపైగా రెండో పంట సాగు కోసం కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ట్రాన్స్‌కో అధికారులతో మాట్లాడి వ్యవసాయ విద్యుత్ సరఫరా సమయాన్ని 16గంటలకు పెంచారు. దీంతో రైతులంతా నెల్లూరులోని ఎమ్మెల్యే నివాసానికి చేరుకుని కృతజ్ఞతలు తెలిపారు.

దత్తత స్వీకారం పునర్జన్మే..!

● అనాథ చిన్నారుల పాలిట వరం ● ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శిశుగృహ నిర్వహణ



నెల్లూరు శిశు గృహలోని చిన్నారులు

నెల్లూరు (హరనాథపురం) మే 26 (ఆంధ్రజ్యోతి) : అనాథ చిన్నారులకు దత్తత పునర్జన్మ లాంటిది. కొంతమంది మహిళలు/పురుషులు తమకు వద్దనుకున్న బిడ్డను రోడ్డు పక్కన కాలువలు, చెత్త కుప్పలు, ముళ్ల కంపల్లో పడేస్తుంటారు. అలాంటి బిడ్డలను గుర్తించి నెల్లూరు నగరంలోని శిశు గృహానికి బాలల సంరక్షణ అధికారులు చేరుస్తారు. ప్రేమను అందించడమే లక్ష్యంగా స్త్రీశిశు సంక్షేమశాఖ పిల్లల దత్తతతో అనాథ చిన్నారుల జీవితాల్లో వెలుగులు నింపుతోంది. పసిపాపలు ఏడుస్తారు... ఆ ఏడుపు ఆకలి కోసం కాదు... ప్రేమ కోసం...! రోడ్డు పక్కన వదిలేసిన పసిపిల్లలను, తల్లిదండ్రుల సంరక్షణ లేకుండా పోయిన చిన్నారులను కోర్టు ఆదేశాల ద్వారా లేదా పోలీసుల ద్వారా శిశుగృహకు తరలిస్తారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ శిశుగృహలో ఎందరో చిన్నారులు ఆశ్రయం పొందుతున్నారు.అక్కడున్న ప్రతి చిన్నారిని ఒకసారి చూస్తే మనసుకు హత్తుకుంటారు. చిన్న చేతులే కావచ్చు కానీ .. కలలు మాత్రం ఆకాశాన్ని అంటే స్థాయిలో ఉంటాయి. 'నాకు మమ్మీ డాడీ కావాలి' అని మూడేళ్ల చిన్నారి ముద్దుగా చెప్పిన మాటలు గుండెల్ని పిండేశాయి. గత కొన్నేళ్లుగా జిల్లాలో పిల్లల దత్తతపై అవగాహన పెరుగుతోంది. పలువురు దంపతులు స్త్రీ శిశు సంక్షేమ శాఖ ద్వారా చిన్నారులను దత్తత చేసుకుని వారి జీవితాల్లో వెలుగులు నింపుతున్నారు.

● 85 మంది దత్తత

2012 నుంచి ఇప్పటి వరకు నెల్లూరులోని ఉన్న శిశు గృహ ద్వారా 85 మంది చిన్నారులను దత్తత ఇచ్చారు. వారిలో జీరో నుంచి ఆరేళ్లలోపు బాలికలు 35మంది, బాలురు 22 మంది ఉన్నారు. ఆరేళ్ల నుంచి 18 ఏళ్లలోపు బాలికలు 19 మంది, బాలురు 9మంది ఉన్నారు. వారు దత్తతకు వెళ్లిన తల్లిదండ్రుల మధ్య కుటుంబం వాతావరణంలో ఎంతో చక్కగా పెరుగుతున్నారు. తాజాగా పిల్లలను పాక్షిక దత్తత తీసుకునే వారి కోసం స్త్రీ శిశు సంక్షేమ శాఖ వారు ఓ ప్రకటన విడుదల చేశారు.

● దత్తత ఎంతో సులభం

పిల్లలను దత్తత తీసుకోవాలనుకునే తల్లిదండ్రులు చట్టబద్ధంగానే దత్తత తీసుకోవాలి. మరే ఇతర పద్ధతుల్లోనైనా దత్తత తీసుకుంటే అది చట్టరీత్యా నేరం అవుతుంది. అలాంటివారు శిక్షార్హులు కూడా అవుతారు. దత్తత కోసం తల్లిదండ్రులు కారా (సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ)లో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం నూతనంగా రూపొందించిన మార్గదర్శకాల ప్రకారం దత్తత పొందడం అతి సులభం. పాన్‌కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, వయసు ధ్రువీకరణ పత్రం, వివాహ ధ్రువపత్రం, ఆరోగ్య ధ్రువీకరణ పత్రం తదితరాలు దత్తత తీసుకునే వారికి ఉండాలి. దత్తత తీసుకోవాలనుకునే తల్లిదండ్రులు వారి పాన్‌కార్డు ద్వారా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.కారా.ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలి. సిద్ధం చేసుకున్న ధ్రువపత్రాలను వెబ్‌సైట్‌లో వారి లాగిన్ ఐడీ ద్వారా 30 రోజులలోపు అప్‌లోడ్ చేయాలి. దత్తత ఏజెన్సీ వారికి గృహ అధ్యయన నివేదిక సమయంలో రూ.6వేలు డీడీ సమర్పించాలి. ఆ తర్వాత దత్తత ఏజెన్సీ వారు గృహ అధ్యయన నివేదికను తయారు చేసి వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తారు. అర్జీదారుకు బిడ్డను రెఫర్ చేస్తూ మొబైల్‌కు కారా నుంచి సమాధానం వస్తుంది. ఆ సమాచారం ప్రకారం 48 గంటలలోపు వెబ్‌సైట్‌లో లాగిన్ అయ్యి, దత్తత తీసుకునే బిడ్డను రిజర్వు చేసుకోవాలి. రిజర్వు చేసుకున్న బిడ్డను 30 రోజులలోగా దత్తత ఏజెన్సీ దగ్గరకు వెళ్లి బిడ్డ నచ్చిందని ఆమోదం తెలియజేసి, రూ.50వేల డీడీ సమర్పించి బిడ్డను పొందవచ్చు.

దత్తత కోసం సంప్రదించాలి



పిల్లలను దత్తత తీసుకోవాలనేవారు నెల్లూరులోని స్త్రీశిశు సంక్షేమ శాఖ కార్యాలయం దగ్గర ఉన్న ప్రత్యేక దత్తత కేంద్రమైన శిశు గృహను సంప్రదించాలి. అనంతరం నిబంధనలను అనుసరించి దత్తత స్వీకారం ఉంటుంది.

-బీ.సురేష్, జిల్లా బాలల సంరక్షణ అధికారి

గృహ లబ్ధిదారులకు 'ఉపాధి' కూలి చెల్లించండి

లింగసముద్రం, మే 26(ఆంధ్రజ్యోతి) : మండలంలో పక్కా గృహాలు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు ఉపాధిహామీలోని 90 రోజుల పని దినాలకు సంబంధించిన కూలి డబ్బులు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో కట్టా శ్రీనివాసులు ఆదేశించారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధిహామీ టిఏలు, హౌసింగ్ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ హౌసింగ్ సిబ్బంది ఇచ్చిన నివేదిక ప్రకారం మండలంలో ఏఏ గ్రామాల్లో పక్కా గృహాలు నిర్మిస్తున్నారో క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. మండలానికి కేటాయించిన 21 ఫారం పాండ్లకు నిధులు మంజూరుకు ప్రణాళిక తయారు చేసి జిల్లా డ్వామా కార్యాలయానికి పంపించాలన్నారు. టిఏలు గ్రామాల్లో జరిగే ఉపాధి హామీ పనుల వద్దకు ఉదయం 9 గంటలకు వెళ్లి తప్పనిసరిగా కూలీల హాజరును పరిశీలించి పని చేసేవారికే మస్టరు వేయాలన్నారు.



ఇదేం పద్ధతి మేయరమ్మా?

సుమారు 30 లక్షలమంది జనాభా కలిగిన జిల్లాకు ప్రథమ పౌరురాలిగా వ్యవహరిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ ఒక్క కారు మాత్రమే వినియోగిస్తున్నారు. అయితే 8 లక్షల జనాభా కలిగిన నెల్లూరు నగర ప్రథమ పౌరురాలు (మేయర్) మాత్రం రెండు కార్లను వినియోగిస్తున్నారు. ఈ విషయం వివాదస్పదంగా మారింది. ఆమె ఉపయోగి స్తున్న కియో కారుకు డ్రైవర్ల జీతం, డీజిల్ ఖర్చులు మేయర్ భరించాల్సి ఉండగా, అందుకు భిన్నంగా కార్పొరేషన్ నెలకు రూ. 60 వేలు అద్దె చెల్లిస్తున్నది. అంతేకాక కార్పొరేషన్ డ్రైవర్లు, ఆయిల్‌నే వాడుతున్నట్లు సమాచారం. మరో కొత్త కారును కూడా ఆమె వాడుతుండగా, దానికి కూడా ఆయిల్ ఎస్ఎంసీ నుంచి పడుతున్నట్లు వినికిడి. కార్పొరేషన్ ఆదాయాన్ని పరిరక్షించాల్సినవారే ఇలా వృథా చేయడం ఏమిటని నగర వాసులు ప్రశ్నిస్తున్నారు.

- నెల్లూరు (సిటీ, ఆంధ్రజ్యోతి)

పోస్టల్‌లో ఆధార్ సీడింగ్ చేయించుకోవాలి

నెల్లూరు(విద్య), మే 26 (ఆంధ్రజ్యోతి): పోస్టల్ శాఖ ద్వారా ప్రభుత్వ పథకాలు, పింఛన్లు పొందుతున్న లబ్ధిదారులందరూ వెంటనే ఆధార్ సీడింగ్ చేయించుకోవాలని పోస్టల్ సూపరింటెండెంట్ కే.శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్ సీడింగ్, బ్యాంక్ లింకింగ్, మ్యాపింగ్ చేయిం చుకోని లబ్ధిదారులకు పింఛను నిలిపి వేస్తామని తెలిపారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న వివిధ సంక్షేమ పథకాలు, డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ పథకాల అమలులో భాగంగా ప్రతి లబ్ధిదారుడు బ్యాంక్ ఖాతాను ఆధార్‌తో మ్యాపింగ్ అయ్యి ఉండాలన్నారు. ప్రతి గ్రామ, వార్డు పరిధిల్లో పోస్టల్ సర్వీసులు అందుబాటులో ఉన్నాయని, తగిన ఆధారాలతో పోస్టల్ కార్యాలయాలను సంప్రదించి సీడింగ్ చేయించుకోవాలని ఆయన తెలిపారు.



పూల దారి..!

దుత్తలూరు (ఉదయగిరి), మే 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దారు, ఎంపీడీవో, ఉపాధి, వెలుగు, వ్యవసాయ, హౌసింగ్ కార్యాలయాలకు వెళ్లే రహదారి ఇది. సుమారు అర కిలోమీటర్ పొడవునా ఉన్న ఆ రహదారికి రువైపులా చెట్లు పందిరిలా ఉండి పుసుపురంగు పూలతో చూపరులను ఆకర్షిస్తున్నాయి. ప్రస్తుతం కాస్తున్న ఎండలకు ఆ కార్యాలయాలకు వచ్చే అధికారులు, ప్రజలు ఆ చెట్ల నీడన సేదతీరుతూ ఉపశమనం పొందుతున్నారు.

అన్నీ ఆయనకు తెలియకుండానే జరిగాయా!?

- కాకాణిపై ఎమ్మెల్యే సోమిరెడ్డి ఫైర్

పొదలకూరు, మే 26 (ఆంధ్రజ్యోతి) : సర్వేపల్లి నియోజకవర్గంలో వైసీపీ నేత కాకాణి గోవర్ధన్‌రెడ్డికి తెలియకుండానే అక్రమ మైనింగ్, భూ ఆక్రమణలు జరిగాయా!? అంటూ సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ప్రశ్నించారు. సోమవారం పొదలకూరులో ఆయన మీడియాతో మాట్లాడుతూ గోవర్ధన్ రెడ్డి ప్రమేయం లేకుండానే అక్రమ మైనింగ్ జరిగిందని వైసీపీ నేతలు చెబుతారా అని ప్రశ్నించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలతోపాటు చివరకు జర్నలిస్టులపై కూడా తప్పుడు కేసులు పెట్టించాడని అన్నారు. ఐదేళ్లు లెక్కకు మించి పాపాలు చేశాడని, ఇప్పుడు ఫలితం అనుభవిస్తున్నాడని అన్నారు. ఇప్పటివరకు 55రోజులుగా అజ్ఞాతవాసం, ఈ రోజు నుంచి జైలు వాసం గడపబోతున్నాడంటూ వ్యాఖ్యానించారు. తప్పుడు పనులు చేసి జైలుకు పోతున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై వైసీపీ నేతలు సానుభూతి చూపడం దురదృష్టకరమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మస్తాన్‌బాబు, మల్లికార్జున్‌నాయుడు, ప్రభాకర్‌రెడ్డి, పెంచలభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో సగటు వర్షపాతం 11.8 మి.మీ

నెల్లూరు (హరనాథపురం) మే 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సోమవారం సగటు వర్షపాతం 11.8మి.మీగా నమోదైంది. అత్యధికంగా దుత్తలూరులో 43.6మి.మీ, అత్యల్పంగా నెల్లూరు అర్బన్‌లో 1.4మి.మీ వర్షపాతం నమోదైంది.

నర్రవాడ పర్యాటక హబ్‌గా మారేనా!?



హైవే పక్కన స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు, ధర్మకర్తలు (ఫైల్)

ప్రముఖ పుణ్యక్షేత్రం నర్రవాడ వెంగమాంబ పేరంటాలు ఆలయానికి రాష్ట్రంతో పాటు కర్ణాటక, తెలంగాణ, మహారాష్ట్ర, తమిళనాడు తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తుంటారు. ఏటా ఇక్కడ జరిగే తిరునాళ్లతోపాటు ప్రతి ఆది, గురువారాల్లో భక్తులతో కిక్కిరిసిపోతుంది. ఇంతటి ప్రాధాన్యమున్న ఈ ఆలయాన్ని పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దేందుకు గత ప్రభుత్వం స్థల పరిశీలన చేసింది. అయినా అందుకు అనుగుణంగా అడుగులు ముందుకు పడలేదు.

- గత ప్రభుత్వంలో పరిశీలనకే పరిమితం
- 50 ఎకరాలు కేటాయించినా ముందుకు పడని అడుగులు
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

దుత్తలూరు (ఉదయగిరి), మే 26 (ఆంధ్రజ్యోతి) : వెంగమాంబ పేరంటాలు కోరిన కోర్కెలు తీర్చే తల్లిగా పేరొందడంతో ఏటేటా భక్తుల తాకిడి పెరుగుతూనే ఉంది. అయితే అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు సరైన వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తల మండలి చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన పచ్చవ కరుణాకర్ సొంత నిధులు వెచ్చించి కొన్ని వసతులు కల్పించారు. అందులో భాగంగానే నర్రవాడ క్షేత్రాన్ని పర్యాటక హబ్‌గా చేస్తే మరింత అభివృద్ధి చెందుతున్న ఆలోచనతో ఆయన ప్రభుత్వానికి నివేదికలు పంపారు. ఇందుకుగాను నర్రవాడలో 565 జాతీయ రహదారి పక్కనే 50 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించారు. ఆ భూమిని ఏపీ టూరిజం శాఖకు అప్పగిస్తే ఆ ప్రాంతంలో భక్తులు సేదతీరేందుకు హరిత హోటల్స్, రిస్టార్ట్స్, క్రీడా మైదానం, స్పోర్ట్స్ క్లబ్, యాత్రికులకు అవసరమైన భవనాలు, ఆహ్లాదకర వాతావరణం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటుంది. అటు ఆలయానికి వచ్చే భక్తులతోపాటు జాతీయ రహదారి పక్కనే వీటిని ఏర్పాటు చేయనుండటంతో ప్రయాణికులు సైతం సేదతీరేందుకు వీలుగా ఉంటుందని భావించారు.

● పరిశీలనలకే పరిమితం

నర్రవాడను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు 2023, జూన్ 8న కావలి ఆర్డీవో శీనానాయక్, పలు శాఖల అధికారులు, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు నర్రవాడలో జాతీయ రహదారి పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిని పరిశీలించారు. ఆ భూమిని పర్యాటక శాఖకు అప్పగించేందుకు చర్యలు తీసుకోవడంతోపాటు క్షేత్రాన్ని అభివృద్ధి చేసేందుకు తోడ్పాటు అందిస్తామన్నారు. దీంతో స్థానికులతోపాటు అమ్మవారి భక్తులు ఎంతో సంతోషించారు. కానీ రెండేళ్లు కావస్తున్నా ఇంతవరకు ఎలాంటి పురోగతి కనిపించకపోవడంతో వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వమైనా వెంగమాంబ ఆలయాన్ని పర్యాటక హబ్‌గా తీర్చిదిద్ది, అభివృద్ధి చేయాలని భక్తులు కోరుతున్నారు.



ఆలయ అభివృద్ధికి ప్రతిపాదనలు

వెంగమాంబ ఆలయ అభివృద్ధికి రూ.6.50 కోట్లతో రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. లక్షలాది మంది భక్తులతో పూజలందుకుంటున్న అమ్మవారి ఆలయాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసి, భక్తులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా చర్యలు చేపట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేశాం. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాగానే ఆలయాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిద్దడంతోపాటు పలువురికి ఉపాధి అవకాశాలు కల్పిస్తాం.

- కాకర్ల సురేష్, ఎమ్మెల్యే, ఉదయగిరి

వెంగమాంబ బ్రహ్మోత్సవాలపై 30న సమీక్ష

దుత్తలూరు (ఉదయగిరి), మే 26 (ఆంధ్రజ్యోతి): శ్రీ వెంగమాంబ పేరంటాలమ్మ అమ్మవారి బ్రహ్మోత్సవాలు వచ్చేనెల 15 నుంచి 19వ తేదీ వరకు నిర్వహిస్తుండటంతో ఏర్పాట్లపై ఈనెల 30న అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో వెట్టిగుంట ఉషశ్రీ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, కావలి ఆర్డీవో వంశీకృష్ణ హాజరవుతారన్నారు. కావున సంబంధిత అధికారులు తప్పక హాజరు కావాలన్నారు. అలాగే ఉత్సవాల సందర్భంగా తాత్కాలిక దుకాణాల ఏర్పాటుకు బహిరంగ వేలం నిర్వహించడం జరుగుతుందని, ఆసక్తిగల వారు పాటలో పాల్గొనాలని ఆమె కోరారు.

డీసీ పల్లిలో పొగాకు ధరలు

మర్రిపాడు(ఆంధ్రజ్యోతి): డీసీపల్లి పొగాకు వేలం కేంద్రానికి సోమవారం రైతులు 518 బేళ్లను తీసుకురాగా 18 కంపెనీల ప్రతినిధులు వేలంలో పాల్గొని 450 బేళ్లను కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 68 బేళ్లను తిరస్కరించారు. కేజీ గరిష్ఠ ధర రూ.280 కాగా, కనిష్ఠ ధర రూ. 200 పలికినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు.

95 పొగాకు బేళ్ల తిరస్కరణ

కలిగిరి(ఆంధ్రజ్యోతి): కలిగిరి పొగాకు వేలం కేంద్రానికి సోమవారం రైతులు మొత్తం 476 పొగాకు బేళ్లు విక్రయానికి తీసుకొచ్చారు. వేలంలో తొమ్మిది కంపెనీల ప్రతినిధులు పాల్గొని 381 బేళ్లు కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 95 బేళ్లు తిరస్కరించారు. కిలో గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.200 నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి టీ ఇసాక్ స్వరన్‌దత్ తెలిపారు.

సముద్రపు నాచు మొక్కల పెంపకంపై శిక్షణ

- ప్రారంభించిన జిల్లా మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ నాగేశ్వరరావు

కందుకూరు, మే 26(ఆంధ్రజ్యోతి): రామాయపట్నం పోర్టు సమీప గ్రామమైన గుడ్లూరు మండలం కర్లపాలెంలో సముద్రతీరంలో సాగు చేయుచున్న సముద్ర నాచు మొక్కలు (సీవీడ్)పై మూడురోజుల శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈనెల 28 వరకు జరగనున్న ఈ శిక్షణ కార్యక్రమం స్కందమెరైన్ ఆల్గే సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో జరుగుతుందని జిల్లా మత్స్యశాఖ సంయుక్త సంచాలకుడు ఎం నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని సీఎస్ఐఆర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎల్.సతీష్, స్కంధ మెరైన్ ఆల్గే ప్రతినిధులు రామాయపట్నం పోర్టు పరిసరాల్లో సీ వీడ్ సాగుకు ఉన్న అనువైన పరిస్థితులను ప్రస్తుతం సీ వీడ్‌కు మార్కెట్లో ఉన్న డిమాండ్‌ను వివరించారు. ఇది రైతులకు లాభసాటిగా మారుతుందని తెలిపారు. స్థానిక మత్స్యకారులతో పాటు డాక్టరు బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా నుంచి వచ్చిన మత్స్యకారులు, మత్స్యశాఖ అధికారులు ఈ శిక్షణలో పాల్గొని సీ వీడ్ సాగు గురించి తెలుసుకున్నారు. ఆరు నెలలపాటు పరిశోధన అనంతరం ఈప్రాంతంలో సీవీడ్ సాగు చేయటం జరుగుతోందని వివరించారు. తొలిరోజు బోటు సహాయంతో శిక్షణకు హాజరైన వారందరినీ సముద్రంలో ఉన్న సముద్రుడు నాచుమొక్కల క్షేత్రసందర్శన చేయించారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ ఏడీ శ్రీనివాసులు, మత్స్యశాఖ అభివృద్ధి అధికారి లక్ష్మణ్ నాయక్, వీఏఏలు, సాగర్‌మిత్రలు, స్థానిక మత్స్యకార సహకార సంఘం సభ్యులు, గ్రామసర్పంచు రమణయ్య తదితరులు పాల్గొన్నారు.



సముద్రపు నాచు పెంపకంపై అవగాహన కల్పిస్తున్న సీఎస్ఐఆర్ శాస్త్రవేత్త డాక్టర్ సతీష్, మత్స్యశాఖ అధికారులు

సోమశిలలో 43.960 టీఎంసీల నీరు

అనంతసాగరం, మే 26 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం నీటినిల్వ సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా సోమవారం నాటికి 43.960 టీఎంసీలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఎగువ నుంచి 972 క్యూసెక్కులు ప్రవాహం వస్తుండగా పెన్నా డెల్టాకు 3,480, ఉత్తర కాలువకు 300, దక్షిణ కాలువకు 50 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

ఎస్పీ పీజీఆర్ఎస్‌కి వంద ఫిర్యాదులు

నెల్లూరు(క్రైం), మే 26 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌కి జిల్లావ్యాప్తంగా 100 మంది ఫిర్యాదుదారులు తరలివచ్చి వారి సమస్యలు తెలుపుకున్నారు. నగర డీఎస్పీ సింధుప్రియ ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌కు వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్టప్రకారం విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామన్నారు. అందిన ఫిర్యాదుల్లో కొన్నింటి వివరాలు.

● ఉలవపాడు ప్రాంతానికి చెందిన ఓ మహిళకు ఆన్‌లైన్‌లో ఓ వ్యక్తి పరిచమయ్యాడు. కిడ్నీవ్యాధులకు మందులు విదేశాల నుంచి తెప్పించి, పూర్తిగా తగ్గిస్తానని చెప్పి రూ.4.90 లక్షల నగదు తీసుకున్నాడు. మందులు ఇవ్వకుండా కాలయాపన చేస్తుంటే, తాను ఇచ్చిన నగదు తిరిగి ఇవ్వాలని ఆ మహిళ కోరింది. నగదు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నాడని, న్యాయం చేయాలని ఆ మహిళ కోరింది.

● నెల్లూరుకి చెందిన ఓ యువకుడు ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని పొదలకూరు ప్రాంతానికి చెందిన జరీనాబేగం, ఆమె కుటుంబసభ్యుల నుంచి రూ.9 లక్షలు తీసుకున్నాడు. ఉద్యోగం ఇప్పించకపోగా, నగదు తిరిగి ఇవ్వడం లేదని, న్యాయం చేయాలని ఆ యువతి తండ్రి కోరాడు.



ఫిర్యాదును పరిశీలిస్తున్న నగర డీఎస్పీ సింధుప్రియ

● నెల్లూరు సంతపేటకి చెందిన ఓ వ్యక్తికి హైదరాబాద్‌కు చెందిన రామ్‌కుమార్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి రూ.లక్షలు తీసుకొని మోసం చేశాడు. ఉద్యోగం ఇప్పించకపోగా, తిరిగి నగదు ఇవ్వడం లేదని న్యాయం చేయాలని బాధితుడు కోరారు.

● కలిగిరికి చెందిన ఓ మహిళను కావలి ప్రాంతానికి చెందిన జమీర్ వివాహం చేసుకుంటానని నమ్మించి శారీరకంగా కలిశాడని, పెళ్లి చేసుకోమంటే చేసుకోనని బెదరిస్తున్నాడని బాధితురాలి ఫిర్యాదు చేసింది. న్యాయం చేయాలని కోరింది.

● నెల్లూరు నవాబుపేటకి చెందిన ఓ మహిళ భర్త ప్రమాదంలో మరణించాడు. తన అత్త ఈశ్వరమ్మ తన ఇద్దరి పిల్లలను తన దగ్గర ఉంచుకొని ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నదని, ఇదేమని అడిగితే వారిని చంపేస్తానని బెదరిస్తున్నదని ఆ మహిళ ఫిర్యాదు చేశారు.

● తన కుమారుడు ఆస్తి కోసం వేధిస్తూ తన బాగోగులు చూసుకోవడం లేదని ఓ వృద్ధుడు ఫిర్యాదు చేశారు. నగరంలోని చిన్నబజారు ప్రాంతానికి చెందిన ఓ వృద్ధుడు పక్షవాతంతో బాధపడుతున్నట్లు, తన కుమారుడు పట్టించుకోవడం లేదని న్యాయం చేయాలని కోరాడు.

● టీపీ గూడూరుకి చెందిన రైతు తన రొయ్యలను సింగరాయకొండలోని రొయ్యల ఫ్యాక్టరీకి చెందిన శివరామకృష్ణకు రూ.12 లక్షలకు అమ్మాడని అతను, నగదు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నాడని న్యాయం చేయాలని కోరాడు.



ఉదయగిరిలో కురుస్తున్న వర్షం

విస్తారంగా వర్షాలు

ఉదయగిరి, మే 26 (ఆంధ్రజ్యోతి): గతనెల రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో రైతులు ఖరీఫ్ సాగుకు సన్నద్ధం అవుతున్నారు. ఎన్నడూలేని విధంగా పలు మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదైంది. వర్షాలు కురుస్తుండడం, మరోవైపు నైరుతి రుతుపవనాలు ప్రవేశిస్తుండడంతో రైతులు ఖరీఫ్ సాగుకు సమాయత్తమవుతున్నారు. వ్యవసాయ శాఖ పచ్చిరొట్ట విత్తనాలు రాయితీపై పంపిణీ చేసేందుకు చర్యలు చేపడుతోంది. గతేడాది రబీలో సాగు చేసిన పొలాల్లో రైతులు ఇతర పంటల సాగుకు సిద్ధమవుతున్నారు.

ఆధార్ కోసం అవస్థలు

ఉదయగిరి, మే 26(ఆంధ్రజ్యోతి): ఆధార్ కార్డుల్లో చేర్పులు, మార్పుల కోసం ప్రజలు అవస్థలు పడుతున్నారు. మండలంలో బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ఆధార్ నమోదు కేంద్రం తప్ప మరెక్కడా అందుబాటులో లేకపోవడంతో ప్రజలు చేర్పులు, మార్పుల కోసం గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. మరోవైపు సర్వర్ సమస్య ఉండడంతో రోజంతా పిల్లలతో అక్కడే ఉండాల్సి వస్తోందని వాపోతున్నారు. సీతారామపురం, వరికుంటపాడు, దుత్తలూరు మండలాల్లో సచివాలయాల్లో ఆధార్ నమోదు కేంద్రాలు ఉన్నా అవి సక్రమంగా పనిచేయడం లేదని, ఆయా మండలాల వారు సైతం బీఎస్ఎన్ఎల్ కేంద్రానికే వస్తుంతడడంతో సమస్య జఠిలంగా మారింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అన్ని మండలాల్లో ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



ఆధార్ కేంద్రంలో చిన్నారులతో నిరీక్షిస్తున్న తల్లిదండ్రులు



అర్జీదారుల సమస్యపై అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ ఆనంద్

కలెక్టరేట్‌కు వినతులే.. వినతులు

- సమస్యలు పరిష్కరించాలంటూ ఏకరువు
- అందిన అర్జీలు 407

నెల్లూరు (హరనాథపురం) మే 26 (ఆంధ్రజ్యోతి): ఎన్నడూలేని విధంగా కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌కు భారీగా అర్జీలు వచ్చాయి. 407 మంది తమ సమస్యలు పరిష్కరించాలని వినతులు సమర్పించారు. ఒకవైపు అర్జీదారులు, వారి బంధువులు, మరోవైపు ర్యాలీలతో కలెక్టరేట్ కిటకిటలాడింది. సోమవారం వాతావరణం చల్లగా ఉండడంతో జిల్లా నలుమూలల నుంచి అర్జీదారులు తరలివచ్చారు. అర్జీలు స్వీకరించిన కలెక్టర్ ఆనంద్ క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత అధికారులను పిలిచి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు సంతృప్తి చెందేలా అర్జీల పరిష్కారం ఉండాలన్నారు. వివిధ సమస్యలపై ప్రజలు అందించిన అర్జీలను జాప్యం లేకుండా వెంటనే పరిష్కరించేందుకు ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. పరిష్కరించలేని సమస్యను ఎందుకు పరిష్కరించలేకపోతున్నారో అర్జీదారులకు వివరించాలన్నారు.

● 407 అర్జీలు

పీజీఆర్ఎస్‌కు సోమవారం 407 అర్జీలను ప్రజలు అందజేశారు. వీటిలో రెవెన్యూవి 133, మున్సిపల్‌శాఖవి 17, సర్వేశాఖవి 46, పంచాయతీరాజ్‌శాఖకు 16, పోలీసు శాఖకు 52, సివిల్ సప్లయిస్ విభాగానికి 31 అర్జీలు అందాయి. ఈ కార్యక్రమంలో జేసీ కే.కార్తీక్, డీఆర్వో ఉదయ భాస్కర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

● 'ఎండీయూ'ను కొనసాగించాలి

ఎండీయూ వాహనాలను కొనసాగించాలని కోరుతూ ఏపీ రాష్ట్ర సమైక్య ఎండీఎస్ యూనియన్ ఆధ్వర్యంలో నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎండీయూ ఆపరేటర్లకు 2027 జనవరి వరకు ప్రభుత్వంతో అగ్రిమెంట్ ఉందని, ఎండీయూ వ్యవస్థ రద్దుతో 9260 మంది ఎండీయూ ఆపరేటర్లు, అదనంగా 9260 మంది హెల్పర్లు ఉపాధి లేకుండా పోయారన్నారు. 2027 వరకు ఎండీయూ వాహనాలను కొనసాగించాలని కోరారు. అంతకుముందు వారు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు.



ఆందోళన చేస్తున్న ఎండీయూ ఆపరేటర్లు

ఎండీయూ వాహనాలను ఆపొద్దు : ఆర్‌పీఐ

రాష్ట్రంలో రేషన్ సరుకుల పంపిణీకి సంబంధించిన ఎండీయూ వాహనాల నిలిపివేతను వ్యతిరేకిస్తూ సోమవారం నెల్లూరులోని బోసుబొమ్మ నుంచి కలెక్టరేట్ వరకు రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్‌పీఐ) నాయకులు ర్యాలీ నిర్వహించారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్కే మాబు మాట్లాడుతూ ఎండీయూ వాహనాలను నిలిపివేయడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల నిరుపేదలు, వృద్ధులు ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు. 18,500 ఎండీయూ వాహనదారుల కుటుంబాలు రోడ్డున పడుతాయన్నారు. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పట్టపు రంగారావు, ఉపాధ్యక్షుడు కొత్తల మధుసూదన్, ఆర్గనైజింగ్ కార్యదర్శి నంబూరు గణేష్, సురేష్, చిరంజీవి పాల్గొన్నారు.



- నెల్లూరు (హరనాథపురం)

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి : సీఐ

నంగం, మే 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక దుకాణదారులు పది రోజుల లోపల సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వేమారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో సూచించారు. నేరాల నియంత్రణలో భాగంగా సెక్యూరిటీ నిమిత్తం ప్రతి దుకాణంలో రెండు సీసీ కెమెరాలు రోడ్డుపై కనిపించేటట్లు ఏర్పాటు చేసుకుని నేరాల నియంత్రణలో పోలీసులకు సహకరించాలని సీఐ కోరారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9218
వెండి కిలో ధర	రూ. 100600
వెండి ఒక గ్రాము	రూ. 103.60

ఆ వాహనాలకు మోక్షమెప్పుడో..

● పోలీస్ స్టేషన్ల ప్రాంగణాల్లో తుప్పుపట్టిపోతున్న వాహనాలు
● యజమానుల ఆవేదన


పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉన్న వాహనాలు

ఉదయగిరి రూరల్, మే 26 (ఆంధ్రజ్యోతి): పలు రకాల కేసుల్లో పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు ఏళ్ల తరబడి పోలీస్‌స్టేషన్ల ప్రాంగణాల్లో ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ తుప్పు పట్టి పాడైపోతున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయగిరి, వరికుంటపాడు పోలీస్ స్టేషన్ల ప్రాంగణాల్లో ఏళ్ల తరబడి ఆటోలు, మోటారుబైకులు పడిఉన్నాయి. కాగా, వాహనాలు తీసుకెళ్లేందుకు అనుమతులు లభించకపోవడంతో పాటు ఆర్థిక భారం భరించలేక కొంతమంది వాటిని అలాగే వదిలేశారు. అలాగే వాహనాల కోసం అక్కడికి వెళ్లిన కొందరు యజమానులు లక్షల రూపాయల విలువచేసే తమ వాహనాలు పాడైపోతుండడాన్ని చూసి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని వాహనాల్లో విలువైన సామగ్రి కనిపించకపోగా, ఉన్నవి కూడా తుప్పుపట్టి ఎందుకూ పనికి రాకుండా పోయాయని వాపోతున్నారు. ఆరుబయట పడేయడంతోనే ఇలాంటి పరిస్థితి చోటుచేసుకుందని అసహనం వ్యక్తం చేస్తున్నారు. కాగా, కాలంచెల్లి వాహనాలు నాశన మవడం కంటే ముందుగానే వేలం నిర్వహించి ప్రభుత్వానికి కొంతమేర ఆదాయం సమకూరేలా చర్యలు చేపట్టాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు.

న్యూస్ బాక్స్

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


పూర్వ విద్యార్థుల సమ్మేళనం

సీతారామపురం, మే 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం 1993-1998 సంవత్సర పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఆరు నుంచి పదో తరగతి వరకు చదివిన విద్యార్థులు 27 ఏళ్ల తర్వాత కలుసుకుని చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. కేక్ కట్ చేశారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా తమకు పాఠాలు చెప్పిన గురువులను శాలువా, మొమెంటోలతో ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో నాటి ఉపాధ్యాయులు షఫీఅహ్మద్, శ్యాంబాబు, సుధాకర్, వీసీ అల్లూరిరాజు, జనార్దన్‌రాజు, వెంకటరెడ్డి, కృష్ణయ్య, మహబూబ్ మస్తాన్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం

చేజర్ల, మే 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పుకంబంపాడు గ్రామానికి చెందిన పరుచూరి ఇందుప్రియ అనే విద్యార్థినికి సోమవారం జిల్లా జైగౌడ్ సంఘం ఆధ్వర్యంలో పదివేల రూపాయలు అందజేశారు. బాగా చదివి ఉన్నత స్థానానికి చేరుకోవాలని, తమ వంతు సహకారం అందజేస్తామని సంఘం నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా జైగౌడ్ సంఘం అధ్యక్షుడు మన్నెం సుబ్రమణ్యం గౌడ్, రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఉదయగిరి నరసింహులు గౌడ్, అన్నాబత్తిన కృష్ణ, కిషోర్, గోపికృష్ణ పాల్గొన్నారు.

రైతులు భూ సమస్యలు పరిష్కరించుకోవాలి

కలువాయి, మే 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతుల భూ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 29వ తేదీన తహసీల్దారు కార్యాలయ ప్రాంగణంలో ప్రత్యేక ప్రజా విజ్ఞప్తుల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు శ్యామ్‌సుందర్‌రాజు తెలిపారు. ఆత్మకూరు ఆర్డీవో పావని అధ్యక్షతన జరుగు ఈ కార్యక్రమంలో రైతులు తమ భూ సమస్యల పరిష్కారానికి దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

నేడు యోగాపై శిక్షణ

ఏఎస్ పేట, మే 26 (ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మంగళవారం యోగాపై శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ప్రసాద్ తెలిపారు. మండల స్థాయి అధికారులకు, సచివాలయ సిబ్బందికి, పంచాయతీ కార్యదర్శులకు, వీఆర్‌వోలకు, ఎంపీడీవో కార్యాలయంలో, వివోఎలు, సిసిలు, ఎపిఎం, ఉపాధి హామీ సిబ్బందికి వెలుగు కార్యాలయంలో, అంగన్‌వాడీ వర్కర్లకు, సూపర్‌వైజర్‌లకు ఎంఈవో కార్యాలయంలో శిక్షణ తరగతులను నిర్వహిస్తామని తెలిపారు. ఉదయం 11 గంటలకు అందరూ హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమాన్ని తహసీల్దార్, ఎంపీడీవో పర్యవేక్షిస్తారని తెలిపారు.

మేకపాటి పరామర్శ

ఉదయగిరి, మే 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దిలావర్‌భాయ్ వీధికి చెందిన దాదాభాయ్ అనారోగ్యంతో బాధపడుతుండడంతో సోమవారం మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ షేక్ ముర్తుజాహుస్సేన్, నాయకులు మాబాషా, తాహెర్, సమద్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె ఏర్పాటు చేయండి


కంచెలేని ట్రాన్స్‌ఫార్మరు

వింజమూరు, మే 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మెయిన్‌రోడ్డులో జడ్పీ హైస్కూల్ సెంటర్‌లో ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచెను ఏర్పాటు చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. స్కూలు, హాస్టల్, బ్యాంకులు కలిగిన ప్రధాన కేంద్రం అయినందున నిత్యం జనసంచారంతో రద్దీగా ఉంటుందని, ఏదైనా ప్రమాదం సంభవించవచ్చని, గతంలో కూడా హైస్కూల్ ప్రహరీ కడుతున్న తాపీమేస్త్రీకి ఈ ట్రాన్స్‌ఫార్మర్ వలన ప్రమాదం జరిగిందన్నారు. ఇలాగే వదిలేస్తే ప్రమాదం సంభవించే అవకాశం ఉంటుందని, సంబంధిత అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

టీడీపీ మండల కమిటీల ఎంపిక

ఆత్మకూరు, మే 26 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ మండల నూతన కమిటీల ఎంపిక ప్రక్రియను పూర్తిచేసి రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సోమవారం విడుదల చేశారు. పార్టీని బలోపేతం చేసే దిశగా యువతకు ప్రాధాన్యం కల్పించారు.

ఆత్మకూరు మున్సిపాల్టీ టీడీపీ అధ్యక్షుడిగా తుమ్మల

ఆత్మకూరు మున్సిపాల్టీ టీడీపీ అధ్యక్షుడిగా తుమ్మల చంద్రారెడ్డిని నియమించారు. ఉపాధ్యక్షురాలిగా చెరుకూరు పద్మావతమ్మ, ప్రధాన కార్యదర్శిగా తోడేటి వెంకటయ్య, కార్యనిర్వాహక కార్యదర్శులుగా ఉసురుపాటి బాలకొండయ్య, డక్కా రమణమ్మ, ఏడేం ప్రసాద్‌రెడ్డి, కార్యదర్శులుగా పెట్టే అనిల్‌కుమార్, చిల్లారు సుప్రజ, షెూరీ షబ్బీర్‌బాష, కోశాధికారిగా మెంటా శ్రీనివాసులు నియమితులయ్యారు.

ఆత్మకూరు మండల టీడీపీ అధ్యక్షుడిగా సుంకర

ఆత్మకూరు మండల పార్టీ అధ్యక్షుడిగా సుంకర పెంచలచౌదరిని నియమించారు. ఉపాధ్యక్షుడిగా పేర్నాటి మాల్యాద్రి, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ తూమాటి శశిధర్‌రెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శులుగా దామినేని పెంచలనరసింహులు, ఉలవ ఖాజావలి, రామిరెడ్డి మోహన్‌రెడ్డి, కార్యదర్శులుగా మెంటం విష్ణువర్ధన్‌రెడ్డి, షేక్ హజరత్‌బాబు, దేవరపాటి శ్రీను, కోశాధికారిగా మహ్మద్ హనీఫ్‌ను నియమించారు.

సంగం మండల టీడీపీ అధ్యక్షుడిగా బాణా

సంగం మండల పార్టీ అధ్యక్షుడుగా బాణా శ్రీనివాసులురెడ్డిని నియమించారు. ఉపాధ్యక్షులుగా కొల్లు రాధ, ప్రధాన కార్యదర్శిగా మాగం గిరి, కార్యనిర్వాహక కార్యదర్శులుగా డేగా వెంగల్‌రెడ్డి, ఆత్మకూరు ప్రభావతి, గువ్వాడ వేణుబాబు, కార్యదర్శులుగా కాకు లక్ష్మీప్రసన్న, గంగిశెట్టి సత్యనారాయణ, కారంబాక మమత, ముత్యాల మోహన్‌రావు, కోశాధికారిగా ముత్యాల మోహన్‌రావును నియమించారు.

ఏఎస్‌పేట మండల టీడీపీ అధ్యక్షుడిగా అబ్బూరి

ఏఎస్‌పేట మండల పార్టీ అధ్యక్షుడిగా అబ్బూరి రమేష్‌నాయుడును నియమించారు. ఉపాధ్యక్షుడిగా పులిమి సుధాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా షేక్ ఖాదర్‌బాష, కార్యనిర్వాహక కార్యదర్శులుగా షేక్ రహమత్‌నవాజ్, దుర్గంపాటి పద్మ, ఎన్ ప్రసాద్, కార్యదర్శులుగా గంగపట్ల చిన్నమ్మ, కొత్తపల్లి వెంకటేశ్వర్లు, పందిళ్ల సుజాత, కోశాధికారిగా అల్లంపాటి మాధవ్‌రెడ్డి నియమితులయ్యారు.

అనంతసాగరం మండల టీడీపీ అధ్యక్షుడిగా మెట్టకూరు

అనంతసాగరం మండల పార్టీ అధ్యక్షుడిగా మెట్టకూరు కృష్ణారెడ్డిని నియమించారు. ఉపాధ్యక్షుడిగా ఉప్పల విజయకుమార్, ప్రధాన కార్యదర్శిగా శాఖమూరి సుబ్బారావు, కార్యనిర్వాహక కార్యదర్శులుగా షేక్ ఖాసీంబాషా, రాపూరు జనార్ధన్‌రెడ్డి, పెరుమాళ్ల రమణమ్మ, కార్యదర్శులుగా కలువాయి వెంకటేశ్వర్లురెడ్డి, వేణుతుర్ల ప్రసన్న, కత్తి సునీత, కోశాధికారిగా కాసా వెంకటసుబ్బారెడ్డి ఎంపికయ్యారు.

చేజర్ల మండల టీడీపీ అధ్యక్షుడిగా షేక్ సిరాజుద్దీన్

చేజర్ల మండల పార్టీ అధ్యక్షుడుగా షేక్ సిరాజుద్దీన్‌ను నియమించారు. ఉపాధ్యక్షుడిగా కొండా సుధాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా తలపనేని జయంతులనాయుడు, కార్యనిర్వాహక కార్యదర్శులుగా టి వెంకటేశ్వర్లు, బిల్లుపాటి వెంకటేశ్వర్లు, పఠాన్ షాన్‌వాజ్, కార్యదర్శులుగా కొమరిగిరి లక్ష్మయ్య, అట్టా పెంచలరెడ్డి, అమ్మినేని వెంకటేశ్వర్లు, కోశాధికారిగా గుత్తా శ్రీధర్‌ను ఎంపికచేశారు.

మర్రిపాడు మండల టీడీపీ అధ్యక్షుడిగా దేవరాల

మర్రిపాడు మండల పార్టీ అధ్యక్షుడిగా దేవరాల గంగాధర్‌ను నియమించారు. ఉపాధ్యక్షుడిగా శేషం హజరత్‌బాబు, ప్రధాన కార్యదర్శిగా భూమిరెడ్డి వెంకటనారాయణ, కార్యనిర్వాహక కార్యదర్శులుగా పడచల శ్రీనివాసులు, తమటం ఈశ్వర్‌రెడ్డి, గోవిందు వెంకటరమణారెడ్డి, కార్యదర్శులుగా యడ్లవల్లి రుక్మిణమ్మ, చేజర్ల రామయ్య, షేక్ మహబూబ్‌బాష, కోశాధికారిగా గంగినేని అచ్చయ్య నియమితులయ్యారు.

పలువురు వైసీపీ నేతలు టీడీపీలో చేరిక


కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

వింజమూరు, మే 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలో వైసీపీకి ఎదురుదెబ్బ తగిలింది. బుక్కాపురం గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ కాటం రమణారెడ్డి ఆయన అనుచర వర్గం టీడీపీ ప్రధాన పార్టీ కార్యాలయంలో ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. కాటంరెడ్డి రమణారెడ్డి అనుచర వర్గాన్ని ఎమ్మెల్యే టీడీపీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చల్లా వెంకటేశ్వర్లుయాదవ్, సీనియర్ నాయకులు వనిపెంట సుబ్బారెడ్డి, ఉపాధ్యక్షులు ఆనంగి రమణయ్య, పాములపాటి మాల్యాద్రి, దాట్ల రమేష్‌రెడ్డి, దాట్ల కృష్ణారెడ్డి, దొరస్వామి నాయుడు, రాయుడు, చిలకల వెంకటరెడ్డి, ఎక్కులూరి వెంకటయ్య, తదితరులు ఉన్నారు.

మహానాడును జయప్రదం చేయాలి : చింతల


మండల టీడీపీ నాయకులతో మాట్లాడుతున్న మండల కోఆర్డినేటర్ చింతల శ్రీనివాసులు

సీతారామపురం, మే 26 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లాలో ఈనెల 27,28,29 తేదీలలో జరిగే తెలుగుదేశం పార్టీ మహానాడు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మండల కోఆర్డినేటర్ చింతల శ్రీనివాసులు కోరారు. సోమవారం స్థానిక టీడీపీ ప్రధాన కార్యాలయంలో మండల నాయకులు, కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా చింతల మాట్లాడుతూ మండలం నుంచి ఏగ్రామం నుంచి ఎంతమంది వస్తున్నారు.. ఎవరెవరు వస్తున్నారో జాబితా తయారుచేసుకుని, ఆ జాబితాను గ్రామ అధ్యక్షుడికి అందజేయాలన్నారు. 29వ తేదీన జరుగు భారీ బహిరంగ సభకు మండల టీడీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. 27వ తేదీ 9 గంటలకు మండలంలోని ముఖ్య నాయకులు పార్టీ ప్రధాన కార్యాలయం నుంచి బయలుదేరుతున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో మండల క్లస్టర్ ఇన్ చార్జి వెంగళశెట్టి వెంకటేశ్వర్లు, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి జాషువా, మండల ప్రధాన కార్యదర్శి పిడుగు రమేష్, జయరాములు, వికాష్‌బాబు, ఇజ్రాయిల్, గౌస్, కిరణ్, పాల్గొన్నారు.

యోగాంధ్ర రిజిస్ట్రేషన్ సర్వే త్వరగా పూర్తిచేయాలి


సర్వేపై అవగాహన కల్పిస్తున్న డిజిటల్ అసిస్టెంట్

సీతారామపురం, మే 26 (ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర రిజిస్ట్రేషన్ సర్వే త్వరగా పూర్తిచేయాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో భాస్కర్ పేర్కొన్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో భాస్కర్ అధ్యక్షతన సోమవారం 9 సచివాలయాల సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఎంపీడీవో భార్గవి మాట్లాడుతూ యోగాంధ్ర రిజిస్ట్రేషన్ సర్వే, సిటిజన్ ఈకేవైసి సర్వేలను త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు రాంనాధరెడ్డి, పిడుగు రవీంద్ర, జీవన్ , షఫీ, రమేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్త సేకరించాలి


రిక్షాలను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో షేక్ నయీంహసన్ తాజ్

సీతారామపురం, మే 26 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లి తడి, పొడి చెత్త సేకరించాలని ఆత్మకూరు డివిజినల్ పంచాయతీ అధికారి షేక్ నయీం హసన్‌తాజ్ గ్రీన్ అంబాసిడర్‌లకు సూచించారు. సోమవారం మండల కేంద్రమైన సీతారామపురం, గుండుపల్లి గ్రామ పంచాయతీలను ఆయన తనిఖీచేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం పంచాయతీలోని చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలకు ప్లాస్టిక్ వాడకం వల్ల కలుగు నష్టాలను వివ రించి ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని, గ్రామంలో సేకరించిన తడి, పొడి చెత్తను వేరుచేసి వర్మీకంపోస్ట్ తయారుచేయాలని సూచించారు. గ్రామంలోని దుకాణదారులు చెత్తను బయట వేయకుండా చెత్తబుట్టలో వేసి పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బందికి అందించేలా అవగాహన కల్పించాలని కార్యదర్శికి సూచించారు. గుండుపల్లి గ్రామంలో చెత్త సేకరణ ఎలా జరుగుతోందని ఇళ్లకు వెళ్లి పలువురి అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడివో భార్గవి, మండల పంచాయతీ కార్యదర్శులు రాంనాథరెడ్డి, పఠాన్ షఫీ, పారిశుధ్య కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో నిత్యావసర సరుకులు అందించాలి


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దారు సుభద్ర

ఉదయగిరి, మే 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌకదుకాణ డీలర్లు బాధ్యతగా పనిచేసి కార్డుదారులకు సకాలంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని తహసీల్దారు సుభద్ర సూచించారు. సోమవారం స్థానిక కార్యాలయంలో మండలంలోని చౌకదుకాణ డీలర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సకాలంలో డీడీలు చెల్లించి కార్డుదారులకు 15 రోజుల పాటు సరుకులు పంపిణీ చేయాలన్నారు. ప్రభుత్వం ఎండీయూ వాహనాలను రద్దుచేసినందున డీలర్లు జాగ్రత్త వహిస్తూ సరుకుల పంపిణీలో అవకతవకలకు పాల్పడకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు షాజియా, డీలర్లు పాల్గొన్నారు.

ఈకేవైసీ తప్పనిసరి

ఉదయగిరి, మే 26 (ఆంధ్రజ్యోతి): మండలంలో హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ కోసం ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని ఎంపీడీవో అప్పాజీ పేర్కొన్నారు. సోమవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ సంబంధిత సచివాలయాలను సంప్రదించి ఈకేవైసీ పూర్తి చేయించుకోవాలని, లేకపోతే భవిష్యత్తులో ఎలాంటి ధ్రువపత్రాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందలేరన్నారు. ఈకేవైసీ ప్రక్రియ ముగియకముందే చేయించుకోవాలన్నారు.

విస్తరణకు నోచుకోని బస్టాండ్ సెంటర్

● రోడ్డుకిరువైపులా ఆక్రమణలు
● వాహన చోదకుల అవస్థలు


విస్తరణకు నోచుకోని అనంతసాగరం బస్టాండ్ సెంటర్

అనంతసాగరం, మే 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం, మేజర్ పంచాయతీ అనంతసాగరం బస్టాండ్ సెంటర్ విస్తరణకు నోచుకోక వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో జిల్లావ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో రోడ్డు విస్తరణ పనులు జరిగినా సాగరం వైపు అధికారులు కన్నెత్తి కూడా చూడలేదు. సిమెంటు రోడ్డు మధ్యలో డివైడర్ ఏర్పాటుచేసి రోడ్డుకు ఇరువైపులా అక్రమ నిర్మాణాలు తొలగిస్తే సమస్య ఉండదని మండల ప్రజలు భావిస్తున్నారు. బస్టాండ్ లోని అడ్డంకులు తొలగించి విస్తరణ పనులు చేసేలా గతంలో మార్కింగ్ వేశారు. కానీ రాజకీయ వత్తిడితో పనులు ఆగిపోయాయి. ఆతర్వాత విస్తరణ ఊసేలేదు. రోజురోజుకు సాగరంలో ట్రాఫిక్ సమస్య జఠిలంగా మారుతోంది. పాఠశాలలు తెరిస్తే వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతాయి. పార్కింగ్‌కు స్థలంలేక రోడ్డుపై ఆటోలు, ఇతర వాహనాలు నిలుపుతుండడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. అంతేగాక ఒక వైపు కాలువపైకి ఆక్రమణలు విస్తరించి ఉన్నాయి. మరో వైపు రోడ్డు అంచువరకు నిర్మాణాలు చేపట్టారు. దీంతో బస్టాండ్ సెంటర్ కుచించుకుపోతోంది. ఆత్మకూరు-సోమశిల ప్రధాన రహదారి కలిగిన అనంతసాగరం బస్టాండ్ విస్తరణపై ఇకనైన ఆర్‌అండ్‌బీ అధికారులు దృష్టి సారించి తగు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

C.R.I.M.E N.E.W.S

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

నెల్లూరు(రూరల్, మే 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సౌత్ మోపూరులో సోమవారం పేకాట రాయుళ్లను అరెస్ట్ చేసినట్లు సీఐ గుంజి వేణు తెలిపారు. గ్రామంలోని పొలాల్లో పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు ఆకస్మిక దాడి చేసి అదుపులోకి తీసుకున్నామన్నారు. ఆరుగురు జూదరుల నుంచి రూ. 17 వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. వీరిపై కేసు నమోదు చేస్తున్నట్లు తెలిపారు.

ఆటో ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

ఉదయగిరి, మే 26 (ఆంధ్రజ్యోతి): ఆటో ఢీకొని ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డ సంఘటన స్థానిక బస్టాండ్ సెంటర్‌లో సోమవారం చోటుచేసుకొంది. వివరాల మేరకు.. మండలంలోని వీరారెడ్డిపల్లికి చెందిన వీరారెడ్డి పని నిమిత్తం ఉదయగిరికి వచ్చి పంచాయతీ బస్టాండ్‌లో నిలబడి ఉండగా దుర్గంపల్లెకు చెందిన ఓ ఆటోడ్రైవర్ వేగంగా వచ్చి వీరారెడ్డిని ఢీకొట్టాడు. దీంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి చేరుకుని ఆటోను, డ్రైవర్‌ను స్టేషన్‌కు తరలించారు. గాయపడ్డ వీరారెడ్డిని చికిత్స నిమిత్తం వైద్యశాలకు తరలించారు.

చికెన్ వ్యర్థాలు తరలిస్తున్న వాహనం పట్టివేత

సంగం, మే 26 (ఆంధ్రజ్యోతి): చికెన్ వ్యర్థాలు తరలిస్తున్న వాహనాన్ని మండల పరిధిలోని ముంబాయి జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారుజామున పోలీసులు పట్టుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. బెంగళూరు నుంచి ఓ లారీలో సుమారు 80 డ్రమ్ముల చికెన్ వ్యర్థాలను చేపల చెరువులకు మేతగా తరలిస్తుండగా గస్తీలో ఉన్న పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం మత్స్య, రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో పంచనామా నిర్వహించి సంగం పంపింగ్ స్కీమ్ పక్కన పోరంబోకు భూముల్లో గుంతలు తీసి పూడ్చివేశారు. లారీని స్వాధీనం చేసుకుని డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

వెంకటాచలం, మే 26 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడిన సంఘటన మండలంలోని పొలిచెర్లపాడు సమీపంలో సోమవారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. పొదలకూరు పట్టణానికి చెందిన వెంకటేశ్వర్లు తన ఆటోలో మరో ఇద్దరితో కలిసి పని నిమిత్తం కసుమూరుకు వచ్చి తిరిగి వెళ్తుండగా పొలిచెర్లపాడు దాటిన తర్వాత కల్వర్టు వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను తప్పించే క్రమంలో ఆటో కల్వర్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న ముగ్గురు స్వల్పంగా గాయపడ్డారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అదుపుతప్పి బోల్తా పడిన బైక్

● విద్యుత్ శాఖ ఏఈకి తీవ్రగాయాలు

పొదలకూరు, మే 26 (ఆంధ్రజ్యోతి): పొదలకూరు సమీపంలోని చిట్టేపల్లి తిప్ప వద్ద సోమవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో పొదలకూరు విద్యుత్ శాఖ ఏఈ శ్రీకాంత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. విధి నిర్వహణలో భాగంగా పొదలకూరు నుంచి చేజర్లకు మోటారుబైక్‌పై వెళుతుండగా చిట్టేపల్లి తిప్ప వద్ద బైక్ అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శ్రీకాంత్‌కు పొదలకూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రాథమిక చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తల్లి, కుమార్తె అదృశ్యంపై కేసు నమోదు

నెల్లూరు(క్రైం), మే 26 (ఆంధ్రజ్యోతి) : తల్లి, కుమార్తె అదృశ్యంపై నగరంలోని సంతపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు వివరాలు.నగరంలోని ఆచారివీధిలో కిశోర్ కుమార్ నివాసం ఉంటున్నారు. ఆయనకు భార్య, కుమార్తె(7) ఉన్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలో భార్య అప్పుడప్పుడు హుబ్లీలోని పుట్టింటికి వెళ్లి కొద్ది రోజులు ఉండివచ్చేది. ఈనెల 23న కిశోర్ కుమార్ పనికి వెళ్లారు. ఈ క్రమంలో భర్తకు ఫోన్‌చేసి నెల్లూరు రైల్వే స్టేషన్‌లో ఉన్నానని, కుమార్తెను తీసుకుని పుట్టింటికి వెళుతున్నానని చెప్పి, ఫోన్ పెట్టేసింది. దీంతో భర్త, బంధువులు రైల్వేస్టేషన్‌కు వెళ్లి చూడగా తల్లి, కుమార్తె కనిపించలేదు. హుబ్లీకి ఫోన్‌చేయగా అక్కడకు రాలేదని చెప్పారు. ఈ మేరకు కిషోర్‌కుమార్ సోమవారం సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రయాణికుడిపై ట్రావెల్స్ బస్ క్లీనర్ దాడి


గాయపడ్డ రమేష్‌తో భార్యాపిల్లలు

కావలి రూరల్, మే 26(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుడిపై వినాయక ట్రావెల్స్ బస్ క్లీనర్ గణేష్ దాడి చేసిన ఘటన కావలి ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఆదివారం అర్ధరాత్రి జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. బాపట్ల నుంచి బెంగళూరుకు వెళుతున్న వినాయక ట్రావెల్స్ బస్‌లో బెంగళూరు వెళ్లేందుకు జలదంకి మండలం ఆదిరెడ్డిపాలెంకు చెందిన నేలపాటి రమేష్, భార్య, పిల్లలతో ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతంలో ట్రావెల్ ఏజెన్సీ వద్దకు వచ్చారు. కావలి చేరుకున్న బస్‌లో రమేష్ లగేజీ పెట్టె విషయంలో బస్ సిబ్బంది దురుసుగా ప్రవర్తించటంతో వారి మధ్య వాగ్వివాదం జరిగింది. దీంతో బస్ క్లీనర్ గణేష్ ప్రయాణికుడు రమేష్‌పై దాడి చేశాడు. రమేష్ తలకు గాయాలు కావటంతో క్లీనర్ అక్కడ నుంచి పరారయ్యాడు. రమేష్ భార్య పిల్లలతో బస్ దగ్గర ఆందోళన చేయడంతో బస్సు నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని బస్సును పంపించి గాయపడిన రమేష్‌ను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. పరారైన బస్ క్లీనర్ గణేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. రెండవ పట్టణ ఎస్‌ఐ గౌస్‌బాషా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంగిరెడ్డిపాలెంలో బెల్టుషాపుల వివాదం

కలిగిరి, మే 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగిరెడ్డిపాలెంలో బెల్టుషాపుల నిర్వాహకుల మధ్య సోమవారం రాత్రి వివాదం జరిగింది. గ్రామంలో ఒక వ్యక్తి బెల్టుషాపు నిర్వహిస్తూ మద్యం విక్రయాలు సాగిస్తున్నాడని పలువురు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్‌ఐ ఉమాశంకర్ తన సిబ్బందిని గ్రామంలోకి పంపారు. ఆ వ్యక్తి వద్దకు పోలీసులు వెళ్లగా తానే కాదు గ్రామంలో మరి కొంతమంది కూడా బెల్టుషాపులు నిర్వహిస్తున్నారని, తన వద్దకే ఎందుకు వచ్చారని పోలీసులను ప్రశ్నించాడు. ఈ వివాదం సద్దుమణగక పోవడంతో ఎస్‌ఐ గ్రామానికి చేరుకొని బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పానీపూరి బండిని ఢీకొన్న వ్యాను

● చిరువ్యాపారికి తీవ్రగాయాలు

కావలి రూరల్, మే26(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణం ముసునూరు ఆటోస్టాండ్ వద్ద సోమవారం రాత్రి పానీపూరీ బండిని బొలెరో వ్యాను ఢీ కొంది. బాధితుని, బంధువుల వివరాల మేరకు... ఉత్తరప్రదేశ్‌కు చెందిన షెహజాద్ ఐదేళ్లుగా ముసునూరులో పానీపూరి బండి నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం రాత్రి వ్యాపారం అనంతరం బండి నెట్టుకుని ఇంటికి వెళ్తుండగా బొలెరో వ్యాను ఢీకొంది. దీంతో బండి ధ్వంసంకాగా షెహజాద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మద్యం మత్తులో ఉన్న వ్యాను డ్రైవర్‌ను స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. బాధితుడిని కావలి ఏరియా వైద్యశాలకు తరలించి మెరుగైన చికిత్స కోసం 108 వాహనంలో నెల్లూరుకు తరలించారు. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	130
స్కిన్ చికెన్	234
స్కిన్‌లెస్	260

కోడిగుడ్ల ధర (100): 510



అట్టహాసంగా యోగా డే సన్నాహక శిబిరం

కందుకూరు, మే 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం జూన్ 21న ప్రతిష్ఠాత్మకంగా యోగా డే నిర్వహించనున్న సందర్భంగా సోమవారం కందుకూరు పట్టణంలో యోగా సన్నాహక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ కె.అనూష ఆధ్వర్యంలో పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహం సెంటర్‌లో మాస్టర్ ట్రైనర్స్‌చే యోగా శిక్షణ శిబిరం నిర్వహించారు. ఔత్సాహికులు, యోగా శిక్షకులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. అందరూ యోగా ప్రాక్టీస్ చేయించారు. కార్యక్రమంలో సీఐ కే.వెంకటేశ్వరరావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అత్యవసర వైద్యం దైవాదీనం!

- వలేటివారిపాలెం పీహెచ్‌సీలో అందని సేవలు
- సాయంత్రం 4గంటల తరువాత నాడి పట్టేనాథుడు కరువు
- అర్ధరాత్రి వెళ్తే కందుకూరుకు సిఫార్సు
- మార్గమధ్యంలో కోల్పోతున్న ప్రాణాలు
- పేరుకే 24 గంటల ఆసుపత్రి
- ఆందోళనలో మండల ప్రజలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



వలేటివారిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

వలేటివారిపాలెం, మే 26(ఆంధ్రజ్యోతి) : అది 24 గంటలు పని చేయాల్సిన ఆసుపత్రి. అక్కడ పూర్తిస్థాయిలో వైద్యులు, సిబ్బంది ఉన్నారు. అయినా అక్కడ అత్యవసర వైద్యం దైవాదీనంగా మారింది. సాయంత్రం 4 గంటలు దాటితే నాడి పట్టేవారే కరువయ్యారు. అర్ధరాత్రి సమయంలో అనారోగ్యంతో వైద్యం కోసం ఆసుపత్రికి వెళితే కనీసం ప్రాథమిక చికిత్స కూడా చేయకుండా కందుకూరు ఏరియా వైద్యశాలకు సిఫార్సు చేస్తున్నారు. దీంతో సకాలంలో వైద్యం అందక కొందరి ప్రాణాలు మార్గమధ్యంలోనే గాలిలో కలిసిపోతున్నాయి. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నా పాలకులు, అధికారులు పట్టించుకుంటున్న పాపాన పోవడం లేదు. ఇది వలేటివారిపాలెం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం దుస్థితి. ఈ పీహెచ్‌సీలో రోగులకు అత్యవసర వైద్య సేవలు అందని ద్రాక్షాలా మారాయి. ఇక్కడ పూర్తి స్థాయిలో ఇద్దరు వైద్యులు, సిబ్బంది ఉన్నారు. మందులు, పరికరాలు, భవనం వసతి తదితర సౌకర్యాలు ఉన్నాయి. అయితే అందరూ పీహెచ్‌సీకి దూరంగా పట్టణాల్లో నివాసం ఉంటుండడంతో ఇక్కడ అందుబాటులో ఉండలేకున్నారు. ఈ క్రమంలో వైద్యులు, సిబ్బంది ఉదయం 10 గంటలకు ఆసుపత్రికి వచ్చి సాయంత్రం 4 గంటలకు తిరిగి వెళ్తున్నారు. ఆ తరువాత స్టాఫ్ నర్సు మాత్రమే అందుబాటులో ఉంటుంది. ఇది 24 గంటలు ఆసుపత్రి అయినప్పటికీ సాయంత్ర 4 గంటల తరువాత ఎప్పుడు వెళ్లినా వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండడం లేదని రోగులు వాపోతున్నారు. రాత్రి వేళ్లలో ఎవరైనా గుండె పోటు, పాముకాటు, రోడ్డు ప్రమాదాలు బారినపడి ఇక్కడికి వస్తే స్టాఫ్ నర్సు మాత్రమే ఉంటుంది. ఇక్కడ వైద్యులు సిబ్బంది లేకపోవడంతో స్టాఫ్‌నర్సు కందుకూరు ఏరియా ఆసుపత్రికి సిఫార్సు చేస్తున్నారు. అదేవిధంగా వ్యయ ప్రయాసాలకోర్చి దూరప్రాంతాల నుంచి వచ్చిన గర్భిణులకు ఇక్కడ వైద్య సేవలు అందించేవారు లేక కందుకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాల్సి వస్తోంది. ఈ క్రమంలో అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారు. మండలంలోని సుమారు 20 గ్రామాల ప్రజలకు ఈ నే దిక్కు. అలాంటి పరిస్థితుల్లో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండనప్పటికీ ఉన్నతాధికారులు, పాలకులు పట్టించుకోవడంలేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండి రోగులకు అత్యవసర వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

మహిళలకు ఆర్థిక, అక్షరాస్యతపై అవగాహన

● పల్లపోతు వెంకట కృష్ణారావు, ఏపీఎం, వెలుగు



కావలి రూరల్, మే 26 (ఆంధ్రజ్యోతి): మహిళలకు వివిధ రకాల రుణాలు ఇచ్చి ఆర్థిక అభివృద్ధికి కృషి చెయ్యడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా డిజిటల్ అక్షరాస్యతపై అవగాహన కల్పిస్తున్నాం. రుణాలు ఎలా పొందాలో తెలియజేస్తున్నామని వెలుగు ఏపీఎం పల్లపోతు వెంకటకృష్ణారావు తెలిపారు.

? మండలంలో ఎన్ని పొదుపు గ్రూపులు ఉన్నాయి.

! మండలంలో చిన్న పొదుపు సంఘాలు 1452, గ్రామ సమాఖ్యలు 42 ఉన్నాయి.

? 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఎన్ని గ్రూపులకు రుణాలు ఇచ్చారు.

! 2025 మార్చి వరకు 941 పొదుపు సహాలకు సుమారు రూ.162.63 కోట్ల రుణాలు ఇచ్చాం.

? ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేకించి ఏమైనా రుణాలు ఇస్తున్నారా.

! 121 మంది ఎస్సీ, ఎస్టీ గ్రూపు సభ్యులకు రూ.69 లక్షల రుణాలు ఇచ్చాం, మొత్తం గ్రూపుల పై ఉన్న అప్పు నిల్వ రూ.77,75,198.

? బ్యాంక్ లింకేజ్ రుణాలు ఎన్ని ఇచ్చారు, పొదుపు రుణాల రికవరీ ఏవిధంగా ఉంది.

! మండలంలో గత ఆర్థిక సంవత్సరానికి 295 గ్రూపులకు రూ.29.52 కోట్లు రుణాలు ఇవ్వగా 98 శాతం బ్యాంక్ లింకేజ్ రుణాలు రికవరీ అయ్యాయి. 308 సంఘాలకు స్త్రీ నిధి గ్రూపు రుణాలు రూ.6.62 కోట్లు ఇవ్వగా జిల్లాలో 100శాతం రికవరీలు సాధించిన మండలంగా కావలి నిలిచింది.

ఎస్టీలకు ప్రత్యేక ఆధార్ క్యాంపులు


ఆధార్ శిబిరాన్ని పరిశీలిస్తున్న కమిషనరు ఉమామహేశ్వరరావు

అల్లూరు, మే 26(ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టరు మౌఖిక ఆదేశాల మేరకు అల్లూరు నగర పంచాయతీ పరిధిలో గిరిజన ప్రజలకు ప్రత్యేక ఆధార్ క్యాంపులు ప్రారంభించినట్లు నగర పంచాయతీ కమిషనరు ఉమామహేశ్వరరావు తెలిపారు. సోమవారం అల్లూరు సచివాలయం -2 నుంచి ప్రారంభమైన ఈ ప్రక్రియ 27న సచివాలయం-3, 28న సచివాలయం-4, 29న సచివాలయం-1, 30న సింగపేట సచివాలయం, 31న నార్తుమోపూరు సచివాలయాల్లో నిర్వహిస్తాన్నామని తెలిపారు. గిరిజనుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈ ఆధార్ క్యాంపుల్లో వారు ఎటువంటి జనన ధ్రువీకరణ పత్రం లేకుండానే 18 ఏళ్లలోపు బాలలకు ఆధార్ నమోదు, సవరణలు, మార్పులు, చేర్పులు చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి వరప్రసాద్ పాల్గొన్నారు.

అంకమ్మ ఆలయ వైభవాన్ని కాపాడాలి

కందుకూరు, మే 26(ఆంధ్రజ్యోతి): కందుకూరు గ్రామదేవత అంకమ్మ ఆలయం వైభవానికి నేతలు చేస్తున్న కృషికి ప్రతిఒక్కరూ తమవంతు తోడ్పాటు అందించాలని, అనవసర అపోహలు సృష్టించటం ద్వారా ఆలయ వైభవాన్ని అడ్డుకోవాలని చూడటం ఎవరికీ తగదని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ గట్టమనేని హరిబాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మాజీమంత్రి మానుగుంట మహీధరరెడ్డి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి సంకల్పించి ఆలయనిర్మాణం పూర్తిచేయించటమే గాక నేటికీ అనివేటిమండపం నిర్మాణంను తన పర్యవేక్షణలోనే పూర్తిచేయిస్తున్నారని పేర్కొన్నారు. ఆ క్రతువులో దాతలు పార్టీలకు అతీతంగా అందించిన తోడ్పాటు మరువలేనిదని పేర్కొన్నారు. అయితే ఎంతోవైభవంగా ఆలయ నిర్మాణం జరిగినా నిర్వహణకు తగినంత నిధులు లేని విషయాన్ని గుర్తించి ప్రస్తుత ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆలయ ప్రాంగణంలో షాపింగ్‌కాంప్లెక్స్ నిర్మాణంకు పూనుకోగా ఆ ప్రయత్నం కూడా విజయవంతమై ప్రతినెలా రమారమి 3లక్షలు అమ్మవారికి ఆదాయం వచ్చేందుకు మార్గం సుగమమైందని తెలిపారు. ఈ తరుణంలో కొందరు తిరుణాళ్ల నిర్వహించేందుకు శాశ్వత షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం అడ్డంకి అవుతుందని ప్రచారం చేస్తూ భక్తులలో అపోహలు సృష్టించే ప్రయత్నం చేయడం మంచిది కాదని పేర్కొన్నారు.

మంత్రి పార్థసారధికి ఎమ్మెల్యేల సన్మానం


మంత్రి పార్థసారధిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి, చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య తదితరులు

కందుకూరు, మే 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి కె.పార్థసారధిని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్యలు కలిసి సత్కరించారు. కడపలో జరుగుతున్న తెలుగుదేశం పార్టీ మహానాడు కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తూ ఆదివారం రాత్రి పొద్దుపోయాక పార్థసారధి కందుకూరు పట్టణం కనిగిరి రోడ్డులో ఉన్న చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య నివాసానికి వచ్చారు. ఆయన ఆహ్వానం మేరకు ఇంటూరి నాగేశ్వరరావు అక్కడికెళ్లి మంత్రిని కలిశారు. ఆయన వెంట దామా మల్లేశ్వరరావు, గుర్రం మాల్యాద్రి, ఎన్వీ రమణయ్య, మాదాల మాల్యాద్రి, ముప్పవరపు వేణు తదితరులున్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక


రైల్వే మిక్సర్ తెలుగు మీడియం ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

బిట్రగుంట, మే 26 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం ఇబ్రహీంపేటలోని రైల్వే మిక్సర్ తెలుగు మీడియం ఉన్నత పాఠశాల పూర్వపు విద్యార్థుల(1999-2000) కలయిక సోమవారం జరిగింది. వివిధ ప్రాంతాల్లో ఉంటున్న విద్యార్థులు 25 ఏళ్ల సందర్భంగా సిల్వర్ జూబ్లీ వేడుకలు జరుపుకున్నారు. అనంతరం తమకు విద్యాబోధలు చేసిన ఉపాధ్యాయులను నెల్లూరులోని ఓ ఫంక్షన్ హాల్‌కు చేర్చి శాలువలు, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సన్మాన గ్రహీతలు బాబురెడ్డి, దేవదాసు, ప్రసాద్, ఝాన్సీ మల్లేశ్వరి, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

31న విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

● ఎమ్మెల్యేను ఆహ్వానించిన నూర్‌బాషా సంఘం ప్రతినిధులు


కావలి ఎమ్మెల్యేకు ఆహ్వానపత్రిక అందజేసిన నూరుబాషా సంఘం ప్రతినిధులు

కావలి, మే 26(ఆంధ్రజ్యోతి): టెన్త్, ఇంటర్‌లో ప్రతిభ చాటిన నూర్‌బాషా విద్యార్థులకు నెల్లూరు టౌన్ హాల్‌లో ఈనెల 31న ప్రతిభా ప్రోత్సాహక బహుమతులు అందజేయనున్నారు. ఈ కార్యక్రమానికి హాజరుకావాలని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డిని నూర్‌బాషా సంఘం ప్రతినిధులు ఆహ్వానించారు. ఈ మేరకు సోమవారం కావలిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే కలిసి ఆహ్వానపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో రాష్ట్రనాయకులు, ప్రజాప్రతినిధులు హాజరవుతున్నందున డివిజన్‌లోని నూరుబాషా సోదరీ సోదరీమణులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో నూరుబాషా సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్ సలీమ్, గౌరవాధ్యక్షుడు షేక్ మహబూబ్‌బాషా, ప్రదాన కార్యదర్శి మీరా సాహెబ్, కావలి మండల అధ్యక్షుడు షేక్ ఖలీల్, స్థానిక నేతలు షానవాజ్, గౌస్‌బాషా, షేక్ మస్తాన్, షేక్ హజరత్, షేక్ కాజావలి పాల్గొన్నారు.

మాకు న్యాయం చేయండి

● ఆర్డీవో కార్యాలయ ప్రాంగణంలో రోడ్డుపై బైఠాయించిన రైతు కుటుంబం


ఆర్డీవో కార్యాలయం వద్ద రోడ్డుపై బైఠాయించిన రైతు కుటుంబం

కావలి, మే 26(ఆంధ్రజ్యోతి): పూర్వీకుల నుంచి తమకు వారసత్వంగా వస్తున్న పొలాలకు హక్కు కల్పించకుండా రెవెన్యూ అధికారులు ఇబ్బందులు పెడుతున్నారంటూ బోగోలు మండలం తెల్లగుంట పంచాయతీ అల్లిమడుగుకు చెందిన ఓ రైతు కుటుంబం ఆవేదన వ్యక్తం చేసింది. ఆ గ్రామానికి చెందిన గడ్డం తిరిపయ్య, ఆయన కుమారుడు వంశీ, కుటుంబ సభ్యులలోని చిన్న పిల్లలతో సహా కుటుంబం అంతా సోమవారం కావలి ఆర్డీవో కార్యాలయానికి వచ్చారు. ప్రజాసమస్యల పరిష్కార వేదికలో తమ సమస్య చెప్పుకోవడానికి అక్కడ ఆర్డీవో అందుబాటులో లేకపోవటంతో వారు న్యాయం కావాలంటూ అక్కడే రోడ్డుపై బైఠాయించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు రోడ్డుపై బైఠాయించినా వారి మొర ఆలకించేవారు కనిపించలేదు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మా గ్రామంలో ఉన్న 4 ఎకరాల భూమి తమ తాతల కాలం నుంచి తాము చేసుకుంటున్నామని, దానిని కావలికి చెందిన ఒక వ్యక్తి తమదని చెప్పి ఇబ్బందులు పెడుతున్నారన్నారు. దీనిపై రెవెన్యూ అధికారుల చుట్టూ పలు పర్యాయాలు తిరిగినా న్యాయం చేయకుండా ఇబ్బంది పెడుతున్నందున ఆర్డీవో వద్ద అయినా న్యాయం జరుగుతోందని వచ్చి నిరసన తెలిపామని ఆవేదన చెందారు.

మహానాడుకు తరలిరండి

కొండాపురం, మే 26(ఆంధ్రజ్యోతి): కడపలో జరగనున్న తెలుగుదేశం పార్టీ మహానాడుకు మండలం నుంచి అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి జయప్రదం చేయాలని మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు పోలినేని చంద్రబాబునాయుడు కోరారు. ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆదేశాల మేరకు మండల పరిధిలోని 19 పంచాయతీలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 19 పంచాయతీల నుంచి కడపకు వెళతామన్నారు.

అన్నవరంలో లో ఓల్టేజీ సమస్య

● 10 రోజులుగా విద్యుత్ సమస్యతో అల్లాడుతున్న ఎస్సీ కాలనీ ప్రజలు

● ట్రాన్స్‌కో సిబ్బందికి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆవేదన


అన్నవరం ఎస్సీకాలనీలో విద్యుత్ స్తంభం పక్కనే పడేసి ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

జలదంకి, మే 26(ఆంధ్రజ్యోతి): ఓ ప్రధాన గ్రామంలో అయితే మీరిలానే స్పందిస్తారా... పది రోజులకు పైగా లోటోల్టేజీతో లైట్లు గుడ్డిగా వెలుగుతుండగా... ఫ్యాన్లు అసలు తిరగడం లేదు. ట్రాన్స్‌కో సిబ్బందికి పలు దఫాలు ఫిర్యాదు చేస్తే వారిలో స్పందన లేకుండా పోయింది అని జలదంకి మండలం అన్నవరం ఎస్సీకాలనీ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ కాలనీలో 200పైగా కుటుంబాల వారు నివసిస్తుండగా రెండు సింగిల్‌ఫేజ్ ట్రాన్స్‌పార్మర్లు ఉండగా అవి 10రోజుల క్రితం మరమ్మతులకు గురయ్యాయి. వాటి స్థానంలో కొత్తవి నేటికీ ట్రాన్స్‌కో సిబ్బంది ఏర్పాటు చేయలేదు. ట్రాన్స్‌పార్మర్లు మరమ్మతులకు గురవడంతో స్థానిక కరెంటు మెకానిక్‌ల సాయంతో కాలనీ పక్కనే గత ప్రభుత్వంలో జగనన్న లేఔట్‌లో ఏర్పాటు చేసి ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లకు వైర్లు తగిలించి కాలనీకి విద్యుత్‌సరఫరా చేసుకున్నారు. నేటికీ అక్కడ నుంచి కాలనీకి కరెంటు సరఫరా అవుతోంది. జగనన్న లేఔట్ నుంచి సరఫరా అయ్యే విద్యుత్ 200కుటుంబాల వారికి సరిపడా విద్యుత్ రాక లోఓల్టేజీతో గుడ్డిగా లైట్లు వెలుగుతుండగా ఫ్యాన్లు అసలు తిరగడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఈ విషయమై స్థానిక విద్యుత్ లైన్‌మెన్‌కు, జలదంకి ఏఈ కార్యాలయాల్లో స్థానికులు ఫిర్యాదు చేసి మరమ్మతులకు గురైన ట్రాన్స్‌పార్మర్లను తొలగించి కొత్తవి ఏర్పాటు చేయాలని కోరారు. ట్రాన్స్‌పార్మర్లు అయితే గ్రామంలోకి తెప్పించారే తప్ప నేటికీ వాటిని బిగించలేదు. దీంతో స్థానికులు ట్రాన్స్‌కో సిబ్బందిపై ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. ఎస్సీ కులస్తులమని మా పట్ల ట్రాన్స్‌కో సిబ్బంది అలుసుగా ప్రవర్తిస్తున్నారు. అదే ప్రధానగ్రామంలో ఇన్ని రోజులు విద్యుత్ సమస్య ఉంటే ఇలానే పట్టించుకోకుండా ఉంటారా అని ట్రాన్స్‌కో సిబ్బందిని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మా సమస్యను వెంటనే పరిష్కరించాలని అన్నవరం ఎస్సీకాలనీ ప్రజలు కోరుతున్నారు.

పగిలిన మంచినీటి ప్రధాన పైపులైన్

● ఆ మార్గంలో తరచూ ఇదే పరిస్థితి


ఉదయగిరి రోడ్డులో చర్చి సమీపంలో పగిలిన ప్రధాన పైపులైన్‌కు చేస్తున్న మరమ్మతులు

కావలి, మే 26(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణం ఉదయగిరి రోడ్డులోని ఆర్వోబీ వంతెన అప్రోచ్ రోడ్డులో చర్చి సమీపంలో మంచినీటి ప్రధాన పైపులైన్ పగిలింది. దీంతో సోమవారం ఆ పైపులైన్‌కు మున్సిపల్ అధికారులు మరమ్మతులు చేపట్టారు. సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకు నుంచి రైల్వేట్రాక్‌కు తూర్పువైపున ఉన్న ప్రాంతానికి మంచినీటి సరఫరా చేసేందుకు ఆపైపులైన్ ఏర్పాటు చేశారు. అయితే కాలంచెల్లిన పైపులు కావడంతో ఆ మార్గంలో తరచూ పగిలి పోతున్నాయి. రైల్వే ట్రాక్ నుంచి ఉదయగిరి బ్రిడ్జి సెంటర్ వరకు ఉన్న ఆ పైపులైన్ తరచూ పగిలి పోతుండటంతో ఆ రోడ్డంతా గుంతలమయంగా మారి రాకపోకలకు కూడా ఇబ్బందిగా మారింది. దీంతో ఆ పాత పైపులైన్‌ను తొలగించి ఐరన్‌పైపుతో పైపులైన్ వేసేందుకు ప్రతిపాదనలు పంపినా దానికి నిధులు మంజూరు కాలేదు. మున్సిపల్ అధికారులు స్పందించి ఆ పాత పైపులైన్‌ను మార్చి శాశ్వత ప్రాతిపదికన కొత్త పైపులైన్ నిర్మించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

గృహ లబ్ధిదారులకు 'ఉపాధి' కూలి చెల్లించండి

లింగసముద్రం, మే 26(ఆంధ్రజ్యోతి) : మండలంలో పక్కా గృహాలు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు ఉపాధిహామీలోని 90 రోజుల పని దినాలకు సంబంధించిన కూలి డబ్బులు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో కట్టా శ్రీనివాసులు ఆదేశించారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధిహామీ టీఏలు, హౌసింగ్ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ హౌసింగ్ సిబ్బంది ఇచ్చిన నివేదిక ప్రకారం మండలంలో ఏఏ గ్రామాల్లో పక్కా గృహాలు నిర్మిస్తున్నారో క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. మండలానికి కేటాయించిన 21 ఫారం పాండ్లకు నిధులు మంజూరుకు ప్రణాళిక తయారు చేసి జిల్లా డ్వామా కార్యాలయానికి పంపించాలన్నారు. టీఏలు గ్రామాల్లో జరిగే ఉపాధి హామీ పనుల వద్దకు ఉదయం 9 గంటలకు వెళ్లి తప్పనిసరిగా కూలీల హాజరును పరిశీలించి పని చేసే వారికే మస్టరు వేయాలన్నారు. కూలీలు కొలతల ప్రకారం పనిచేసి రూ.300 వేతనం వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. బోగస్ మస్టర్లు వేస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

తీరనున్న మూగజీవాల దాహార్తి

● గ్రామాల్లో నీటి తొట్టెల నిర్మాణంతో పశువులకు తాగునీటి వసతి



పోకూరులో నిర్మించిన పశువుల నీటి తొట్టె

వలేటివారిపాలెం, మే 26(ఆంధ్రజ్యోతి) : వేసవిలో నాలుగు నెలలు పాటు చెరువుల్లో, వాగుల్లో, కాలువల్లో నీటి లభ్యత తక్కువగా ఉటుంది. అలాంటి సమయంలో మూగజీవాలు మేతకు వెళ్లి వచ్చిన తరువాత తాగునీటి కోసం ఇబ్బందులు పడాల్సి ఉంటుందని, దీని దృష్టిలో పెట్టుకొని కూటమి ప్రభుత్వం మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో 21 పశువుల నీటి తొట్టెలను మంజరు చేసింది. అందులో 8 పంచాయతీల్లో నీటి తొట్టెలు పూర్తయ్యాయి. మిగిలిన 11 పంచాయతీల్లో నిర్మాణ పనుల శరవేగంగా జరుగుతున్నాయి. ఒక్కో నీటి తొట్టెకు ప్రభుత్వం రూ.30 వేలు మంజూరు చేసింది. పొలాల్లో చేతి పంపులు ఉన్న ప్రదేశంలో నీటి తొట్టెలు నిర్మిస్తున్నారు. పశుపోషకులు, సన్నజీవాల పెంపకదారులు చేతి పంపులను వినియోగించుకొని తొట్టెల్లోని నీటిని పశువుల గొర్రెల దాహార్తి తీరుస్తున్నారు

నీటి తొట్టెలను సద్వినియోగం చేసుకోవాలి



వేసవిలో మూగజీవాలు దాహార్తికి పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టిలో పెట్టుకొని మండలంలోని 21 గ్రామ పంచాయతీలకు 21 నీటి తొట్టెలను మంజూరు చేసింది. అందులో 8 పంచాయతీల్లో నీటి తొట్టెల నిర్మాణం పూర్తయింది. మిగిలిన 11 పంచాయతీలోని నీటి తొట్టెలు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. అవి కూడా త్వరలో పూర్తవుతాయి. నీటి తొట్టెలను పశుపోషకులు, సన్నజీవాల పెంపకందారులు సద్వినియోగం చేసుకోవాలి.

- దయాసాగర్, ఏపీవో, వలేటివారిపాలెం

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

లింగసముద్రం, మే 26 (ఆంధ్రజ్యోతి) : లింగసముద్రంలో ఆర్‌డీఎస్ఎస్ పథకం కింద పనులు జరుగుతున్నందున మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏడీఈ విజయ్ బాబు, మండల విద్యుత్ ఏఈ షేక్ ఫిరోజ్‌లు సోమవారం ఒక సంయుక్త ప్రకటనలో చెప్పారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు గ్రామంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ


కొండయ్య కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న బీద మస్తాన్‌రావు

బిట్రగుంట, మే 26(ఆంధ్రజ్యోతి): ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన బోగోలు మండలం ఏబీకండ్రికకు చెందిన నీటి సంఘం మాజీ అధ్యక్షుడు, టీడీపీ నేత జీ కొండయ్య కుటుంబ సభ్యులను రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు సోమవారం పరామర్శించారు. అంతకు ముందు టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు, మాజీ కన్వీనర్ పిన్నిబోయిన సుధాకర్, మాజీ సర్పంచు దొడ్ల అంజయ్యయాదవ్‌లు బీదను పూలమాలలు, శాలువలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సోమశిల ప్రాజెక్ట్ కమిటీ ఉపాధ్యక్షుడు బీద గిరిధర్, నేతలు వెంకటేశ్వరరెడ్డి, రఘురాంనాయుడు, సుబ్బారావు, మన్సన్‌బాషా, పద్మలత, బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి ఐఐటీలో ఇంటర్న్‌షిప్

కందుకూరు, మే 26(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఐఐటీ కంప్యూటర్ సైన్స్ విభాగంలో రెండు నెలలకాలం ఇంటర్న్‌షిప్ చేసే అరుదైన అవకాశాన్ని ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినులు దక్కించుకున్నారని కళాశాల టెక్నికల్ డైరెక్టర్ కె.విజయ్‌శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాల కంప్యూటర్ సైన్స్ (ఏఐ) విభాగం విద్యార్థినులు గంగపట్ల మహిత, చుండూరి సంయుక్త చౌదరి తిరుపతి ఐఐటీలో ప్రొఫెసర్ సీహెచ్ విష్ణు నేతృత్వంలోని పరిశోధనా బృందంలో ఇంటర్న్‌షిప్ చేస్తారని తెలిపారు. ఈ అవకాశం కళాశాలలోని పరిశోధనా స్థాయికి అద్దం పడుతుందని, విద్యార్థుల పరిశోధనా సామర్థ్యాన్ని మెరుగుపరచటానికి కళాశాలలో ఏఐ ఇన్నోవేషన్ ల్యాబ్ స్థాపించటంతో పాటు గూగుల్ క్లౌడ్ కంప్యూటింగ్, జర్మన్ రోబోటిక్ సెంటర్లతో ఎంఓయూ చేసుకుని తర్ఫీదునివ్వటం వల్లే ఈ అవకాశం లభించిందన్నారు. విద్యార్థినులను మార్గదర్శనం చేసిన కళాశాల అకడమిక్ డీన్ డాక్టరు ముప్పా లక్ష్మణరావును ఈ సందర్భంగా విజయ్‌శ్రీనివాస్ ప్రత్యేకంగా అభినందించారు. ఇంటర్న్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థినులను ప్రిన్సిపాల్ సీహెచ్ రవికుమార్, వైస్ ప్రిన్సిపాల్ వి.హరిబాబు, అధ్యాపకులు అభినందించారు.



పాపం పండుతోంది!

జగన్ జమానాలో జరిగిన ఉల్లం'ఘనుల' పాపం పండుతోంది. 2023-24 మధ్య రెండేళ్ల పాటు ఇష్టారాజ్యంగా సాగిన అడ్డగోలు దోపిడీని లెక్కగట్టి భూగర్భ-గనులశాఖ కొరడా ఝుళిపించింది. సిలికా మైనింగ్‌లో మూడొంతులకు పైగా ఇసుకాసురులను గుర్తించి బ్లాక్‌లిస్టులో చేర్చింది. క్వార్ట్జ్ దొంగల గుండెల్లోను లారీలు పరుగెత్తిస్తోంది. గీత దాటిన వారందరిపై భారీగా జరిమానాలతో పాటు సీఐడీ క్రిమినల్ చర్చలకూ సిద్ధమవుతోంది.

– గూడూరు అర్బన్, ఆంధ్రజ్యోతి

- విచ్చలవిడి అక్రమాలపై మైనింగ్ యాక్షన్
- 348 ఎండీఎల్‌లు ఔట్.. 110 ఓకే
- జరిమానాలు, సీఐటీ విచారణలతో ఉలం'ఘనులు' ఉక్కిరి బిక్కిరి



జిల్లాలో చిల్లకూరు, కోట మండలాల్లో అరుదైన సిలికా శాండ్, గూడూరు రూరల్ మండలంలో క్వార్ట్జ్ ఖనిజ నిక్షేపాలు అపారంగా ఉన్నాయి. ఈ ఖనిజాలకు మార్కెట్లో ఎక్కువ డిమాండ్ ఉండటంతో గత వైసీపీ ప్రభుత్వంలో అక్రమ దందా పరాకాష్టకు చేరింది. లక్షలాది టన్నుల సిలికాను పలు అక్రమ పద్ధతుల్లో ఇక్కడి నుంచి తరలించేశారు. వేలాది టన్నుల క్వార్ట్జ్ ఖనిజాన్ని చైనా, సింగపూర్, అరబ్ దేశాలకు 'జే' ట్యాక్స్ దండుకుని దాటించేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఈ అక్రమాలపై దృష్టిసారించింది. ఉన్నపళంగా మైనింగ్ లీజులు, ఎండీఎల్(మైనింగ్ డీలర్స్ లైసెన్సు)ను సుప్తావస్థలో పెట్టింది. మైనింగ్ లీజుదారుల నుంచి బలవంతంగా గనులను లాక్కొని ఇష్టమొచ్చినట్లు తవ్వి తరలించినట్లు గుర్తించారు. ఈ ప్రాంతానికి చెందిన వైసీపీ కీలక నేత సిలికాను ఎగరేసుకుపోవడంతో గూడూరు మండలంలోని మంగళపూరు వద్ద ఓ క్వార్ట్జ్‌ను వైసీపీ పెద్దలు విదేశాలకు తరలించిన ఉదంతం కూడా సీఐడీ విచారణలో ఉంది. మైనింగ్ డీలర్ల లైసెన్స్‌లలో కూడా అవినీతి అంతా ఇంతా కాదు. కూటమి ప్రభుత్వం దీనిపై గత అక్టోబరు చివరి వారంలో అసిస్టెంట్ డైరెక్టర్ స్థాయి అధికారులతో మూడు ప్రత్యేక బృందాలతో విచారణ జరిపించి అక్రమాలు లెక్క కట్టించింది. రికార్డులకు వాస్తవ నిల్వలకు భారీ వ్యత్యాసాలు కనిపించడంతో 327 కంపెనీలకు మైనింగ్ అధికారులు తాకీదులిచ్చారు. ఒక్కో ఎండీఎల్‌కు లక్షల్లో పెనాల్టీ విధించారు. వైసీపీ కీలక నేతకు చెందిన సుమారు 25 కంపెనీలకు రూ.కోట్లలో జరిమానాలు ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉన్నాయని మైనింగ్ శాఖ అధికారులు ప్రభుత్వ పెద్దలకు పంపిన నివేదికలో పేర్కొన్నారు. చిన్న చిన్న తేడాలను పెనాల్టీలతో హెచ్చరించి అనుమతులు మంజూరు చేయాల్సిందిగా ఉన్నత ప్రభుత్వ వర్గాలు సూచించడంతో ఆ మేరకు కొన్నింటికి స్థానిక అధికారులు అనుమతులు మంజూరు చేశారు. 93 ఎండీఎల్‌లు సిలికా గ్రేడింగ్, పాలిషింగ్, రవాణా మొదలు పెట్టాయి. 306 కంపెనీలు బ్లాక్‌లిస్టులో చేరిపోయాయి. మొత్తం 80 సిలికా మైన్లలో 13కి మాత్రమే అనుమతులు లభించాయి. మేజర్ మినరల్స్ అయిన మైకా, క్వార్ట్జ్, ఫెల్డ్ స్పర్, వర్మిక్‌లైట్ మెన్‌తో పాటు గ్రావెల్, రోడ్ మెటల్లాంటి క్వారీలకు కూడా పెద్దగా అనుమతులు ఇవ్వలేదు. మొత్తం 20 లీజులకు తొమ్మిదింటికి మాత్రమే మైనింగ్ అనుమతించ్చారు. 59 ఎండీఎల్‌లలో 17కంపెనీలు మాత్రమే కొద్దిరోజుల కిందట గ్రేడింగ్, రవాణా ప్రారంభించాయి.

చిల్లకూరు మండలం మోమిడి, తమ్మినపట్నం, చింతవరం, బల్లవోలు, వరగలి, ఏరూరు, వేళ్లపాళెం, కోట మండలంలోని సిద్ధవరం, కొత్తపట్నం గ్రామాల్లో సుమారు 1200 హెక్టార్లలో 80 కంపెనీలకు సిలికా శాండ్ మైనింగ్ కోసం.. గూడూరు రూరల్, చిల్లకూరు మండలాల్లో పలుచోట్ల మైకా, క్వార్ట్జ్, ఫెల్డ్ స్పర్, వర్మిక్‌లైట్, గ్రావెల్, రోడ్ మెటల్ ఖనిజాల కోసం మరో 20 మైనింగ్ లీజులకు ప్రభుత్వ మంజూరులున్నాయి. అలాగే, సిలికా శాండ్ మైనింగ్‌కి చిల్లకూరు మండలంలో రామిరెడ్డిపాళెం, కలవకొండ, ఉడతావారిపాళెం, పొన్నవోలు గ్రామాల్లో 399, గూడూరు రూరల్ మండలంలో పలు ఖనిజాల ట్రేడింగ్ కోసం మరో 59 ఎండీఎల్(మైనింగ్ డీలర్స్ లైసెన్స్)లు ఏర్పాటయ్యాయి. ఇవన్నీ కూటమి ప్రభుత్వం ఏర్పాటుకుముందు జరిగిన అనుమతులు కావడం గమనార్హం.



గీత దాటితే తిప్పలే

గనుల నిర్వహణ, రవాణాలో గీత దాటితే తిప్పలు తప్పవు. ఎండీఎల్ యార్డుల్లో నిల్వలు-రికార్డుల్లో లెక్కలు వ్యత్యాసం చూపకూడదు. నిఘా కెమెరాలు, భౌగోళిక ఆకాంక్షలు(జియో లాజికల్ కో-ఆర్డినేట్స్) ఏర్పాట్లను అందుబాటులో ఉంచుకోవాలి. మైనింగ్‌లో అక్రమాలు ఏమాత్రం ఉపేక్షించబోం. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.28కోట్లు ప్రభుత్వ ఆదాయం లక్ష్యంగా ప్రణాళికలు రచించుకున్నాం.

– శ్రీనివాసరావు, డీఎంజీవో

కాకాణి అరెస్టుతో వెంకటగిరిలో హడావిడి

- తరలివచ్చిన వైసీపీ నేతలు, కార్యకర్తలు
- కోర్టు పరిసరాల్లో 144 సెక్షన్



కోర్టు వద్ద నుంచి జనాన్ని పంపిస్తున్న గూడూరు డీఎస్పీ గీతాకుమారి, సీఐ ఏవీ రమణ

వెంకటగిరి, మే 26 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అరెస్టుతో సోమవారం వెంకటగిరి పట్టణంలో హడావిడి నెలకొంది. గోవర్ధన్‌రెడ్డిని నెల్లూరు జిల్లా పోలీసులు రిమాండు నిమిత్తం వెంకటగిరి కోర్టులో హాజరుపరిచారు. దీంతో ఉదయం నుంచే ఉమ్మడి నెల్లూరు జిల్లాకు చెందిన వైసీపీ నేతలు, శ్రేణులు పెద్దసంఖ్యలో ఇక్కడికి తరలి వచ్చారు. వైసీపీ శ్రేణుల నుంచీ ప్రతిఘటన, ఆందోళనలు ఎదురవుతాయేమోనని పోలీసులు ముందు జాగ్రత్తగా కోర్టు పరిసరాల్లో 144 సెక్షన్ విధించడంతో పాటు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. దీంతో పట్టణంలో సోమవారం హడావిడి, ఉత్కంఠ వాతావరణం నెలకొంది.

నెల్లూరు జిల్లా పొదలకూరు పోలీసు స్టేషన్‌లో నమోదైన ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుకు సంబంధించి ఏ4 నిందితుడిగా వున్న ఆ జిల్లా వైసీపీ నేత, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని పోలీసులు ఆదివారం కర్నాటకలో అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో ఆయన్ను సోమవారం వెంకటగిరి కోర్టులో హాజరుపరిచారు. వాస్తవానికి ఈ కేసు గూడూరు అడిషినల్ ఫస్ట్‌క్లాస్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టు పరిధికి సంబంధించింది. ఆ కోర్టు మేజిస్ట్రేట్ సెలవులో వుండడంతో వెంకటగిరి మేజిస్ట్రేట్ విష్ణు వర్మ గూడూరు కోర్టుకు ఇన్‌చార్జి మేజిస్ట్రేట్‌గా వ్యవహరిస్తున్నారు. ఆ కారణంగా నెల్లూరు పోలీసులు కాకాణిని నెల్లూరు ప్రభుత్వాస్పత్రిలో వైద్యపరీక్షల అనంతరం వెంకటగిరి కోర్టుకు తీసుకొచ్చారు. ఈ విషయం తెలిసి నెల్లూరు జిల్లా అల్లూరు మండలం నుంచీ పెద్ద సంఖ్యలో వైసీపీ కార్యకర్తలు తరలి వచ్చారు. వైసీపీ శ్రేణులు ఆందోళన చేపడతాయనే అనుమానంతో ఉదయం 6 గంటల నుంచే కోర్టు వద్ద భారీగా పోలీసులు మొహరించారు. కోర్టు పరిసరాల్లో 200 మీటర్ల వరకూ 144 సెక్షన్ విధించారు. ఉదయం 11.20 గంటలకు వైసీపీ ముఖ్య నాయకులు కోర్టు వద్దకు చేరుకోగా 11.30 గంటలకు కాకాణిని పోలీసులు కోర్టుకు తీసుకొచ్చి మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. రిమాండు రిపోర్టు పరిశీలించిన మేజిస్ట్రేట్ విచారణ మొదలుపెట్టి ఇరువైపుల వాదనలు విన్నారు. ప్రాసిక్యూషన్ తరపున గూడూరు కోర్టు ఏపీపీ కేదార్‌నాథ్.. మాజీ మంత్రి తరపున న్యాయవాదులు విజయ్‌కుమార్‌రెడ్డి, రోజా రెడ్డి, ఉమామహేశ్వర్‌రెడ్డి వాదనలు వినిపించారు. లంచ్ బ్రేక్ అనంతరం 3.10 గంటల సమయంలో మేజిస్ట్రేట్ కాకానికి 14 రోజుల పాటు రిమాండు విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.



కోర్టు నుంచి బయటకు వస్తున్న కాకాణి గోవర్ధన్ రెడ్డి

విచారణ జరిగింతసేపూ చేతులు కట్టుకునే..

సోమవారం ఉదయం 11.30 నుంచీ మధ్యాహ్నం 3.10 గంటల దాకా మధ్యలో భోజనం విరామం మినహా విచారణ జరిగినంతసేపూ కోర్టులో మాజీ మంత్రి కాకాణి చేతులు కట్టుకుని నిలబడే ఉన్నారు. మేజిస్ట్రేట్ రిమాండు విధించాక పక్కనున్న గదిలోకి వెళ్లి కూర్చున్నారు. రిమాండు ఉత్తర్వులు వచ్చాక కాకాణి తరపు న్యాయవాదులు జైల్లో ఆయనకు ప్రత్యేక సదుపాయాలు కల్పించాలని కోరుతూ పిటిషన్ వేశారు.

వైసీపీ శ్రేణుల్లో ఉత్కంఠ

కాకాణి గోవర్ధన్‌రెడ్డికి రిమాండు విధిస్తారా లేక బెయిల్ మంజూరవుతుందా అని వైసీపీ శ్రేణులు ఉత్కంఠగా వేచి చూశాయి. పోలీసు ఆంక్షల కారణంగా శ్రేణులు కోర్టుకు దూరంగా వుండిపోగా ముఖ్య నాయకులు తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి, మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీలు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మేరిగ మురళీధర్, నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, సూళ్ళూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తదితరులు కోర్టు హాలులోను, మిగిలి ద్వితీయ శ్రేణి నేతలు కోర్టు ఆవరణలో గడిపారు. వారంతా మేజిస్ట్రేట్ నిర్ణయం కోసం ఆత్రుతగా నిరీక్షించారు. చివరికి రిమాండు విధించడంతో ఉసూరుమంటూ వెనుదిరిగారు. మొత్తానికి కాకాణిని వెంకటగిరి కోర్టుకు తీసుకురావడంతో పట్టణంలో హడావిడి, ఉత్కంఠ నెలకొంది.



అమాస బాలు అలియాస్ పవన్

హలో.. చంద్రగిరి ఎమ్మెల్యే పీఏని మాట్లాడుతున్నా!

- ఎయిర్ పోర్టులో ఉద్యోగాల పేరిట మోసం
- ఎట్టకేలకు పోలీసులకు చిక్కిన క్యాబ్ డ్రైవరు
- మాజీ మంత్రి అనుచరులతో సంబంధాలు?

తిరుపతి(కలెక్టరేట్), మే 26(ఆంధ్రజ్యోతి): అతడు క్యాబ్ డ్రైవర్. కానీ, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని పీఏ పవన్‌నని చెప్పుకొంటాడు. 'హలో.. నేను చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని పీఏ పవన్‌ను మాట్లాడుతున్నా. ఎయిర్‌పోర్టులో ఉద్యోగాలు ఉన్నాయి. మీరు ఎక్కువ కట్టాల్సిన అవసరంలేదు. అంతా కలిపి రూ.50వేలు లోపు పంపిస్తే చాలు' అంటూ కొంతకాలంగా అమాయక యువతను మోసగిస్తున్నాడు. ఎట్టకేలకు ఇతడిని తిరుచానూరు పోలీసులు పట్టుకున్నారు. అతడికి ఓ మాజీ మంత్రి అనుచరుల వాట్సాప్ గ్రూప్‌లో పేరు ఉండటం పలు అనుమానాలకు తావిస్తోంది. తిరుచానూరు ఎస్‌ఐ సాయినాథ్ చౌదరి తెలిపిన ప్రకారం.. తిరుపతి నగరం కొర్లగుంటలోని అమాస బాలు అలియాస్ ఇండిగో పవన్ రేణిగుంట ఎయిర్‌పోర్టు వద్ద క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని పీఏ పవన్‌ని అంటూ పలువురితో పరిచయం చేసుకున్నాడు. ఎయిర్‌పోర్టులో ఉద్యోగాల పేరిట నమ్మించి డబ్బులు తీసుకుని మోసగించేవాడు. ఈ క్రమంలో సోమవారం తాను ఎమ్మెల్యే పీఏనంటూ తిరుపతి రూరల్ మండలం పైడిపల్లికి చెందిన ఓ వ్యక్తికి ఫోను చేసి బేరం పెట్టాడు. ఆ తర్వాత పైడిపల్లి వ్యక్తి చంద్రగిరి ఎమ్మెల్యే పీఏ పవన్‌కు ఫోన్ చేసి.. నగదు ఎంత వేయాలని అడిగారు. ఏం డబ్బులు, ఏం ఉద్యోగం అంటూ అతడిని నాని పీఏ పవన్ ప్రశ్నించగా.. మీ పేరులో కాల్ చేశారంటూ అసలు విషయం చెప్పారు. దీంతో తన పేరిట మోసం చేస్తున్న వ్యక్తిపై పవన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎట్టకేలకు నిందితుడు అమాస బాలును తిరుచానూరు పోలీసులు సోమవారం రాత్రి పట్టుకున్నారు. అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సాయినాథ్ చౌదరి తెలిపారు. అమాస బాలు ఫోన్ లిస్టును పరిశీలించగా ఓ మాజీ మంత్రితో పాటు వైసీపీ నేతల వాట్సప్‌గ్రూప్‌లో ఉండటం విశేషం. వైసీపీ నేతల ప్రోద్బలంతో ఎమ్మెల్యే పీఏ పేరిట మోసం చేశాడా అనే కోణంలోనూ దర్యాప్తు సాగుతోంది.

ప్రయాణికులు చెయ్యెత్తిన చోట బస్సులు ఆపండి

ఆర్టీసీ ఎండీ తిరుమలరావు



సత్యవేడు డిపోలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న తిరుమలరావు

సత్యవేడు/పుత్తూరు, మే 26 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులు చెయ్యెత్తిన చోట బస్సు ఆపాలని ఆర్టీసీ ఎండీ ద్వారక తిరుమలరావు డ్రైవర్లు, కండక్టర్లకు సూచించారు. సోమవారం ఆయన సత్యవేడు, పుత్తూరు డిపోలను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఆర్టీసీ ఉద్యోగులకు 2017 నుంచి పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ, ఎస్‌బీటీ బకాయిలను చెల్లించామన్నారు. విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోయిన వారికి ప్రమాద బీమాను రూ.కోటి వరకు పెంచినట్లు వివరించారు. గతంలో రూ.3,000 పింఛను ఇచ్చేవారని ప్రస్తుతం దాన్ని రూ.12,000 పెంచామన్నారు. భవిష్యత్తులో సర్వీసును బట్టి ప్రభుత్వోద్యోగుల తరహాలో పింఛన్లు అందుకుంటారని చెప్పారు. ప్రయాణికుల విజ్ఞప్తి మేరకు అవసరమైన రూట్లలో సర్వీసులు నడపాలన్నారు. ఈ సందర్భంగా ఇంధన పొదుపులో ప్రతిభ కనబరచిన సత్యవేడు డిపో డ్రైవర్లు వీరయ్య, మధు, సురేశ్‌కు ఎండీ ప్రశంసాపత్రాలను అందించారు. అనంతరం బస్టాండ్‌లో మౌలిక సదుపాయాలను తనిఖీ చేశారు. కాగా డిపోకు పూర్వ వైభవం తీసుకురావాలని ఎండీ తిరుమలరావును ఎమ్మెల్యే ఆదిమూలం కోరారు. సత్యవేడు నుంచి విజయవాడకు, ఊత్తుకోట్టై మీదుగా చెన్నై, చిత్తూరు, సూళ్లూరుపేట, తిరువళ్లూరుకు సర్వీసులు ఏర్పాటు చేయాలని కోరారు. పుత్తూరు డిపో నుంచి అమరావతికి, బెంగళూరు, హైదరాబాదు, వేళాంకన్ని, తిరువణ్ణామలైకి సీఎన్‌జీ, విద్యుత్ బస్సులను ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. డిపోలో 140 నుంచి 70 సర్వీసులకు తగ్గిపోయిందని ప్రస్తావించగా... మునుపటి కళను తీసుకువస్తామని అన్నారు. పుత్తూరు బస్టాండుకు రంగులు వేయాలని డిపో మేనేజర్ ప్రశాంతిని ఆదేశించారు. ఆయా కార్యక్రమాల్లో ఈడీవో పల్లంరాజు, ఈడీఈ చెంగల్‌రెడ్డి, డిప్యూటీ సీఎంఈలు శ్రీనివాసులు, బాలాజీ, డీఎం వెంకటరమణ, ఎన్‌ఎంయూఏ, ఈయూ, సీఐటీయూ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మండలి బుద్ధప్రసాద్



సురేఖవాణి

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, మే 26 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ప్రభుత్వ విప్ వెంకటరావు, ఏపీ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ శ్రీహరిరావు, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి, మహారాష్ట్ర మంత్రి ఉదయ్ సామంత్, సినీనటి సురేఖవాణి, కర్ణాటకకు చెందిన మల్లిఖార్జున ముత్యా(అప్పాజీ), హైదరాబాద్‌కు చెందిన గోల్డ్ మెన్ కొండ విజయ్‌కుమార్ ఉన్నారు.



కొండ విజయ్‌కుమార్, మల్లిఖార్జున ముత్యా

సర్వదర్శనానికి 15 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని 8 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లోని 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.3.80 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 91,538

తలనీలాలు సమర్పించినవారు: 37,339



ప్రతి ఫిర్యాదుకూ పరిష్కారం చూపండి

అధికారులకు కలెక్టర్ ఆదేశం ● కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్‌కు 268 ఫిర్యాదులు ● ప్రజాసంఘాల ధర్నాలు

తిరుపతి(కలెక్టరేట్), మే 26 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ఇచ్చే ప్రతి అర్జీకి పరిష్కారం చూపాలని అధికారులను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఫిర్యాదులకు నిర్దేశిత సమయంలో పరిష్కారం చూపాలని, పరిష్కారం కానివాటికి కారణాలు చెప్పాలని కలెక్టర్ సూచించారు. జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు తదితర అధికారులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. పీజీఆర్ఎస్‌కు 268 అర్జీలు అందగా అందులో వివిధ భూసమస్యలపై 150 వినతులు రెవెన్యూశాఖకే రావడం గమనార్హం. వచ్చిన సమస్యల్లో కొన్ని..

గుట్ట కబ్జాదారులపై చర్యలు తీసుకోండి

రామచంద్రాపురం మండలంలో గుట్టను చదును చేసి ఎర్రమట్టి అమ్ముకుంటున్న దొంగలను, గుట్టను కబ్జా చేస్తున్న వారిపైనా చర్యలు తీసుకోవాలని సీపీఎం నేతలు జయచంద్ర, సుమన్ డిమాండు చేశారు. ఈ మేరకు వీరు కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. పంచాయతీ కార్యాలయానికి కూతవేటు దూరంలో ప్రభుత్వ బాలుర వసతిగృహం వద్ద మట్టిని తవ్వి వందలట్రిప్పులు తీసుకెళుతున్నారన్నారు. దీంతో రామాపురం నుంచి పచ్చికాపల్లం వరకు కొండలన్నీ మాయమై పోతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఒక ట్రిప్పు ఎర్రమట్టిని సుమారు రూ.30వేలకు అమ్ముకుంటున్నారన్నారు. ఇక ప్రభుత్వ భూములను యథేచ్ఛగా కబ్జా చేస్తున్నారన్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఎర్రమట్టి అక్రమ రవాణాదారులు, గుట్టలు చదునుచేస్తున్న వారిపై చర్యలు తీసుకోకుంటే పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

వాకాడు చెరువును చెరబట్టారు

కొంతమంది ఆక్రమణదారులు వాకాడు చెరువును కబ్జాచేసి వ్యవసాయం చేస్తుండటంతో నీటిపారుదల ఆగిపోయిందని ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తహసీల్దారు దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదని వెంకటశేషయ్య, నాగరాజు, హరి, జనార్దన్, రమణయ్య కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించి చెరువును కాపాడాలని కోరారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్



ఎస్టీ వర్గీకరణచేసి యానాదులకు న్యాయం చేయండి

ఎస్టీ వర్గీకరణ చేసి యానాదులకు న్యాయం చేయాలంటూ యానాది రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. గిరిజన జాతుల్లో జనాభాపరంగా మొదటి స్థానంలో ఉన్న యానాదులు ఇప్పటికీ వెనుకబడి ఉన్నారని ఆ సమితి రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచులయ్య అన్నారు. ఎస్టీ వర్గీకరణతోనే యానాదులు అభివృద్ధి చెందుతారన్నారు. అనంతరం కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సుబ్బారావు, బాపట్ల బ్రహ్మయ్య, తలపల మల్లికార్జున, వెంకటరమణ, చెంగల్రాయులు, రామయ్య, రేవతి, రాములమ్మ, ఉష తదితరులు పాల్గొన్నారు.

మామిడికి గిట్టుబాటు ధర కల్పించాలి



జిల్లాలో మామిడికి గిట్టుబాటు ధర కల్పించి తమను ఆదుకోవాలని రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తోతాపురికి కిలో రూ.15 కనీస ధర కల్పించాలన్నారు. ఏ రోజు ధరలు ఆరోజు మార్కెట్‌లో ప్రదర్శించాలని డిమాండు చేశారు. సాగు భారమై రైతాంగం తీవ్రంగా నష్టపోతోందని ధరలు పెంచి రైతాంగాన్ని ఆదుకోవాలని చంద్రశేఖర్, రాము తదితరులు కోరారు.

సర్‌ఛార్జీ, స్టాంప్‌డ్యూటీ నిధులు చెల్లించాలి



తిరుపతి రూరల్ మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లో భూమి, ఇళ్ల రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. దీనికి సంబంధించి పంచాయతీలకు రావాల్సిన సర్‌ఛార్జీ, స్టాంప్ డ్యూటీ నగదు రెండేళ్లుగా విడుదల చేయడంలేదని సాయినగర్ సర్పంచ్ రమణ, మాజీ సర్పంచ్ సుబ్రహ్మణ్యంరెడ్డి కలెక్టర్ వెంకటేశ్వర్‌కు ఫిర్యాదు చేశారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రతి నెలా జరిగే రిజిస్ట్రేషన్లకు సంబంధించి స్టాంప్ డ్యూటీ, సర్‌చార్జీ నగదును క్రమం తప్పకుండా పంచాయతీలకు అందించాలన్నారు.

'విశాఖ' స్టీల్‌లో తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి



విశాఖ ఉక్కు పరిశ్రమంలో తొలగించిన 4వేల మంది కాంట్రాక్టు కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు హరినాథ్‌రెడ్డి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాలసుబ్రహ్మణ్యం, ఐఎఫ్‌టీయూ జిల్లా నేత వెంకటరత్నం మాట్లాడుతూ.. విశాఖ ఉక్కు పరిశ్రమకు గనులు కేటాయించకుండా ప్రైవేటు పరిశ్రమలకు కేటాయించడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. కార్పొరేట్ కంపెనీలకు విశాఖ ఉక్కును కట్టబెట్టే ప్రయత్నాలను మోదీ ప్రభుత్వం మానుకోవాలని సూచించారు. అనంతరం కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ, సీపీఐ నేతలు రాధాకృష్ణ, జయచంద్ర, రాజా, లోకేష్, సుబ్రమ్మణ్యం, మాధవ్‌కృష్ణ, వేణుగోపాల్, బుజ్జి, చిన్నయాదవ్, యుగంధర్, సాయి లక్ష్మి, సుమన్, చిన్నం పెంచులయ్య తదితరులు పాల్గొన్నారు.



శ్రీసిటీ అధికారులతో థాయ్ బృందం

శ్రీసిటీని సందర్శించిన థాయ్‌లాండ్ కాన్సుల్ జనరల్

శ్రీసిటీ, మే 26 (ఆంధ్రజ్యోతి): చెన్నైలోని థాయ్‌లాండ్ కాన్సుల్ జనరల్ రాచా ఆరిబార్గ్ తన సతీమణి నరఫాన్ ఆరిబార్గ్‌తో కలిసి రెండు రోజుల పర్యటన నిమిత్తం సోమవారం శ్రీసిటీకి విచ్చేశారు. వారికి శ్రీసిటీ ఆపరేషన్స్ ప్రెసిడెంట్ సతీష్ కామత్ సాదర స్వాగతం పలికి, శ్రీసిటీ ప్రగతి, ప్రత్యేకతలు, అంతర్జాతీయ మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక వాతావరణం, వ్యాపార ప్రయోజనాల గురించి వారికి వివరించారు. భారత్ - థాయ్‌లాండ్ మధ్య వ్యాపార సంబంధాలను పెంపొందించడంలో ఈ పర్యటన కీలకపాత్ర పోషిస్తుందని శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తన ప్రకటనలో తెలిపారు. థాయ్ కాన్సుల్ జనరల్ తన పర్యటనలో భాగంగా తొలి రోజు శ్రీసిటీ అధికారులతో చర్చలు, సెజ్ పరిసరాలతో పాటు థాయ్ పరిశ్రమలైన రాక్‌వర్త్, మాండలెజ్ పరిశ్రమలను సందర్శించి ఆయా పరిశ్రమల ప్రతినిధులతో సమావేశమయ్యారు.

రేపు బర్డ్ డైరెక్టర్ బాధ్యతల స్వీకరణ

తిరుపతి, మే 26(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని బాలాజీ వికలాంగుల శస్త్రచికిత్స, పరిశోధన, పునరావాస కేంద్రం (బర్డ్) డైరెక్టర్‌గా డాక్టర్ జగదీష్ బుధవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం చంద్రబాబు నాయుడు సూచనలతో ఈనెల 2న బర్డ్ డైరెక్టర్‌గా జగదీష్‌ను నియమిస్తూ టీటీడీ ఈవో శ్యామలరావు ప్రొసీడింగ్స్ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో బర్డ్ ఆస్పత్రి పాత భవనంలో ఇదివరకున్న డైరెక్టర్ ఛాంబర్‌ను సిద్ధం చేశారు. ఈనెల 28న బర్డ్‌ను స్థాపించిన దివంగత నేత ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ఆయనకు నివాళులు అర్పించి జగదీష్ బాధ్యతలు తీసుకోనున్నట్లు తెలిసింది.

గంజాయి స్వాధీనం

పోలీసుల అదుపులో ముగ్గురు అంతర్రాష్ట్ర స్మగ్లర్లు

శ్రీకాళహస్తి,మే26(ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణా కదలికలపై పక్కా సమాచారంతో పోలీసులు మాటు వేసి ముగ్గురు అంతర్రాష్ట్ర స్మగ్లర్లను అదుపులోకి తీసుకున్నారు. సోమవారం శ్రీకాళహస్తి పట్టణ శివార్లలోని చెన్నై రహదారిలో గంజాయి రవాణా సాగుతున్నట్లు సమాచారం అందుకున్న శ్రీకాళహస్తి రెండో పట్టణ పోలీసులు మాటు వేసి ముగ్గురిని అదుపులోకి తీసుకుని గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నట్లు సమాచారం.

రైలు ఢీకొని పాడి రైతు మృతి

బాలాయపల్లి, మే 26 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని పాడిరైతు మృతిచెందిన సంఘటన మండలంలోని పిగిలాం గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. పిగిలాం గ్రామానికి చెందిన అమ్మినేని నాగయ్య (59) అనే రైతు గేదెలను వెతికే క్రమంలో ఆదివారం గ్రామ సమీపంలో రైలు పట్టాలు దాటుతుండా ప్రమాదవశాత్తూ రైలు ఢీకొనడంతో మృతిచెందాడు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా నాగయ్యకు వినిడిలోపం ఉండడంతో రైలు రావడాన్ని గుర్తించకపోవడంతో ప్రమాదానికి గురై మృతిచెంది ఉంటాడని స్థానికులు భావిస్తున్నారు.

డిగ్రీ రెండో సెమిస్టర్ ఫలితాల విడుదల

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 26 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ ఆర్ట్స్ కాలేజీ, పద్మావతి డిగ్రీ కాలేజీలకు సంబంధించిన డిగ్రీ రెండవ సెమిస్టర్ ఫలితాలు విడుదలయ్యాయి. స్వయం ప్రతిపత్తి గల ఈ రెండు కాలేజీలు సొంతంగానే పరీక్షలు నిర్వహించి, ఫలితాలు వెల్లడించాయి. ఫలితాలను ఆయా కాలేజీల అధికారులు సోమవారం విడుదల చేశారు. ఎస్వీ ఆర్ట్స్ కాలేజీకి సంబంధించిన ఫలితాలు ఎస్‌వీఏసీ.ఎడ్యూ.ఇన్.. వెబ్‌సైట్‌లో చూడవచ్చు. ఎస్వీ ఆర్ట్స్ కాలేజీలో 88.05 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ వేణుగోపాలరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ మల్లికార్జునరావు ప్రకటించారు. పద్మావతి డిగ్రీ కాలేజీలో 92 శాతం మంది విద్యార్థినులు ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ నారాయణమ్మ తెలిపారు.

వ్యవసాయ శాఖ కౌన్సెలింగ్‌లో ఇష్టారాజ్యం

జాబితాలో ముందున్న వారికే రిక్వెస్ట్ బదిలీలు - కొందరు ప్రజాప్రతినిధుల సిఫార్సులే చెల్లుబాటు



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న వ్యవసాయ శాఖ ఏడీ శ్రీధర్



కౌన్సెలింగ్ హాల్ బయట ఎదురుచూస్తున్న అధికారులు

అనంతపురం అర్బన్, మే 26(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖ అధికారులు, ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్‌లో గందరగోళం నెలకొంది. అనంతపురం జేడీ కార్యాలయంలో ఉమ్మడి అనంతపురం, కర్నూలు, కడప, చిత్తూరు జిల్లాలకు సంబంధించి ఏడీలు, ఏఓలు, సీనియర్ అసిస్టెంట్ల బదిలీల కౌన్సెలింగ్ సోమవారం నిర్వహించారు. వ్యవసాయ శాఖ అదనపు సంచాలకుడు (ఏడీ) శ్రీధర్ నేతృత్వంలో ఆయా జిల్లాల జేడీఈ లు ప్రక్రియలో పాల్గొన్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నందాకా సీనియర్ అసిస్టెంట్లు, ఏడీలు, మధ్యాహ్నం నుంచి రాత్రిదాకా ఏఓలకు బదిలీల కౌన్సిలింగ్ నిర్వహించారు. నాలుగు ఉమ్మడి జిల్లాల అధికారులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరు కావడంతో జేడీ కార్యాలయ ఆవరణలో సందడి నెలకొంది. ఒకే చోట ఐదేళ్ల సర్వీస్ పూర్తిచేసిన వారితో పాటు రిక్వెస్ట్ కింద పలువురు ఉద్యోగులు బదిలీ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించింది. ఐదేళ్లు పూర్తయిన అధికారులు, ఉద్యోగులను వారు ఇచ్చిన మూడు ఆప్షన్లలో ఒక స్థానాన్ని ఖరారు చేసినట్లు సమాచారం. రిక్వెస్ట్ కింద బదిలీ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారిలో కొందరికే బదిలీ జరిగినట్లు తెలుస్తోంది. ఆన్‌లైన్ జాబితాలో ముందున్న కొందరికే రిక్వెస్ట్ బదిలీకి అంగీకరించారు. ఆ తర్వాత జాబితాలోని అధికారులు, ఉద్యోగులను నిర్దాక్షిణ్యంగా కౌన్సెలింగ్‌లో చెప్పుకునేందుకు కూడా అవకాశం ఇవ్వలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు క్యాడర్లలో ఐదేళ్లు పూర్తికాని స్థానాలకు ఇతర అధికారులను బదిలీ చేసేందుకు అంగీకరించినట్లు తెలిసింది. ఇదే తరహాలో దరఖాస్తు చేసుకున్న మరికొందరు అధికారుల దరఖాస్తులను పక్కన పెట్టినట్లు సమాచారం. కొందరు ప్రజాప్రతినిధుల సిఫార్సులను ఓకే చేసి.. అక్కడికక్కడే అధికారులకు స్థానాలను ఖరారు చేసి పంపినట్లు సమాచారం. మరికొందరి సిఫార్సులను బుట్టదాఖలు చేశారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముందస్తు మేనేజ్ నేపథ్యంలోనే పలువురు అధికారులను వారు కోరుకున్న స్థానాలకు పంపకుండా ఆపేసినట్లు చర్చ సాగుతోంది. ఏడీలు, ఏఓలు, సీనియర్ అసిస్టెంట్ల బదిలీలు రాష్ట్రస్థాయిలో ఫైనల్ చేస్తారు. ఏడీ నేతృత్వంలోని కమిటీ సిఫార్సులనే దాదాపుగా రాష్ట్ర ఉన్నతాధికారులు ఓకే చేసే పరిస్థితి ఉంది. ఇక్కడ తమకు అన్యాయం జరిగిందని భావించిన అధికారులు, ఉద్యోగులు రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులను కలిసే అవకాశం ఉన్నా.. అక్కడికి వెళ్లేవారు తక్కువేనన్న వాదనలు వినిపిస్తున్నాయి. వ్యవసాయ శాఖ యూనియన్లలో ఆఫీస్ బేరర్లుగా ఉన్న అధికారులకు, ఉద్యోగులకు కూడా చేదు అనుభవం ఎదురైనట్లు తెలిసింది. ఆఫీస్ బేరర్లు.. కలెక్టర్ నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉంది. బదిలీల సమయానికి కలెక్టరేట్ నుంచి ప్రొసీడింగ్స్.. కమిటీకి అందకపోవడంతో తమకు ఏ స్థానం కేటాయిస్తారోనన్న సందేహాలను ఆ వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి.

దరఖాస్తు చేయకపోయినా..

వ్యవసాయశాఖలో బదిలీకోసం దరఖాస్తు చేయనివారికి సైతం స్థాన చలనం కలుగుతోంది. ఒక స్థానాన్ని అయినవారికి కేటాయించేందుకు అక్కడున్నవారిని కదిలిస్తున్నారు. ఏమాత్రం సమాచారం ఇవ్వకుండా, వారి అంగీకారాన్ని అడగకుండా బదిలీ చేసేస్తున్నారు. ఈ జాబితాలో కేవలం రెండేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారు, చార్జెస్ ఉన్నవారు కూడా ఉండడం గమనార్హం. అయినవారికి ఇవ్వాలనుకుంటే తమకు సమాచారమైనా ఇవ్వాలి కదా..? చెప్పాపెట్టకుండా ఎలా బదిలీ చేస్తారని బాధితులు ప్రశ్నిస్తున్నారు. సిఫార్సులకు ప్రాధాన్యం ఇచ్చేక్రమంలో తమను బలిపశువులను చేస్తున్నారని మండిపడుతున్నారు. ఈ తతంగానికి జేడీ కార్యాలయం వేదికైంది. కౌన్సెలింగ్ ప్రక్రియను సోమవారం రాత్రి తలుపులు వేసుకుని మరీ కానిచ్చేశారు. ఈ అక్రమాల వెనుక ప్రజా ప్రతినిధుల ఒత్తిళ్లు ఉన్నాయా..? లేక ఆ శాఖ ఉన్నతాధికారుల అక్రమాలు ఉన్నాయా అన్న చర్చ జరుగుతోంది.



కౌన్సెలింగ్‌కు హాజరైన వ్యవసాయ అధికారులు, ఉద్యోగులు

నా కుమారుడి మృతిపై

విచారించి.. న్యాయం చేయండి

వెట్టి కార్మికురాలు అంకమ్మ

విజయవాడ, మే 26 (ఆంధ్రజ్యోతి): తన కుమారుడి మృతిపై సమగ్రంగా విచారించి నిందితులను కఠినంగా శిక్షించి తమకు న్యా యం చేయాలని తిరుపతి జిల్లాలోని చవటపాలెంకు చెందిన అంకమ్మ అనే మహిళా రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. విజయవాడ నగరం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆమె మాట్లాడారు. తొమ్మిదేళ్ల క్రితం భర్తతో కలిసి ఓ బాతుల వ్యాపారి వద్ద పనికి చేరామని, ఈ క్రమంలో వ్యాపారి నుంచి కొంత డబ్బు అప్పుగా తీసుకున్నామని ఆమె చెప్పారు. మూడు నెలల కిందట అప్పు కోసం తమ 9 ఏళ్ల కుమారుడిని వ్యాపారి తీసుకెళ్లాడన్నారు. ఆ డబ్బు చెల్లించి కుమారుడిని తీసుకువచ్చేందుకు వెళ్లగా అక్కడ తమ కుమారుడు లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆమె వివరించారు. బాలుడు అనారోగ్యంతో మరణించడంతో తమిళనాడులో పూడ్చినట్లు పోలీసులకు సమాచారం అందిందని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేశారు. వెట్టి విమోచన వేదిక కన్వీనర్ సునీల్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో యానాది వంటి అణగారిన వర్గాల ప్రజలు బాండెడ్ లేబర్‌కు బలైపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో వెట్టి బాండెడ్ లేబర్ బాధితుల కోసం ప్రత్యేక రాష్ట్రస్థాయి హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్రంలో వెట్టి చాకిరి వ్యవస్థను నిర్మూలించేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. వెట్టి కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో విజిలెన్స్ కమిటీలను ఏర్పాటు చేసి పర్యవేక్షించాలని కోరారు.

అల్లకల్లోలంగా సముద్రం



తూపిలిపాళెం సముద్ర తీరంలో ఎగిసిపడుతున్న అలలు

నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండంతో వాకాడు మండలం తూపిలిపాళెం సముద్రం అల్లకల్లోలంగా మారింది. సముద్రం నుంచి వీస్తున్న గాలులకు భారీ కెరటాలు ఉవ్వెత్తున ఎగిసిపడుతున్నాయి. ఆదివారం మధ్యాహ్నం నుంచి వాతావరణంలో మార్పులు చోటుచేసుకోవడంతో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. తూపిలిపాళెం, శ్రీనివాసపురం, మనపాళెం, వైట్‌కుప్పం తీరాలలో వాయుగుండం ప్రభావంతో సముద్రం ముందుకువచ్చిందని మత్స్యకారులు సోమవారం తెలిపారు. వాయుగుండం ప్రభావంతో రెండు గంటలపాటుగా ఎడతెరపిలేకుండా వర్షం పడింది.

- వాకాడు, ఆంధ్రజ్యోతి

పసుపు పండుగకు తరలిరండి: టీడీపీ



మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు పాశం సునీల్‌కుమార్, నెలవల విజయశ్రీ

గూడూరు/ నాయుడుపేట టౌన్, మే 26 (ఆంధ్రజ్యోతి): కడపలో మంగళవారం నుంచి గురువారం వరకు మూడు రోజులపాటు జరగనున్న టీడీపీ మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని టీడీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గూడూరు నిర్వహించిన మినీమహానాడు విజయవంతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలందరూ కృషిచేశారన్నారు. ఇదే స్ఫూర్తితో మహానాడు కార్యక్రమాన్ని కూడా విజయవంతం చేయాలన్నారు. నియోజకవర్గ పరిధి నుంచి 5వేల మందికి పైగా మహానాడుకు తరలివచ్చేలా నాయకులు చొరవ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లురాజు, కిషోర్‌నాయుడు, పురుషోత్తంరెడ్డి, శివకుమార్, పెంచలయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు రేషన్ డీలర్ల సన్మానం

రేషన్ డీలర్ల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్‌ను సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వచ్చే నెల 1వ తేదీ నుంచి రేషన్ దుకాణాల ద్వారా సరుకులు అందజేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. డీలర్లు సక్రమంగా సరుకులను అందజేయాలని సూచించారు.

పండుగలా మహానాడు

పండగ వాతావరణంలో మహానాడును నిర్వహిస్తున్నట్లు సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యంతో కలసి మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తన అపార అనుభవంతో రాష్ట్రాన్ని శరవేగంగా అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. కడప జిల్లాలో ఈ నెల 27, 28, 29 తేదీలలో జరగబోవు మహానాడుకు నియోజకవర్గం నుంచి 5వేల మంది తరలివెళ్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ నియోజకవర్గంలోని అందరూ మహానాడులో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు విజయభాస్కర్‌రెడ్డి, చంద్రారెడ్డి, రమేష్, మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాసులునాయుడు, శంకరయ్య, సుధాకర్, ప్రసాద్‌నాయుడు, భాస్కర్‌రెడ్డి, సెల్వం, పళణి, రాజేంద్ర, సంచికృష్ణయ్య, సుధీర్ పాల్గొన్నారు.

రేషన్ సరుకులు సక్రమంగా అందించాలి



రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహిస్తున్న తహసీల్దారు చంద్రశేఖర్

గూడూరు, మే 26 (ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్లు లబ్ధిదారులకు పారదర్శకంగా రేషన్ సరుకులను అందజేయాలని తహసీల్దారు చంద్రశేఖర్ అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో గూడూరు పట్టణ, మండల ప్రాంతాల్లోని రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 1వ తేదీ నుంచి ప్రభుత్వం రేషన్ సరుకులను ఎండీయూ వాహనాల ద్వారా కాకుండా రేషన్ దుకాణాల్లోనే సరుకులు అందజేసేలా చర్యలు తీసుకుందన్నారు.

మహిళలు మామోగ్రామ్ చేయించుకోవాలి

బాలాయపల్లి, మే 26 (ఆంధ్రజ్యోతి): మహిళలంతా మమోగ్రామ్ చేయించుకోవాలని వైద్యాధికారి లియోనా అన్నారు. సోమవారం మండలంలోని నిడిగల్లు, అమిలిమి పంచాయతీలతో తిరుపతిలోని స్విమ్స్ ఆధ్వర్యంలో పింక్ బస్సుల ద్వారా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రొమ్ముక్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తించేందుకు 35 ఏళ్లు దాటిన ప్రతిమహిళ మామో గ్రామ్ పరీక్ష చేయించుకోవడం మంచిదన్నారు. ఆయా పంచాయతీల్లో 196 మందికి ఈ పరీక్షలను నిర్వహించామన్నారు. 29వ తేదీన గొట్టికాడు, నిండలి గ్రామాల్లో నిర్వహించనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు గాయత్రి, దొరబాబు, పద్మావతి, చైతన్యభాను, చంద్రమోహన్, స్థానిక నాయకులు రఘురెడ్డి, మునివెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ముగిసిన హనుమజ్జయంతి



గ్రామోత్సవంలో ఊరేగుతున్న హనుమంతుడు

సూళ్లూరుపేట, మే 26 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరు పేటలోని బాలాంజనేయ స్వామి ఆలయంలో జరుగుతున్న హనుమాన్ జయంతి ఉత్సవాలు వైభవంగా ముగిశాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా సోమవారం హనుమంతుడికి పలు రకాల పండ్లతో అలంకారం చేశారు. ఉదయం అభిషేకానంతరం పూజలు చేశారు. రాత్రి స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు వాకచర్ల రమేష్, రాధాకృష్ణ బట్టా సుబ్రమణ్యం కార్యక్రమంలో పాల్గొన్నారు.

కాళంగి నదిలో మృతదేహం వెలికితీత

మృతుడు గాండ్లవీధికి చెందిన సుబ్రమణ్యం



సూళ్లూరుపేట, మే 26 (ఆంధ్రజ్యోతి): కాలంగి నదిలో పడి చనిపోయిన యువకుడి మృతదేహాన్ని పోలీసులు సోమవారం వెలికి తీశారు. ఆదివారం సూళ్లూరుపేట చెంగాళమ్మ ఆలయ సమీపంలో కాళంగి నది వంతెన గోడను ద్విచక్ర వాహనం ఢీకొని ప్రమాద వశాత్తు నదిలో ఓ వ్యక్తి పడిపోయిన విష యం తెలిసిందే. ద్విచక్ర వాహనం నెంబరు ఆధారంగా పోలీసులు తల్లిదండ్రులకు సమాచారం అందించారు. మృతుడు సూళ్లూరుపేట పట్టణం గాండ్లవీధికి చెందిన పి.సుబ్రమణ్యం (27)గా గుర్తించారు. గాలింపు చర్యలు చేపట్టారు. చీకటి పడడంతో నదిలో గాలింపు చర్యలు నిలిపివేశారు. సోమ వారం ఉదయం బంధువులు, పోలీసులు కాళంగిలో గాలింపు చేపట్టి మృత దేహాన్ని వెలికితీశారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుక్కల డాడిలో చుక్కల దుప్పికి గాయాలు



చిట్టమూరు, మే 26(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని యాకసిరి అటవీ ప్రాంతంలో సోమవారం కుక్కల దాడిలో చుక్కల దుప్పి గాయపడింది. యాకసిరి చెంగాళమ్మ మాను సమీపంలోని తెలుగుగంగ కాలువ వద్ద చుక్కల దుప్పి ప్రమాదవశాత్తు పొలం వద్ద ఏర్పాటు చేసిన తంతికి తగిలి లేవలేని స్థితిలో పడిపోయింది. అక్కడే ఉన్న కుక్కలు దుప్పిపై దాడి చేస్తుండగా ఆదారిలో వస్తున్న ఉపాధి ఈసీ శరత్ కుమార్ గుర్తించి కుక్కల బారి నుంచి దుప్పిని రక్షించారు. ఈలోగా అది ఆందోళనకు గురైన దుప్పి పక్కనే ఉన్న తెలుగుగంగ కాలువలో పడిపోయింది. దీంతో ఆయన వెంటనే అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు. అటవీ అధికారులు అగ్నిమాపక సిబ్బంది సాయంతో వచ్చి దుప్పిని రక్షించారు. ఆటోలో తరలించి గాయాలకు వైద్యం చేయించారు. అనంతరం అడవిలో వదిలేశారు.

టీడీపీ నాయకులకు గుణపాఠం తప్పదు: వైసీపీ



మాట్లాడుతున్న నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి

వెంకటగిరిటౌన్, మే 26 (ఆంధ్రజ్యోతి): అక్రమ కేసులు బనాయిస్తున్న టీడీపీ నాయకులకు గుణపాఠం తప్పదని తిరుపతి ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి హెచ్చరించారు. సోమవారం మాజీ మంత్రి కాకాణి గోవర్దన్‌రెడ్డిని వెంకటగిరి జ్యుడిషియల్ కోర్టుకు తరలించడంతో ఆయనకు మద్దతుగా వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తప్పుడు కేసులకు ఫలితం అనుభవిస్తారని పేర్కొన్నారు. కాకాణి కడిగినముత్యంలా బయటకు వస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్, సూళ్లురుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య మాట్లాడుతూ వైసీపీ నాయకులపై కేసులు పెట్టుకోండి...దానికి రెండింతలు తిరిగి ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

అధ్యాపకులకు ఏఐపై శిక్షణ

గూడూరు అర్బన్, మే 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ఎలక్ట్రానిక్, కమ్యూనికేషన్ విభాగంలో అధ్యాపకులకు ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ పేరుతో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ రవిచంద్ర అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌లో వస్తున్న మార్పులపై ఆరు రోజుల పాటు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. విద్యార్థులకు సులభతరమైన బోధనను అందించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దత్తాత్రేయశర్మ, విశ్వక్సేనారెడ్డి, నీరజ, శక్తిమురుగన్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

విందూరు రోడ్డును అభివృద్ధి చేయాలని వినతి

గూడూరు అర్బన్, మే 26 (ఆంధ్రజ్యోతి): గూడూరు నుంచి విందూరు గ్రామం మీదుగా గిద్దలూరుకు వెళ్లేరోడ్డును అభివృద్ధి చేయాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పంటా శ్రీనివాసులురెడ్డి కోరారు. సోమవారం తిరుపతిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్లుగా ఈ రోడ్డును అభివృద్ధి పరచకపోవడంతో 15 గ్రామాలకు చెందిన ప్రజలు రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడుతున్నారని తెలియజేశారు.

ద్విచక్రవాహనం చోరీ

కోట, మే 26 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని విద్యానగర్‌లోని సాయినగర్‌లో మోటార్‌బైక్ చోరీపై కృష్ణ అనే యువకుడు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సాయినగర్‌లో నివాసం ఉంటున్న తన యూనిక్రాస్ ద్విచక్ర వాహనాన్ని ఇంటిబయట ఉంచగా చోరీకి గురైందని తెలియజేశాడు. ఓ వ్యక్తి చోరీ చేసినట్లు తమ ఇంటి ముందు ఉన్న సీసీ కెమెరాల ద్వారా గుర్తించామని వివరించాడు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు.

రొయ్యలగుంటల వద్ద కూలీ మృతి

చిల్లకూరు, మే 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బెస్తపాళెం రొయ్యల గుంటల వద్ద ఓ కూలీ మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు... శ్రీకాకుళానికి చెందిన అప్పన్న(35) బెస్తపాళెంలోని రొయ్యల గుంటల వద్ద కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో తోటి కూలీలతో కలిసి నిద్రించాడు. సోమవారం ఉదయం ఎంతకీ నిద్ర లేవలేదు. మృతిచెందినట్లు గుర్తించి సహచర కూలీలు యజమానికి తెలిపారు. ఆయన పోలీసులకు సమాచారం అందించాడు. అప్పన్న గుండెపోటుతో కానీ, పాముకాటుతో కానీ మృతిచెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిబంధనలు పాటించాలి

ఓజిలి, మే 26 (ఆంధ్రజ్యోతి) : వాహనదారులు రహదారి నిబంధనలు పాటించాలని ఎస్ఐ స్వప్న సూచించారు. ఓజిలి ఆర్అండ్‌బీ రహదారిపై సోమవారం ఆమె వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలతోపాటు, డ్రైవింగ్ లైసెన్సు, హెల్మెట్ తప్పనిసరిగా ఉండాలని సూచించారు. మలుపులు, ఇతర జనావాస ప్రాంతాలలో తక్కువ వేగంతో వెళ్లాలని తెలియజేశారు.

ఇంటిస్థలాలు కేటాయించాలని వినతి



తహసీల్దారు శరత్‌బాబుతో మాట్లాడుతున్న గ్రామస్తులు

తడ, మే 26 (ఆంధ్రజ్యోతి) : తమకు పూడికుప్పం గ్రామం వద్ద ఇళ్లస్థలాలు కేటాయించాలని ఇరకంకుప్పం గ్రామస్తులు తహసీల్దారు శరత్‌బాబును కోరారు. సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఆయన్ను కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు పూడికుప్పంలో ఇళ్లస్థలాల కేటాయింపునకు కలెక్టర్ అనుమతించారని, పూడి పంచాయతీ సర్పంచ్ పరమశివంరెడ్డి కోర్టుకు వెళ్లినా న్యాయస్థానం కూడా తమకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని గుర్తుచేశారు. అనంతరం తహసీల్దారు స్పందిస్తూ పూడికుప్పంలో సుమారు 7 ఎకరాల భూముల్లో 175 మందికి ఇళ్లస్థలాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. త్వరలో ఆ పనులు పూర్తిచేస్తామని అన్నారు. తహసీల్దారుతో సమావేశమైన వారిలో ఇరకంకుప్పం మత్స్యకార నాయకులు వాసు, వినోద్, పరమన్ తదితరులు ఉన్నారు.

మహానాడును విజయవంతం చేద్దాం

● వేలూరు మురళీకృష్ణారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న వేలూరు మురళీకృష్ణారెడ్డి

పెళ్లకూరు, మే 26 (ఆంధ్రజ్యోతి) : కడపలో చేపడుతున్న మహానాడును విజయవంతం చేసేందుకు భారీగా తరలివెళ్తున్నట్లు టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డి, పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర కార్యదర్శి దేవారెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డి, ఉమ్మడి నెల్లూరు జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు కందమూడి శివకుమార్ పేర్కొన్నారు. సోమవారం పెళ్లకూరులోని టీడీపీ సీనియర్ నాయకులు పేరం రమేష్‌నాయుడు నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో టీడీపీ నేతలతో కలసి మహానాడుకు వెళ్లేందుకు జనసమీకరణపై చర్చించారు. ఈ సందర్భంగా పేరం రమేష్‌నాయుడు మాట్లాడుతూ సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, మాజీఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, టీడీపీనేత కొండేపాటి గంగాప్రసాద్ ఆధ్వర్యంలో పెళ్లకూరు మండలం నుంచి మహానాడుకు 25 నుంచి 30 వాహనాలలో కార్యకర్తలను సమీకరిస్తున్నామన్నారు. మహానాడు విజయవంతం చేసేందుకు మంగళవారం ఉదయం 6.30 గంటలకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పెళ్లకూరు గ్యాస్ గోడౌన్‌కు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమలో టీడీపీ నాయకులు శిరసనంబేటి చైతన్య కృష్ణారెడ్డి, కలవకోలు మునీష్, కొచ్చెర్ల వెంకటరమణనయుడు (కేవీనాయుడు), నర్రావుల లోకేష్‌నాయుడు, పేరం సదీప్‌తేజ తదితరులు ఉన్నారు.

తాగునీటి కోసం ఆందోళన

వాకాడు, మే 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నిడిగుర్తి పంచాయతీ పరిధిలో 3వేల కుటుంబాలకు తాగునీటి సమస్య నెలకొనడంతో సోమవారం సుమారుగా 100 మందికి పైగా తహసీల్దారు కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. తహసీల్దారు రామయ్యకు, ఎంపీడీవో శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిడిగుర్తి పంచాయతీ పరిధిలో వల్లమేడు, నిడిగుర్తి, గొల్లపాళెం, బాలాజీనగర్, వేణుగోపాలపురం, శ్రీహరిపురం, నిమ్మవానిదిబ్బ గ్రామాలలోని భూముల్లో ఉప్పుపొరలు కలిగి ఉండటంతో వందల అడుగుల బోర్లువేసినా తాగునీరు దొరకడం లేదన్నారు. మనపాళెం ప్రాంతంలో బోర్లను వేసి నీటి సమస్య ఉన్న గ్రామాలకు తరలిస్తున్నప్పటికి వేసవి కాలంలో బోర్లల్లో నీరు అడుగంటిపోవడంతో నీటి ఎద్దడి నెలకొందని తెలియజేశారు. మనపాళెం పరిసరాలలో ప్రభుత్వ భూములను పలువురు ఆక్రమించుకొని అడుగడుగునా బోర్లు వేసి వేరుశనగ, పుచ్చ తదితర పంటలను చేపడుతున్నారని పేర్కొన్నారు. ఫలితంగా గ్రామాల తాగునీటి సమస్య పరిష్కారం కోసం వేసిన బోర్లలో నీటి సమస్య ఏర్పడుతోందని తెలిపారు. అధికారులు చొరవచూపి నీటి ఎద్దడి లేకుండా చూడాలన్నారు. స్పందించిన ఆర్‌డబ్ల్యూఎస్ ఎఈ నాగజ్యోతి, సర్పంచ్ నాగరాజులు మనపాళెం వద్ద బోరు పాయింట్‌ను వేశారు.



తహసీల్దారు కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టిన నిడిగుర్తి గ్రామ ప్రజలు, మనపాళెం వద్ద బోరు పాయింట్ వేయిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఎఈ నాగజ్యోతి, సర్పంచ్ నాగరాజులు

కారు బోల్తా.. ముగ్గురికి గాయాలు



రోడ్డుపై బోల్తాపడిన కారు



గాయపడిన వారిని ఆస్పత్రికి తరలిస్తున్న 108 సిబ్బంది

పెళ్లకూరు, మే 26 (ఆంధ్రజ్యోతి) : కారు బోల్తా పడి ముగ్గురు గాయపడ్డారు. ఈ ఘటన మండలంలోని పెన్నేపల్లి 71వ జాతీయ రహదరిపై సోమవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు ..నెల్లూరుకు చెందిన చంద్రశేఖర్ ఎస్‌బీఐలో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. చంద్రశేఖర్ భార్య తమిళనాడులోని రాయవేలూరులోని కెనరా బ్యాంకులో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తోంది. ఈ క్రమంలో తన తల్లిదండ్రులు పోలమ్మ, రమణయ్యలతో కలసి చంద్రశేఖర్ కారులో రాయవేలూరుకు వెళ్లారు. అనతరం రాయవేలూరు నుంచి తిరిగి వస్తుండగా మార్గమధ్యంలోని పెన్నేపల్లి వద్ద కారు అదుపుతప్పి బోల్తా పడింది. చంద్రశేఖర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. పోలమ్మ, రమణయ్యలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో నాయుడుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం చెన్నైకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి ఐదురోజులు యోగా శిక్షణ

కోట, మే 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 16 సచివాలయాలను నాలుగు క్లస్టర్లుగా విభజించి ఐదు రోజుల పాటు యోగాపై సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇస్తామని ఎంపీడీఓ దిలీప్‌కుమార్ నాయక్ తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం యోగా కార్యక్రమాలపై సచివాలయ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా నేర్చుకోవాలన్న యువకులకు, సచివాలయ సిబ్బందికి కోట 1వ సచివాలయం, చిట్టేడు ఉన్నత పాఠశాల, చెందోడు ప్రాథమిక పాఠశాల, సిద్ధవరం సచివాలయాల్లో మంగళ వారం నుంచి ఐదు రోజుల పాటు శిక్షణ ఇస్తామని వివరిం చారు. తర్వాత జూన్ 1వ తేదీ నుంచి ఆయా సచివాలయాల పరిధిలో గల ప్రజలకు శిక్షణ పొందిన సిబ్బంది అవగాహన కల్పిస్తారన్నారు. తహసీల్దార్, ఎంఈఓ, ఎంపీడీఓ, డిప్యూటీ ఎంపీడీఓల పర్యవేక్షలో ఈ యోగా కార్యక్రమాలు జరుగుతాయని ఎంపీడీఓ దిలీప్‌కుమార్ నాయక్ తెలిపారు.

సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దు



అధికారులకు సూచనలు ఇస్తున్న తహసీల్దార్ ద్వారకానాథ్‌రెడ్డి

పెళ్లకూరు,లోమే 26 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దని తహసీల్దార్ ద్వారకానాథ్‌రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం పెళ్లకూరు తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలను నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి గొడవర్తి ప్రవీణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మనోజ్ కుమార్, హౌసింగ్ ఏఈ వెంకయ్య, ఐకేపీ ఏపీఎం హేమామాలిని, పీఆర్ ఏఈ వెంకటేష్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సాయిలక్ష్మి ఉన్నారు.

మహానాడుకు తరలిరండి

ఓజిలి, మే 26 (ఆంధ్రజ్యోతి) : కడపలో ఈ నెల 27వ తేదీ నుంచి జరగనున్న తెలుగుదేశం పార్టీ మహానాడుకు పెద్దఎత్తున జనాన్ని తరలించేందుకు ఓజిలి మండల టీడీపీ యంత్రాంగం సమాయత్తమైంది. ఈమేరకు మండల కన్వీనరు విజయకుమార్ నాయుడు సోమవారం మండలంలోని అందరు క్లస్టర్ ఇన్‌చార్జిలు, అనుబంధ శాఖల అధ్యక్ష, కార్యదర్శులు పార్టీ అభిమానులు, క్రియాశీల సభ్యులతో చర్చించారు.

పీజీఆర్ఎస్‌కు మూడు వినతులు

ఓజిలి, మే 26 (ఆంధ్రజ్యోతి) : ఓజిలి తహసీల్దారు కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు మూడు అర్జీలు అందాయని తహసీల్దారు పద్మావతి అన్నారు. కాగా మండలంలోని అత్తివరం, గ్రద్దగుంట గ్రామాలలో రీసర్వే కార్యక్రమాలు కొనసాగుతున్నాయని ఇప్పటికే ఫీల్డు వెరిఫికేషన్ పూర్తికావస్తుందని తహసీల్దారు తెలిపారు.

సూళ్లూరుపేటలో వర్షం

సూళ్లూరుపేట, మే 26 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట చుట్టుపక్కల గ్రామాల్లో సోమవారం సాయంత్రం తేలికపాటి జల్లులతో కూడిన వర్షం కురిసింది. ఉదయం నుంచి కారుమబ్బులు కమ్ముకుని వాతావరణం చల్లగా ఉనింది. సాయంత్రం ఒక్కసారిగా ఆకాశం మేఘామృతమై తేలికపాటి గాలులతో కూడిన వర్షం అరగంటపాటు కురిసింది. గాలులు వీయడంతో పట్టణంలో పలుచోట్ల దాదాపు గంటపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.

చికిత్సపొందుతూ యువకుడి మృతి

చిల్లకూరు, మే 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్మళ్లదిబ్బ గ్రామానికి చెందిన అజారుద్దీన్(18)అనే యువకుడు నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెంఆడు. అజారుద్దీన్ ఆదివారం స్నేహితులతో కలిసి తాటి కాయలకు వెళ్లి వస్తుండగా పిడుగుపాటుకు అస్వస్థతకు గురయ్యాడు. దీంతో చికిత్స నిమిత్తం నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రి తరలించగా సోమవారం చికిత్సపొందుతూ మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొత్తపట్నంలో ఆధార్ సేవలు ప్రారంభం

కోట, మే 26 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కొత్తపట్నం సచివాల యంలో గిరిజన అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సోమవారం గిరిజనులకు ఆధార్ కేంద్రం ప్రారంభమైంది. కొత్తపట్నం, యమదినెన్న పాళెం, గున్నంపడియ, వావిళ్ల దొరువు, గోవిందపల్లి, గోవిందపల్లిపాళెం గ్రామాల్లో ఉన్న గిరిజనులు ఈ ఆధార్ కేంద్రానికి వచ్చి ఆధార్ సేవలు సద్వినియోగం చేసుకున్నారు. ఆయా సేవలను ఎంపీడీఓ దిలీప్ కుమార్‌నాయక్, పంచాయతీ కార్యదర్శి అల్లాభక్షుల పర్యవేక్షణలో జరిగాయి.

రేషన్‌కార్డులు.. సర్వర్ కష్టాలు

తడ, మే 26 (ఆంధ్రజ్యోతి) : కొత్త రేషన్‌కార్డు నమోదులో ఆధార్ అప్‌డేట్‌కు కష్టాలు తప్పడం లేదు. సర్వర్ ఎప్పుడు పనిచేస్తుందో...ఎప్పుడు ఆగిపోతుందో తెలియని పరిస్థితుల్లో జనం సచివాలయాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. ఉదయం 9 గంటల సమయంలో కొంతసేపు పనిచేసిన ఆ తరువాత అది పనిచేయకపోవడంతో జనాలకు చుక్కలు కనబడుతున్నాయి. సోమవారం పలు సచివాలయాల వద్ద జనం ఇలాగే నమోదు కోసం ఎదురుచూశారు. ఆధార్ అప్‌డేట్, చంటిబిడ్డ ఆధార్‌కోసం వచ్చిన జనం గంటల తరబడి సచివాలయాల వద్ద పడిగాపులు కాయాల్సి వచ్చింది.



ఆన్‌లైన్ అంతరాయంతో తడ సచివాలయం వద్ద కూర్చొని ఉన్న గ్రామస్తులు, చంటిబిడ్డతో వచ్చి ఎదురుచూస్తున్న మహిళ